PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 169 | విజయవాడ, బుధవారం 24 జనవరి 2024 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Wednesday 24 January 2024 | Rs

అమెరికాలో ఉద్యోగాల తెగ్గోత

- ఐటి వర్గాల్లో తీవ్ర ఆందోళన
- గతేడాది తొలగింపుల్లో 98 శాతం పెరుగుదల
- 2024లోనూ ఉద్వాసనలే..!
- బోనస్‌లకు ఎగనామం

లోపలి పేజీలో..

మున్సిపల్ వర్కర్స్‌కు 'సంక్రాంతి' కానుక

- జిఓ 12 విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మున్సిపల్ కార్మికులకు సమ్మె సందర్భంగా ప్రభుత్వం అంగీకరించిన సంక్రాంతి కానుక రూ.వెయ్యికి సంబంధించిన జిఓ ఎంఎస్ నెంబరు 12ను ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. జిఓ విడుదల పట్ల ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె నాగభూషణం, ఉమామహేశ్వరరావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సమ్మెకాలం వేతనం రూ.21 వేలతోపాటు రూ.24,500 వేతనంతో సహా రిటైర్మెంట్ బెనిఫిట్స్, దహన సంస్కారాలకు ఆర్థిక సాయం అందించే జిఓలను కూడా త్వరగా జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది.



కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న

బీహార్ జన నాయక్‌కు ప్రకటించిన రాష్ట్రపతి

న్యూఢిల్లీ : దేశంలో అత్యున్నత పౌర పురస్కారం భారత రత్న అవార్డును బీహార్ మాజీ ముఖ్యమంత్రి, 'సోషలిస్టు' నేత కర్పూరి ఠాకూర్‌కు మరణానంతరం ప్రకటించారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. "శ్రీ ఠాకూర్‌ను గౌరవించుకోవడం ద్వారా ప్రజాస్వామ్యానికి, సామాజిక న్యాయానికి చిహ్నంగా ఆయన పాత్రను ప్రభుత్వం గుర్తిస్తోంది. సమాజంలో అణగారిన వర్గాల్లో స్ఫూర్తిదాయకమైన నేతగా ఆయన విశేషమైన ప్రభావాన్ని చూపారు. భారత రాజ్యాంగ స్ఫూర్తికి ప్రతీక, సమానత్వం, సోదర భావం, అందరికీ న్యాయం కోసం పోరాడిన నేత" అని ఆ ప్రకటన పేర్కొంది. ఠాకూర్ మరణించిన 35 ఏళ్ళ తర్వాత, బుధవారం ఆయన శత జయంతి నేపథ్యంలో ఈ అవార్డు ప్రకటన వెలువడింది. 1988 ఫిబ్రవరి 17న ఆయన మరణించారు. బీహార్‌లోని సమస్తిపూర్‌లో నాయీబ్రాహ్మణ కమ్యూనిటీలో 1924లో కర్పూరి ఠాకూర్ జన్మించారు. సన్నకారు రైతు కుమారునిగా మొదలై ప్రముఖ రాజకీయ నేతగా ఎదిగే వరకు ఆయన జీవితమంతా వెనుకబడిన కులాల సంక్షేమం, అభివృద్ధికే అంకితమైంది, ఆయన రాజకీయ జీవితంలో అనేక మైలురాళ్ళు వున్నాయి. మొట్టమొదటి కాంగ్రేస్సేతర సోషలిస్టు ముఖ్యమంత్రిగా చరిత్ర సృష్టించారు. మొత్తంగా రెండుసార్లు ముఖ్యమంత్రిగా చేశారు. 1970 మొదటిసారి డిసెంబరు 1970 నుండి 1971 జూన్ వరకు స్వల్పకాలమే పనిచేసినా తిరిగి 1977 డిసెంబరు నుండి 1979 ఏప్రిల్ వరకు రెండోసారి ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయన ముఖ్యమంత్రిగా వున్న సమయంలో రాష్ట్రంలో మద్యంపై పూర్తి నిషేధం అమలు చేశారు. సామాజిక సంస్కరణల పట్ల ఆయనకు గల నిబద్ధతను ఈ చర్య తెలియచేస్తుంది. అభివృద్ధిలో వెనుకబడిన బీహార్‌లో అనేక పాఠశాలలు, కాలేజీలు ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారు.

వెనుకబడిన తరగతుల 'జననాయక్'

'జననాయక్'గా అందరికీ చిరపరిచితులైన ఆయన వెనుకబడిన వర్గాల కోసం పోరాడారు. వెనుకబడిన కులాలను మొదటగా సమీకరించిన ఆయన 1978 నవంబరులో బీహార్‌లో ప్రభుత్వ సర్వీసుల్లో వారికి 26శాతం రిజర్వేషన్ కల్పించేందుకు మార్గం సుగమం చేశారు. ఆయన మిగతా 7లో

వృద్ధికి రెక్కలు!

ఎన్నికల వేళ భారీగా నమోదు

- సర్కారు అంకెల గారడి
- 16.22 శాతంగా గణించిన ప్రణాళిక శాఖ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఎన్నికల వేళ రాష్ట్ర ప్రభుత్వం గణాంకాల గారడికి సిద్ధమౌతోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం వృద్ధి లెక్కలకు ప్రభుత్వం రెక్కలు తొడుగుతోంది. దీంతో గతంలో ఎన్నడూ కనీవిని ఎరుగని రీతిలో రాష్ట్రంలో వృద్ధి చోటుచేసుకున్నట్లు ప్రణాళిక శాఖ గణాంకాలు సిద్ధం చేసింది. ఈ ఊహాతీత వృద్ధి పట్ల ఆశాఖ అధికారులే విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నిజానికి 2023 ఆర్థిక సంవత్సరంలో భారీ వర్షాల కారణంగా వ్యవసాయం తీవ్రంగా దెబ్బతిన్న సంగతి తెలిసిందే. కరోనా తరువాత ఉపాధి రంగమూ ఇంకా పుంజుకోలేదు. ఐటి పరిశ్రమలు రాష్ట్రానికి ఇంకా ఆమడ దూరంలోనే ఉన్నాయి. అయినప్పటికీ ఈ అన్ని రంగాల్లోనూ భారీ వృద్ధి నమోదైనట్లు ప్రణాళిక శాఖ గణాంకాలు సిద్ధం చేసింది. రానున్న శాసనసభ సమావేశాల్లో ఈ గణాంకాలనే ప్రభుత్వం వినిపించనుందని సమాచారం.

2011 ధరల మేరకు, ప్రస్తుత ధరల మేరకు 2023-24 ఆర్థిక సంవత్సరంలో చోటుచేసుకున్న ఉన్న వృద్ధి వివరాలను ప్రణాళిక శాఖ రూపొందించింది. తాజా ధరల మేరకు 2022-23 ఆర్థిక సంవత్సరంలో జిఎస్‌డిపి ఏకంగా రూ.13,17,728 కోట్లుగా ఉన్నట్లు తేల్చారు. అదే గతేడాది అయితే జిఎస్‌డిపి రూ.11,33,837 కోట్లుగా ఉందని, దీంతో తాజాగా 16.22 శాతం వృద్ధిగా నమోదైందని ప్రణాళిక శాఖ వివరించింది. జివిఎ (గ్రాస్ వాల్యూ యాడెడ్) కూడా అదే స్థాయిలో నమోదైంది. గత ఏడాది 10,40,187 కోట్లుగా ఉన్న జివిఎ, ఈ ఏడాది 12,14,961 కోట్లకు చేరుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. అంటే ఒక్క ఏడాదిలోనే 16.80 శాతం వృద్ధి సాధించినట్లు నమోదైంది.

ప్రస్తుత ధరల మేరకు పలు రంగాల్లో వృద్ధి వివరాలు ఇవే (రూ. కోట్లలో)

విభాగం	2021-22	2022-23	వృద్ధి (%లో)
జిఎస్‌డిపి	11,33,837	13,17,728	16.22
జివిఎ	10,40,187	12,14,961	16.80
వ్యవసాయం	3,88,453	4,39,645	13.18
ఇండస్ట్రీ	2,43,923	2,83,821	16.36
సేవారంగం	4,07,810	4,91,496	20.52

ఆకాశంలో వ్యవసాయ వృద్ధి

రాష్ట్రంలో కీలక రంగమైన వ్యవసాయం విలువ ప్రతియేటా గణనీయంగా పెరిగిపోతున్నట్లు ప్రణాళిక శాఖ అంకెలు చెబుతున్నాయి. 2018-19లో వ్యవసాయ ఉత్పత్తి విలువ రూ.2,76,335 కోట్లుగా ఉండగా, అది 2022-23 నాటికి ఏకంగా రూ.4,39,645 కోట్లకు చేరుకుంటున్నట్లు గణాంకాల్లో పేర్కొన్నారు. ఇది గతేడాది మిగతా 2లో

వ్యక్తులను కట్టేసి, కొట్టే అధికారం పోలీసులకుందా ?

- ఖేడా సంఘటనను ప్రస్తావిస్తూ సుప్రీం వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : గార్బా ఉత్సవానికి ఆటంకం కలిగించారన్న ఆరోపణలతో 2022లో గుజరాత్‌లోని ఖేడా జిల్లాలో నలుగురు పోలీసులు ఒక స్తంభానికి ముస్లింలను కట్టివేసి బహిరంగంగా కొరడా దెబ్బలు కొట్టిన సంఘటనను సుప్రీం కోర్టు మంగళవారం పేర్కొంటూ అందుకు సంబంధించి కొన్ని వ్యాఖ్యలు చేసింది. 'మనుష్యులను స్తంభానికి కట్టేసి, కొట్టే అధికారం వారికి వుందా' అని ప్రశ్నించింది. ఇందుకు సంబంధించి చట్టంలో ఏదైనా అధికారం వుందా అని జస్టిస్ బి.ఆర్.గవాయ్ ప్రశ్నించారు. పైగా దాన్నంతా వీడియోలు కూడా తీసుకున్నారని మరో న్యాయమూర్తి జస్టిస్ సందీప్ మెహతా మధ్యలో జోక్యం చేసుకుంటూ మిగతా 7లో



లబ్ధిదారులతో పాటు బటను నొక్కి వైఎస్ఆర్ ఆసరా పథకం డబ్బులు జమచేస్తున్న ముఖ్యమంత్రి జగన్

'బాబు'కు బినామీ స్టార్ క్యాంపెయినర్లు

నాకు ప్రజలే స్టార్ క్యాంపెయినర్లు

వైఎస్ఆర్ ఆసరా నిధుల విడుదలలో ముఖ్యమంత్రి జగన్

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

'అమరావతి భూములకు బినామీలు ఉన్నట్టు... ఎన్నికల ప్రచారానికి చంద్రబాబుకు బినామీ స్టార్ క్యాంపయినర్లు ఉన్నారు' అని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. అనంతపురం జిల్లా ఉరవకొండలో మంగళవారం ఆయన వైఎస్ఆర్ ఆసరా పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 7.98 లక్షల స్వయం సహాయక సంఘాలకు రూ.6394.83 కోట్లను బటన్ నొక్కి జమ చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఎటువంటి వివక్షకూ తావులేకుండా బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారులకు మంచి చేసే కార్యక్రమాలను వైసిపి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అటువంటి పార్టీకి ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. చంద్రబాబుకు దోచుకోవడం, పంచుకోవడమే లక్ష్యమని ఆరోపించారు. అటువంటి వ్యక్తిని భుజానికి ఎత్తుకునేందుకు అనేకమంది స్టార్ క్యాంపెయినర్లు మిగతా2లో



శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో మాట్లాడుతున్న పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల

జగన్, చంద్రబాబులది స్వలాభం

- వైసిపి, టిడిపి కేంద్రానికి అమ్ముడుపోయాయి
- ప్రజలు తిరస్కరించినా రాష్ట్రంలో బిజెపి ఏలుబడే!
- పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, ఇచ్ఛాపురం, విజయనగరం కోట

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, టిడిపి అధినేత చంద్రబాబునాయుడు స్వలాభం కోసం మాత్రమే పనిచేస్తున్నారని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల విమర్శించారు. బిజెపికి టిడిపి, వైసిపి అమ్ముడుపోయాయని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రజలు ఓట్లు వేయకుండా బిజెపిని తిరస్కరించినా, రాష్ట్రాన్ని మాత్రం ఆ పార్టీయే ఏలుతోందని అన్నారు. బిజెపి చేతిలో కీలుబొమ్మలా జగన్ ప్రభుత్వం మారిందని విమర్శించారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో మంగళవారం ఆమె పర్యటించారు. ఇచ్ఛాపురంలో ప్రజాప్రస్థానం విజయస్తూపం వద్ద నివాళ్లర్పించారు. అనంతరం ఇక్కడి ఓ ఫంక్షన్ హాలులోనూ, విజయనగరంలో ఓ ప్రయివేట్ కల్యాణ మండపం లోనూ కాంగ్రెస్ నాయకులు, మిగతా 2లో

నర్సరావుపేట ఎంపి రాజీనామా

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి



తన పదవికి, వైసిపి ప్రాథమిక సభ్యత్వానికి పల్నాడు జిల్లా నర్సరావుపేట లోక్‌సభ సభ్యులు లావు శ్రీకృష్ణదేవ రాయులు రాజీనామా చేశారు. ఈ మేరకు గుంటూరులోని తన కార్యాలయంలో మీడియా సమావేశంలో మంగళవారం ఆయన తెలిపారు. రానున్న ఎన్నికల్లో పోటీ అంశంపై తన సీటు విషయంలో గత కొన్ని రోజులుగా అనిశ్చితి నెలకొన్నట్లు, నాయకులు, కార్యకర్తల్లో నెలకొన్న గందరగోళాన్ని తొలగించేందుకు తాను రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే, ఏ పార్టీలో చేరేదీ, తన భవిష్యత్తు కార్యాచరణ గురించి మాత్రం ఆయన స్పందించకుండా వేగంగా కారు ఎక్కివెళ్లిపోయారు. శ్రీకృష్ణదేవ రాయులుని ఈసారి గుంటూరు లోక్‌సభ నుంచి పోటీ చేయాలని వైసిపి అధిష్టానం కోరగా అందుకు ఆయన నిరాకరిం చారు. పలువురు ఎమ్మెల్యేలు నచ్చజెప్పినా వైసిపి అధిష్టానం అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

సమ్మె విజయవంతం

- అంగన్‌వాడీ సంఘాల ప్రకటన
- సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపిన నాయకులు



అభివాదం చేస్తున్న అంగన్‌వాడీ సంఘాల నేతలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డిసెంబర్ 12వ తేదీ నుండి చేపట్టిన సమ్మె విజయవంతం అయిందని అంగన్‌వాడీ సంఘాలు ప్రకటించాయి. మంగళవారం విజయవాడ బాలోత్సవ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బేబీరాణి, కె.సుబ్బరావమ్మ, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర నాయకులు మంజుల, ఎపి ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియు) ప్రధాన కార్యదర్శి వి.ఆర్.జ్యోతి మాట్లాడారు. సోమవారం రాత్రి రెండుగంటల పాటు మంత్రులతో జరిగిన చర్చలు సఫలం అయ్యాయని ప్రకటించారు. యూనియన్లు అడిగిన వాటిలో ఎక్కువ డిమాండ్లు అంగీకరించడంతో సమ్మెను విరమించామని తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేసిన పిడిఎఫ్ ఎమ్మెల్సీలు, మంత్రులు, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. విలేకరుల సమావేశంలో సిఐటియు అనుబంధ సంఘ ఉపాధ్యక్షులు లక్ష్మీదేవి, చంద్రావతి, ఐఎఫ్‌టి యు నాయకులు భారతి, ఎఐటియుసి నాయకులు సరళ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అంగీకరించిన డిమాండ్ల వివరాలను వారు వెల్లడించారు.

నిర్బంధాన్ని ఎదిరించి కోర్కెలు సాధించుకున్న అంగన్‌వాడీలకు అభినందనలు : సిపిఎం

3

చర్చల్లో ప్రభుత్వం అంగీకరించిన డిమాండ్లు

- అంగన్‌వాడీల వేతనాలు జులైలో పెంచుతామని, యూనియన్లకు ప్రభుత్వానికి ఇద్దరికీ ఆమోదయోగ్యమైన వేతనాన్ని పెంచడానికి రాత.పూర్వక హామీ.
- గ్రాట్యూటీకి సంబంధించి కేంద్రానికి సిఫార్సు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఉద్యోగ విరమణ సమయంలో ఇచ్చే ప్రయోజనాన్ని వర్కర్లకు రూ.50 వేల నుండి రూ.1.20 లక్షలకు, హెల్పర్‌కు రూ.60 వేలు చెల్లించడానికి అంగీకారం,
- మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ జిఓ మిగతా 2లో

కృష్ణపట్నంలో కంటైనర్ టెర్మినల్‌కు షాక్!

- తమిళనాడుకు తరలిపోతున్న నౌకలు
- రాష్ట్ర ప్రభుత్వానికి కోట్లాది రూపాయల పన్ను ఆదాయానికి గండి
- భారీగా ఉపాధి, ఉద్యోగాలకు కోత



ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

ఆసియాలోనే అతి పెద్దదైన నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం పోర్టు తన ఉనికిని కోల్పోతోంది. దిగుమతి, ఎగుమతులతో భారీగా లాభాలు సంపాదించి పెట్టిన ఈ పోర్టుకు అదానీ సొంతం చేసుకున్న తరువాత ఈ ప్రమాదం వచ్చింది. విదేశాల నుంచి ఇక్కడకు వచ్చే కంటైనర్లను దారి మళ్లించారు. ప్రస్తుతం చెన్నయ్‌కు తరలించడంతో త్వరలో కృష్ణపట్నం కంటైనర్ టెర్మినల్‌ను మూసివేసేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు సమాచారం. అదే జరిగితే ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్న వేలాది మంది కార్మికులు వీధిన పడనున్నారు. పబ్లిక్ ప్రయివేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) విధానంలో ఈ పోర్టు నడిచేది. నవయుగ కంపెనీ దీనిని నిర్వహించేది. చెన్నయ్, విశాఖపట్నం, ముంబయ్ పోర్టులతో పోటీ పడుతూ ముందుకు దూసుకుపోయేది. ఇక్కడ కంటైనర్ల టెర్మినల్ కూడా ఏర్పాటైంది. ఓడ నుంచి నేరుగా కంటెనర్లను టెర్మినల్ సహాయంతో దించే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ పోర్టు సొంతం చేసుకుంది. ఇక్కడి నుంచి కొలంబో, అమెరికా, షాంగై, సింగపూర్‌లకు ఎగుమతులు, చైనా, మలేషియా, యుఎఇ, దుబాయ్, థాయిలాండ్ నుంచి దిగుమతులు ఎక్కువగా ఉండేవి. ప్రధానంగా బియ్యం, పొగాకు, గుంటూరు మిరప, పత్తి, రాయి, రొయ్యలు, ఇనుప ఖనిజం ఎగుమతులు జరిగేవి. తిరుపతి జిల్లా శ్రీ సిటీ నుంచి మోటారు పరిశ్రమలకు సంబంధించిన పరికరాలు, పేపర్ రోల్స్, వైట్ సిమెంట్, సోలార్ ఫ్యానల్స్, ఫర్నిచర్, ఎల్ఇడి లైట్లు, ముడి పామాయిల్, కెమికల్స్ విదేశాల నుంచి దిగుమతి అయ్యేవి. 2006 నుంచి దిగుమతులు, ఎగుమతులు పెరుగుతూ వచ్చాయి. 2019లో ఆరు లక్షల కంటైనర్లు ఇక్కడ నుంచి ఎగుమతి, దిగుమతి అయ్యాయి. సుమారు రూ.9 లక్షల కోట్లు ఏటా లావాదేవీలు సాగేవి. ఈ పోర్టులోని 44 బెర్తులు కళకళలాడుతూ ఉండేవి. పోర్టులో వ్యాపార కార్యకలాపాలు, లాభాలు భారీగా పెరిగాయి. ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వానికి వెయ్యి కోట్లు స్టేట్ ట్యాక్స్ రూపంలో ఆదాయం వచ్చింది. సుమారు పది వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించేది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడబలుక్కొని 2022లో ఈ పోర్టును అదానీకి కట్టబెట్టాయి. ఆ తర్వాత పరిస్థితి మారింది. ఇక్కడి ఎగుమతులు, దిగుమతులను తమిళనాడులోని అదానీకి చెందిన కాటుపల్లి, ఎన్నూరు పోర్టులకు క్రమంగా మార్చేశారు. ఆర్నెల్ల నుంచి ఈ తతంగం ఎక్కువగా సాగుతోంది. దీంతో, కృష్ణపట్నంలోని ఐదారు బెర్తులు, టెర్మినర్లు మాత్రమే వినియోగంలో ఉంటున్నాయి. మిగిలినవి కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి. కంటైనర్ల మళ్లింపుతో ప్రస్తుతం కృష్ణపట్నం పోర్టు నుంచి బొగ్గు, బూడిద మాత్రమే ట్రాన్స్‌పోర్టు అవుతోంది. కస్టమ్స్ హౌస్ ఏజెంట్, కంటైనర్ ఫ్రైట్ స్టేషన్, లైనర్ ఏజెంట్స్, యార్డ్స్, ట్రాన్స్ పోర్టర్స్, లేబర్ కాంట్రాక్టర్స్, హౌస్ కీపింగ్, సెక్యూరిటీ, డ్రైవర్స్, ఆపరేటర్స్, డైలీ వేజ్ లేబర్ తదితర విభాగాల్లో కార్మికులకు పనులు దొరకడం గగనంగా మారింది. కంటైనర్లు ఇక్కడి రావడం లేదనే పేరుతో ఈ విభాగాలను ఎత్తివేసే ఆలోచనలో పోర్టు యాజమాన్యం ఉన్నట్లు మిగతా 2లో

గంటా రాజీనామా ఆమోదం

అమరావతి బ్యూరో/ గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రాజీనామాకు శాసనసభ స్పీకరు తమ్మినేని సీతారామ్ ఆమోదం తెలిపారు. ఈ మేరకు అసెంబ్లీ కార్యదర్శి మంగళవారం నోటిఫికేషన్ జారీ చేశారు. విశాఖ నార్త్ ఎమ్మెల్యేగా 2019లో టిడిపి నుంచి గెలుపొందిన గంటా శ్రీనివాసరావు... విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ ను వ్యతిరేకిస్తూ 2021 ఫిబ్రవరి 12న ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయగా, అప్పటి నుంచి ఈ అంశం పెండింగ్‌లో ఉంది. త్వరలో రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో రాజీనామాను స్పీకరు ఆమోదించడం రాజకీయ వర్గాల్లో చర్చకు తెరలేపింది.

ఓటుహక్కుపై న్యాయ సలహా : గంటా

వచ్చే రాజ్యసభ ఎన్నికల్లో తన ఓటు వినియోగించుకోవడానికి ప్రయత్నిస్తానని, న్యాయ సలహా తీసుకుంటానని గంటా శ్రీనివాసరావు తెలిపారు. విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మూడేళ్ల క్రితం రాజీనామా చేస్తే.. ఎన్నికలు మూడు నెలలు ఉండగా ఆమోదిస్తారా? అని ప్రశ్నించారు. 'నన్ను సంప్రదించకుండానే రాజీనామా ఆమోదించారు. జగన్‌కు రాజ్యసభ ఎన్నికల భయం పట్టుకుంది' అని ఎద్దేవా చేశారు.

గుజరాత్‌లో మద్యానికి తలుపులు తెరిచిన బిజెపి

గిఫ్ట్ సిటీలో అనుమతించిన ప్రభుత్వం

గాంధీనగర్ : మద్యపానం ఆరోగ్యానికి హానికరం..మద్యాన్ని సంపూర్ణంగా నిషేదించాలని నినదించి మద్య రహిత సమాజాన్ని ఆకాంక్షించిన మహాత్మాగాంధీ నడిచిన నేలపై బిజెపి ప్రభుత్వం మద్యపానానికి మళ్లీ తలుపులు తెరిచింది. గుజరాత్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మద్య నిషేధానికి పాక్షికంగా మంగళం పాడింది. రాజధాని గాంధీనగర్ సమీపంలోని గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్-సిటీ (గిఫ్ట్ సిటీ)లో ఉన్న హోటళ్లు, రెస్టారెంట్లు, క్లబ్బుల్లో మద్యాన్ని విక్రయించేందుకు అనుమతులు జారీ చేసింది. అంతర్జాతీయ ఆర్థిక సంస్థలను ఆకర్షించడానికి ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. గిఫ్ట్ సిటీలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు, యజమానులకు మాత్రమే మద్యాన్ని సేవించే అవకాశం ఉంటుందని పేర్కొంది. వీరిని నిషేధపు చట్టం నుండి మినహాయిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. గుజరాత్ మద్య నిషేద చట్టం ప్రకారం రాష్ట్రంలో మద్యం వినియోగం చట్టవిరుద్ధం. సంపూర్ణంగా మద్య నిషేదం అమల్జేయాల్సివుంది. వాస్తవానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి గుజరాత్‌లో మద్య నిషేధం అమలులో ఉంది. రాష్ట్రంలో మద్యం ఉత్పత్తి, నిల్వ, అమ్మకం, వినియోగం కూడా నేరమే. జాతిపిత మహాత్మాగాంధీ జన్మస్థలమైన గుజరాత్ రాష్ట్రంలో మద్య నిషేధాన్ని పాక్షికంగా ఎత్తివేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రాహుల్ యాత్రకు అడుగడుగునా అడ్డంకులే

- అసోంలో జోడో న్యాయ్ యాత్రకు బిజెపి అవరోధాలు

7

26న ట్రాక్టరు, బైకు ర్యాలీలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 26న అన్ని జిల్లాల్లో ట్రాక్టరు, బైకు ర్యాలీలు నిర్వహించి నిరసనలు తెలిపాలని రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు కోరారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కార్పొరేట్ల కోసమే కేంద్రం పనిచేస్తోందని విమర్శించారు. వ్యవసాయం, పారిశ్రామిక, రవాణా, మైనింగ్‌లను అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు కట్టబెట్టి దేశ సంపదను వారికి దోచి పెడుతోందని పేర్కొన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా, ట్రేడ్ యూనియన్ ఐక్యవేదికల పిలుపు మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రిపబ్లిక్ డే రోజున చేపట్టనున్న ట్రాక్టరు, బైకు ర్యాలీలను జయప్రదం చేయాలని కోరారు.

బిల్లులు చెల్లించాల్సిందే : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

రోడ్లు, భవన నిర్మాణాల కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బిల్లులు ఎందుకు చెల్లించలేదని హైకోర్టు ప్రశ్నించింది. చెల్లింపులు చేయాలని గతేడాది మే 11న ఉత్తర్వులిస్తే ఇప్పటి వరకు ఎందుకు అమలు చేయలేదో చెప్పాలంది. తదుపరి విచారణ ఫిబ్రవరి 9కి వాయిదా వేస్తున్నామని, ఈలోగా చెల్లించాలని ఆదేశించింది. ఎన్నికల కోడ్ అమల్లోకి రాబోతోందని చెప్పి చెల్లింపులు చేయకపోతే కుదరదని, కోడ్ రాకముందే బిల్లులు చెల్లించాలని జస్టిస్ వి సుజాత తేల్చి చెప్పారు. బిల్లులు చెల్లించాలన్న గత ఉత్తర్వులు అమలు కాలేదంటూ పలువురు కాంట్రాక్టర్లు వేసిన పిటిషన్లపై హైకోర్టు మంగళవారం విచారణ జరిపింది. ఈసారి బిల్లులు చెల్లించకపోతే ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శిని స్వయంగా విచారణకు పిలిపిస్తామని చెప్పింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించండి

- ఎపి గ్రామీణ ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని ఎపి గ్రామీణ ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. ఈ మేరకు తాడేపల్లిలోని పంచాయతీరాజ్ కమిషనర్ జి సూర్యకుమారి, డైరెక్టరు చినతాతయ్యను ఎపి గ్రామీణ ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు మేడిది పరందామయ్య, బి నరసింహులు నాయకులు ఇరగాలయ్య, వీరేష్ గౌడ్, ఏడుకొండలు, మునియ్య తదితరులు మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. జనవరి 4న మహాధర్నా సందర్భంగా ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యల్లో ఎక్కువగా ఆర్థికపరమైన అంశాలు వున్నందున ప్రభుత్వానికి నివేదిస్తామని హామీ ఇచ్చారు.

దళితుల భూములకు నష్టం చేసే ఆర్డినెన్స్ ఉపసంహరించాలి

- ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అసైన్డ్ భూములకు పట్టా భూములతో సమానంగా అన్ని హక్కులూ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టా భూములతో సమానంగా అసైన్డ్ భూములకు అన్ని హక్కులూ కల్పించాలన్న హైకోర్టు ఆదేశాలు, 2013 భూసేకరణ చట్టాలను పక్కనబెట్టి సమాన హక్కులు కల్పించలేమని రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చిందని తెలిపారు. ఇది అత్యంత దుర్మార్గమని అన్నారు. 20 లక్షల మంది దళిత, బలహీన తరగతులకు చెందిన కుటుంబాలకు తీవ్ర నష్టం జరుగుతుందని వివరించారు. వెంటనే ఆర్డినెన్స్‌ను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో న్యాయ, ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమవుతామని తెలిపారు.

రాజకీయాల్లోకి మతం చొరబడితే ప్రమాదం

- లెనిన్ శత వర్ధంతిలో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, సిపిఐ నేత ఓబులేసు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ

ప్రజాశక్తి - విజయవాడ

మతం వ్యక్తిగత విశ్వాసమని, దానిని రాజకీయాల్లోకి చొప్పించి లబ్ధిపొందాలని బిజెపి-మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మాజీ ఎమ్మెల్సీ, ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎంవిఎస్ శర్మ అన్నారు. ఇది అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. సోషలిస్టు వ్యవస్థాపకులు, మహోన్నత నేత లెనిన్ శత వర్ధంతి సందర్భంగా విజయవాడలోని లెనిన్ విగ్రహం వద్ద మంగళవారం ఆట-పాట-మాట కార్యక్రమం నిర్వహించారు. లెనిన్ శత వర్ధంతి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్, ఎపిపిఎస్ఎం రాష్ట్ర అధ్యక్షులు పి.చంద్రానాయక్ అధ్యక్షత వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి శర్మ మాట్లాడుతూ... అయోధ్యలో రామమందిరాన్ని బిజెపి తన రాజకీయ రంగం మీదకు తీసుకొచ్చిందని విమర్శించారు. అభివృద్ధి నిరోధక విధానాలను అవలంబిస్తోన్న బిజెపి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అన్ని రంగాల్లో ఘోరంగా విఫలమైన మోడీ ప్రభుత్వం ప్రజల ఆలోచనా ధోరణిని మరల్చేందుకు ప్రయత్నిస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు ప్రతి విషయంలోనూ ప్రధాని మోడీ వద్ద సాగిలపడుతున్నారని విమర్శించారు. బాధల నుండి ప్రజలను విముక్తి చేసేది మార్క్సిజం-లెనినిజమేనని తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు మాట్లాడుతూ.. బిజెపి రాజకీయాల్లోకి మతాన్ని తెచ్చి దేశాన్ని భ్రష్టు పట్టిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రగతికి లెనిన్ సిద్ధాంత భావజాలం ఆవశ్యకత పెరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా రైతు దీనస్థితిని తెలియజేసే నృత్య రూపకాన్ని కళాకారులు ప్రదర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, ప్రజాశక్తి బుక్‌హౌస్ ఎడిటర్ ఎస్.వెంకట్రావు, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, నాయకులు వరప్రసాద్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, సాహితీవేత్తలు గుమ్మ సాంబశివరావు, వెన్న వల్లభరావు, లంకా దుర్గారావు, సీనియర్ గాయకులు ఎ.జగన్ తదితరులు పాల్గొన్నారు. నిర్వహణ కమిటీ సభ్యులు, ప్రజాశక్తి బుక్‌హౌస్ జనరల్ మేనేజర్ కె లక్ష్మయ్య, సాహితి పోషకులు గోళ్ల నారాయణరావు, బుడ్డిగ జమీందార్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ టి.మనోహర్ నాయుడు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

యువతకు స్ఫూర్తి సుభాష్ చంద్రబోస్

- సిఎం జగన్ నివాళి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్వాతంత్ర్య సమరయోధులు, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ యువతలో స్ఫూర్తిని నింపిన గొప్ప నాయకుడని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సుభాష్ చంద్రబోస్ 127వ జయంతి సందర్భంగా తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సిఎం మంగళవారం నివాళులర్పించారు. సుభాష్ చంద్రబోస్ దేశ సేవకు, ధైర్య సాహసాలకు మారుపేరని పేర్కొన్నారు. స్వతంత్ర భారతావనే లక్ష్యంగా పోరాడి, దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన గొప్ప వ్యక్తి సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. యువతలో స్ఫూర్తిని నింపి వారిని స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములను చేశారని ఈ సందర్భంగా ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

నేతాజీ స్ఫూర్తిని భావితరాలకు అందించాలి : పవన్‌కల్యాణ్

స్వాతంత్ర్య సంగ్రామన దేశ యువతలో పోరాట స్ఫూర్తిని నింపిన చిరస్మరణీయ యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. టోక్యోలోని రెంకోజి టెంపుల్‌ను సందర్శించిన సమయంలో నేతాజీ స్మారకాలను దర్శించుకున్న సమయంలో ఆ పోరాట యోధుడి త్యాగనిరతి తన మదిలో మెదిలిందని పేర్కొన్నారు.

'వెలిగొండ' రెండో టన్నెల్‌లో

బ్రేక్ త్రూ విజయవంతం

- సిబ్బందిని అభినందించిన మేఘా



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రకాశం జిల్లాలోని పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు రెండో టన్నెల్ నిర్మాణ పనుల్లో బ్రేక్ త్రూ పనులు విజయవంతమయ్యాయి. వెలిగొండ ప్రాజెక్టులో 15 ఏళ్ల క్రితం మొదలైన టన్నెల్ నిర్మాణ పనుల్లో కీలకమైన రెండో టన్నెల్ బ్రేక్ త్రూ పూర్తయినందున చిన్నచిన్న పనులు మినహా అన్నీ పూర్తయినట్లే. మంగళవారం నాటికి రెండో టన్నెల్ బ్రేక్ త్రూ కావడంతో నిర్మాణ కంపెనీ మేఘా హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు నిర్మాణ పనుల్లో భాగస్వామ్యం అయిన సిబ్బందిని, అధికారులను కంపెనీ ప్రాజెక్టు మేనేజరు పి రాంబాబు అభినందించారు. వెలిగొండ ప్రాజెక్టుకు శ్రీశైలం నుంచి నీటిని తీసుకునేందుకు రెండు టన్నెల్ నిర్మాణ పనులను 15 ఏళ్ల క్రితం చేపట్టారు. బోరింగ్ మెషిన్ ద్వారా రెండు టన్నెల్స్ నిర్మాణాన్ని మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ పూర్తి చేసింది. వెలిగొండ ప్రాజెక్టులోని మొదటి టన్నెల్‌లో 3.6 కిలోమీటర్లు, రెండో టన్నెల్‌లో ఏడున్నర కిలోమీటర్ల పనులను మేఘా కంపెనీ 2020లో చేపట్టింది. 2021 నాటికి మొదటి టన్నెల్ పనులను పూర్తి చేయగా, రెండో టన్నెల్‌ను మంగళవారం నాటికి బ్రేక్ త్రూ చేసి దాదాపు పూర్తి చేసినట్లయింది. ఈ టన్నెల్ నిర్మాణం పూర్తయితే శ్రీశైలం జలాశయం నుంచి నీటిని తీసుకుని వెనుకబడిన ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాల్లో సాగు నీటిని అందించవచ్చు. అలాగే ఆ మూడు జిల్లాల్లోని 30 మండలాలకు చెందిన 16 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందుతుంది. శ్రీశైలం రిజర్వాయర్‌లోనే నీటిపై పంటల సాయంతో ఇసుక, స్టీల్ ఇతర వస్తు సామగ్రిని తరలించి అటవీ ప్రాంతంలో నిర్మించిన టన్నెల్ పనులను సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు, సిబ్బంది ఎంతో కృషి చేశారని మేఘా ప్రాజెక్టు మేనేజర్ పి రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం అంతా నీలం సంజీవరెడ్డి పులుల అభయారణ్యం పరిధిలో వుండటంతో పలు జాగ్రత్తలు తీసుకుంటూ, అన్ని పర్యావరణ నిబంధనలనూ పాటిస్తూ పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు.

'సెమ్‌కార్ప్'తో ఎపి గ్రిడ్ అనుసంధానం

- ఏడాదికి సగటున రూ.365 కోట్ల ఆదాయం
- ఇంధనశాఖ స్పెషల్ సిఎస్ విజయానంద్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకంలో ఎపి ట్రాన్స్‌కో చేపట్టిన కార్యక్రమం ద్వారా భారీ ఆదాయానికి మార్గం సుగమైందని ఇంధనశాఖ స్పెషల్ సిఎస్ విజయానంద్ పేర్కొన్నారు. ఈ ప్రక్రియతో ప్రత్యక్షంగా విద్యుత్తు పంపిణీ సంస్థలకు, అటు పరోక్షంగా విద్యుత్తు వినియోగదారులకు ఏడాదికి సగటున రూ.365 కోట్లకు పైగా ఆదా అవుతుందని తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్తు కొనుగోలు ఒప్పందం (పిపిఎ)లో భాగంగా సెమ్‌కార్ప్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ (ఎస్ఇఐఎల్)కు చెందిన పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని థర్మల్ పవర్ ప్లాంటు నుంచి రాష్ట్రంలోని విద్యుత్తు పంపిణీ సంస్థలు (డిస్కమ్‌లు) అవసరాల కోసం విద్యుత్తు కొనుగోలు చేస్తున్నాయని తెలిపారు. ఇప్పటి వరకు ఈ ప్లాంటు నుంచి పవర్‌గ్రిడ్‌కు చెందిన ట్రాన్స్‌మిషన్ లైన్ ద్వారా ఎపి ట్రాన్స్‌కోకు చెందిన రాష్ట్ర గ్రిడ్‌కు, అక్కడ నుంచి డిస్కమ్‌లకు విద్యుత్తు సరఫరా అవుతోందన్నారు. పవర్‌గ్రిడ్ ట్రాన్స్‌మిషన్ లైన్ వినియోగించుకున్నందుకు ఆ సంస్థకు యూనిట్‌కు 72 పైసలు చొప్పున ఎపి ట్రాన్స్‌కో చెల్లిస్తుందన్నారు. రోజుకు సగటున రూ.కోటి, ఏడాదికి రూ.365 కోట్లు పవర్‌గ్రిడ్‌కు ట్రాన్స్‌కో చెల్లిస్తోందని పేర్కొన్నారు.

ఈ భారం డిస్కమ్‌లపైనా, ప్రజలపైనా పడుతూ వస్తోందని తెలిపారు. వృథా నియంత్రణ, ఆదా లక్ష్యాలుగా సెమ్‌కార్ప్ థర్మల్ విద్యుత్తు కేంద్రానికి ఎపి ట్రాన్స్‌కో ట్రాన్స్‌మిషన్ లైన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని విజయానంద్ పేర్కొన్నారు. 5 కిలోమీటర్లు పొడవునా ఈ లైన్ నిర్మాణం ప్రాజెక్టు పూర్తి కావడంతో మంగళవారం ఎపి ట్రాన్స్‌కో అధికారులు సెమ్‌కార్ప్ థర్మల్‌పాంటు లైన్‌ను పవర్‌గ్రిడ్ లైన్ నుంచి తప్పించి ఎపి గ్రిడ్‌కు, అక్కడ నుంచి డిస్కమ్‌లకు విద్యుత్తు సరఫరా అవుతోందన్నారు. దీంతో యూనిట్‌కు ఒక రూపాయి వంతున ఆదా కానుందని, రోజుకు 15 మిలియన్ యూనిట్లు చొప్పున ఏడాదికి సుమారు 5,475 మిలియన్ యూనిట్లు విద్యుత్తు 'సెమ్‌కార్ప్' నుంచి రాష్ట్ర గిడ్‌కు సరఫరా అవుతోందన్నారు. ఈ కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేసేందుకు సహకరించిన అధికారులకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అభినందనలు తెలిపారు.

పనిచేయని బుజ్జగింపులు

- వైసిపిలో కలవరం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అధికార పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్‌కు తలనొప్పులు ఎక్కువవుతున్నాయి. తమ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు మరోసారి అధికారంలోకి తీసురానున్నాయని వైసిపి చెబుతున్నా ఆచరణలో వలసలు పెరుగుతుండటం ఆ పార్టీని కలవరపాటుకు గురిచేస్తున్నాయి. అసంతృప్తితో వున్న నాయకులను పిలిపించి ప్రత్యామ్నాయం చూపుతామన్నా ఖాతరు చేయకుండా పార్టీని వీడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. తాజాగా నర్సారావుపేట ఎంపి రాజీనామా చేయడం చర్చనీయాంశం అయ్యింది. నర్సారావుపేట పార్లమెంట్ స్థానానికి బిసికి ఇస్తున్నట్లు వచ్చిన వార్తలతో ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. దీంతో నష్టనివారణ చర్యల్లో భాగంగా నర్సారావుపేటకు అభ్యర్థిని మార్చబోమని వైసిపి పెద్దలు బుజ్జగించినా లావు శ్రీకృష్ణదేవరాయలు మంగళవారం పార్టీకి, ఎంపి పదవికి రాజీనామా చేశారు. వైసిపి బిసి సెల్ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి కూడా వైసిపి అధిష్టానం తీరుపట్ల ఆగ్రహంగా వున్నారు. తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించకపోతే తానే ప్రత్యామ్నాయం చూసుకుంటానని జంగా కృష్ణమూర్తి ప్రకటించారు. ఉరవకొండలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ డుమ్మా కొట్టడం చర్చనీయాంశం అయ్యింది. కర్నూలు జిల్లాకు పొరుగున వున్న ఉరవకొండకు సిఎం వచ్చినా గుమ్మనూరు జయరామ్ దూరంగా వుండటం చర్చనీయాంశం అయ్యింది. ఆలూరు అసెంబ్లీకి మరోసారి పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వకుండా కర్నూలు పార్లమెంట్ ఇన్‌ఛార్జిగా తనను ప్రకటించడాన్ని మంత్రి జయరామ్ వ్యతిరేకిస్తూ ప్రత్యామ్నాయం చూసుకుంటున్నారని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఇపుడు సిఎం సభకు దూరంగా వుండటం చర్చనీయాంశమైంది. కొలుసు పార్థసారథిని కూడా బుజ్జగించినా ఆయన టిడిపిలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

నందికొట్కూరు ఎమ్మెల్యే టి ఆర్థర్ కూడా తన అనుచరులతో సమాలోచనలు చేస్తున్నారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని ఏకంగా ముఖ్యమంత్రి బుజ్జగించినా మెత్తబడని పరిస్థితి వుంది. నెల్లూరులో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కూడా వైసిపి అధిష్టానం పట్ల తన అసంతృప్తిని బహిర్గతం చేస్తున్నారు. ఏడాది క్రితమే నలుగురు ఎమ్మెల్యేలు పార్టీకి దూరం కాగా, రాష్ట్రంలో ఎన్నికల వేడి మొదలయ్యాక మరో ఇద్దరు ఏకంగా రాజీనామా చేయడం పలువురు ఎమ్మెల్యేలు పార్టీకి దూరంగా వుండటం, ఇద్దరు ఎంపిలు, ఇద్దరు ఎమ్మెల్సీలు ఏకంగా పార్టీకి రాజీనామా చేయడం చర్చనీయాంశం అయ్యింది.

రాజకీయ కక్షపూరిత పిల్

- రఘురామ పిల్‌ను కొట్టేయాలన్న జగన్

ప్రజాశక్తి-అమరావతి

నర్సాపురం ఎంపి కనుమూరి రఘురామ కృష్ణరాజు తనపై రాజకీయ దురుద్దేశాలతోనే పిల్ దాఖలు చేశారని హైకోర్టుకు సిఎం వైఎస్ జగన్ నివేదించారు. వైసిపి తరపున గెలిచిన రఘురామ.. పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడినందున ఆయనపై అనర్హత వేటు వేయాలని లోక్‌సభ స్పీకరుకు పార్టీ లేఖ రాసిన విషయాన్ని కూడా నివేదికలో ప్రస్తావించారు. అప్పటి నుంచి రాజు తనపై వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని చెప్పారు. పలు నిరాధార, తప్పుడు ఆరోపణలు చేస్తూ తన బెయిల్‌ను రద్దు చేయాలంటూ పిటిషన్ కూడా వేస్తే దానిని తెలంగాణ హైకోర్టు కొట్టేసిందన్నారు. తనపై ఉన్న క్రిమినల్ కేసుల గురించి పిల్‌లో రాజు వివరించలేదన్నారు. జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న పలు ప్రజా సంక్షేమ పథకాల అమలు వెనుక ఆయాచిత లబ్ధిపొందే వారున్నారని, ఈ వ్యవహారంపై సిబిఐ దర్యాప్తునకు ఆదేశించాలంటూ రాజు వేసిన పిల్‌ను కొట్టేయాలని కోరారు. పిల్‌ను మంగళవారం జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయితో కూడిన డివిజన్ బెంచ్ విచారణ జరిపింది. గతంలో హైకోర్టు.. జగన్ సహా 40 మందికి నోటీసులిచ్చింది. పిల్‌పై విచారణార్హతపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని కోరింది. దీంతో జగన్ పైవిధంగా తమ అభ్యంతరాలతో ప్రాథమిక కౌంటర్ పిటిషన్ దాఖలు చేశారు. ఇప్పటికే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దాఖలు చేసిన ప్రాథమిక కౌంటర్‌నే తమకు కూడా అన్వయింపజేయాలని పలువురు ప్రతివాదులు కోరారు. దీనిపై వివరణ ఇవ్వాలని రాజు తరపున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావును హైకోర్టు ఆదేశించింది. కౌంటర్ల కాపీలు ఇప్పుడే అందాయని, గడువు కావాలని ఉన్నం కోరారు. దీంతో విచారణ ఫిబ్రవరి 12కు వాయిదా పడింది.

అందరికీ ఉచిత వైద్యం

- కేంద్ర మంత్రి భారతి ప్రవీణ్ పవార్



ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులను పంపిణీ చేస్తున్న మంత్రి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

దేశంలో అందరికి ప్రభుత్వ వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ పవార్ అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులు అందుబాటులో లేనివారికి రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందించేందుకు ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులను ప్రజలకు అంది స్తున్నట్టు చెప్పారు. గుంటూరులోని అమరావతి రోడ్డులో మంగళవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఆమె పాల్గొన్నారు. యాత్రలో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన పెంచడం, వాటికి సంబంధించిన సమగ్ర సమాచారం అందించడం ఈ యాత్ర ముఖ్యోద్దేశమన్నారు. పేదలకు రుణాలను, ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేశారు. మంగళ గిరిలోని ఎయిమ్స్‌లో పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, కమిషనర్ కీర్తి చేకూరి పాల్గొన్నారు.

ఐపిఎస్ త్రిపాఠికి ముందస్తు బెయిల్

ప్రజాశక్తి-అమరావతి

హోంగార్డుల నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ ఐపిఎస్ అధికారి కృపానంద త్రిపాఠి ఉజేలాకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. మంగళగిరి పోలీసులు నమోదు చేసిన కేసులో ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ టి మల్లికార్జునరావు మంగళవారం విచారణ జరిపారు. హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి తన నుంచి రూ.4 లక్షలు తీసుకుని మోసం చేశారంటూ కడప జిల్లా వాసి తలారి మనోజ్ కుమార్ ఫిర్యాదు చేశారు. పోలీసులు నరేష్, అరవింద్‌పై కేసు నమోదు చేశారు. ఈ కేసుతో సంబంధం లేకపోయినా పోలీసులు తన ఇంటికి వస్తున్నారని, అరెస్టు చేయకుండా ఉత్తర్వులివ్వాలని త్రిపాఠి దాఖలు చేసిన పిటిషన్ తరపున సీనియర్ న్యాయవాది బి ఆదినారాయణరావు వాదించారు.

ఉక్కును ప్రయివేటీకరిస్తే ప్రజలే బుద్ధిచెబుతారు

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించాలని కుట్రలు చేస్తోన్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి రానున్న కాలంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1076వ రోజుకు చేరాయి. ఈ దీక్షల్లో స్టీల్ ఎస్ఎంఎస్ విభాగానికి చెందిన కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు విడివి.పూర్ణచంద్రరావు మాట్లాడారు.

జగన్, చంద్రబాబులది స్వలాభం

(మొదటిపేజీ తరువాయి)

కార్యకర్తలతో షర్మిల సమావేశమయ్యారు. రాష్ట్రంలో 25 మంది ఎంపిలు, ఆరుగురు రాజ్యసభలు ఉన్నా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని ఏ విషయంలోనూ వ్యతిరేకించడం లేదన్నారు. బిజెపి మతతత్వ పార్టీ అని, ఒక మతాన్ని రెచ్చగొట్టి మరో మతాన్ని అవమానపరిచి ఆ మంటల్లో చలి కాచుకోవాలన్నదే ఆ పార్టీకి తెలిసిన రాజకీయమని దుయ్యబట్టారు. అందుకే కీర్తిశేషులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఏనాడూ ఆ పార్టీని నమ్మలేదని, చివరి వరకూ బిజెపి సిద్ధాంతాలను తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తు చేశారు. ఎపికి ప్రత్యేక హోదా పదేళ్లు కాదు... 15 ఏళ్లు ఇస్తామన్న బిజెపి హామీ ఏమైందని ప్రశ్నించారు. 25 మంది ఎంపిలను గెలిపిస్తే బిజెపి మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తామని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగనన్న చెప్పిన మాటలు ఇప్పుడు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రాహుల్ గాంధీ ప్రధాని అయిన వెంటనే ఎపికి ప్రత్యేక హోదాపై తొలి సంతకం చేస్తారని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ వైఎస్‌ను అవమానించిందంటూ చేస్తున్న విమర్శల్లో నిజం లేదన్నారు. తాను జగన్‌రెడ్డి అనడం నచ్చలేదని వైవి.సుబ్బారెడ్డి అంటున్నారని, ఇక నుంచి జగనన్నగారు అనడానికి తనకు అభ్యంతరం లేదని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని చూపిస్తామన్న సుబ్బారెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నామని చెప్పారు. తేదీ, సమయం మీరు చెప్పినా, మమ్మల్ని చెప్పమన్నా చెప్తామన్నారు. అభివృద్ధి పరిశీలనకు తనతోపాటు మేధావులు, మీడియా, ప్రతిపక్షాలు కూడా వస్తాయని తెలిపారు. చెప్పిన మూడు రాజధానులు ఎక్కడ, కడతామన్న పోలవరం ప్రాజెక్టు ఎక్కడ అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉద్యోగాలు లేవని, జాబ్ కేలండర్, నోటిఫికేషన్ ఇవ్వలేదని, పట్టుమని పది పరిశ్రమలు కూడా రాలేదని విమర్శించారు. మద్యంతో వచ్చిన ఆదాయంతో రాష్ట్రాన్ని నడుపుతున్నారని, రాజధాని, పోలవరం, మెట్రో రైలు లేని రాష్ట్రంగా మిగిల్చారని తూర్పారపట్టారు.

'బాబు'కు బినామీ స్టార్ క్యాంపెయినర్లు

(మొదటిపేజీ తరువాయి)

ముందుకొస్తున్నారని విమర్శించారు. పక్క రాష్ట్రంలో స్థిర నివాసముంటున్న ఆయన వదినమ్మ ఇతర పార్టీలో ఉంటూ చంద్రబాబు కోసం క్యాంపయిన్ చేస్తుంటారని దుయ్యబట్టారు. దత్తపుత్రుడు ఒక స్టార్ క్యాంపయినర్‌గా ఉన్నారని పరోక్షంగా పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి విమర్శించారు. ఇటీవలనే ఒక పార్టీకి రాష్ట్ర అధ్యక్షురాలుగా బాధ్యతలు చేపట్టిన అభిమాన సంఘం నాయకురాలు ఒక స్టార్ క్యాంపయినర్ అని షర్మిలను ఉద్దేశించి పరోక్షంగా ఎద్దేవా చేశారు. అధికారం పోగానే బిజెపిలో చేరి తలదాచుకుంటున్న పసుపు కమలాలు కొన్ని చంద్రబాబు కోసం పనిచేస్తున్నాయని దుయ్యబట్టారు. చంద్రబాబు ప్రజలకు ఏ మాత్రం మంచి చేయకున్నా భుజానెత్తుకుని, జాకీలు పెట్టి మోస్తున్నారని విమర్శించారు. తాను మాత్రం ప్రజలనే నమ్ముకున్నానని, ప్రభుత్వం ద్వారా నేరుగా లబ్ధి పొందినవారే తన స్టార్ క్యాంపయినర్లని తెలిపారు. చంద్రబాబు 2014 ఎన్నికలకు ముందు డ్వాక్రా సంఘాల రుణాలు మాఫీ చేస్తానని ప్రకటించి మోసం చేశారని విమర్శించారు. దీంతో, డ్వాక్రా సంఘాలు ఎ, బి గ్రేడ్‌ల నుంచి సి, డి గ్రేడ్‌లకు దిగజారాయన్నారు. వడ్డీలపై, వడ్డీల భారాలను మహిళా సంఘాలు మోయాల్సి వచ్చిందని తెలిపారు. చంద్రబాబు నిర్వాకం వల్ల డ్వాక్రా సంఘాలు రూ.14,205 కోట్లు బకాయిలు ఉంటే, వాటికి వడ్డీలపై వడ్డీలు కలిపి రూ.25,500 కోట్లకు చేరాయని అన్నారు. వాటిని వైఎస్ఆర్ ఆసరా కింద నాలుగు విడతల్లో తమ ప్రభుత్వం డ్వాక్రా సంఘాలకు చెల్లించిందని తెలిపారు. తద్వారా డ్వాక్రా సంఘాల పనితీరు బాగా మెరుగుపడిందని వివరించారు. రికవరీ శాతం 99.93 శాతం ఉందన్నారు. తాము అధికారంలో ఉన్న ఈ 56 నెలల కాలంలో ప్రజలకు వివిధ రకాల పథకాల పేరుతో నేరుగా రూ.2.53 లక్షల కోట్లు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మంత్రులు ఉషశ్రీ, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపిలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, వై.వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణపట్నంలో కంటైనర్ టెర్మినల్‌కు షాక్!

(మొదటిపేజీ తరువాయి)

సమాచారం. పోర్టు ఆధారంగా నెల్లూరుకు గమేశా కంపెనీ వచ్చింది. ఇప్పటి వరకు విడి పరికరాలను కృష్ణపట్నం పోర్టు ద్వారా దిగుమతి చేసుకుంటున్న ఈ సంస్థ ఇకపై అదానీకి చెందిన గుజరాత్‌లోని ముద్రా లేక తమిళనాడు పోర్టులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కంటైనర్ టెర్మినల్ తరలింపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు నోరు మెదపడం లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే కృష్ణపట్నం పోర్టు ఉనికి పూర్తిగా కోల్పోయి నెల్లూరు జిల్లా పరిస్థితి దయనీయంగా మారనుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ పోర్టుపై ప్రత్యక్ష, పరోక్షంగా ఆధారపడిన కార్మికులు, స్థానిక వ్యాపారులు ఉపాధి కోల్పోనున్నారు. ప్రభుత్వ ఆదాయానికి కూడా భారీగా గండిపడనుంది.

చర్చల్లో ప్రభుత్వం అంగీకరించిన డిమాండ్లు

(మొదటిపేజీ తరువాయి)

ఇస్తామని అంగీకరించారు. త్వరలో జిఓ ఇవ్వనున్నారు

- సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. సర్వీసులో ఉండి మరణించిన వారికి అంగన్‌వాడీ బీమా లేదా వైఎస్ఆర్ బీమా అమలు చేస్తామని తెలిపారు. మట్టి ఖర్చులు రూ.20 వేలు ఇవ్వడానికి అంగీకారం. .
- హెల్పర్ల ప్రమోషన్ వయస్సు 45 సంవత్సరాల నుండి 50 సంవత్సరాలకు పెంచాలని నిర్ణయించారు. ప్రమోషన్లకు నిర్దిష్టమైన నిబంధనలు రూపొందిస్తామని అంగీకరించారు.
- 2017 నుండి పెండింగ్‌లో ఉన్న టిఎ బిల్లులు అమౌంట్ కేంద్రం ఇచ్చినప్పుడు అందరికీ ఇస్తామని, ఈ నెల నుండి రాష్ట్ర ప్రభుత్వం నిధులతో నెలకు వర్కర్‌కు ఒక టిఎ, రెండు నెలలకు ఆయాలకు ఒక టిఏ చొప్పున ఇవ్వాలని నిర్ణయించారు. దీనికీ జిఓ ఇస్తామని ప్రకటించారు,
- ఉద్యోగ విరమణ వయస్సు 60 నుండి 62 సంవత్సరాలకు పెంపు.
- గ్రేడ్ టు సూపర్‌వైజర్ పోస్టులకు పరీక్ష రాసి పెండింగ్‌లో ఉన్న 164 గ్రేడ్ టు సూపర్ వైజర్ పోస్టులు ఏప్రిల్ నాటికి అమలు చేస్తామని హామీనిచ్చారు.
- నాలుగు యాప్‌లు కలిపి ఒక యాప్‌గా మార్చడానికి అంగీకారం,
- వేతనంతో కూడిన మెడికల్ లీవు, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూఛార్జి, మెనూ పెంపు, గ్యాస్ తదితర సమస్యల పరిష్కారానికి కమిటీ వేసి చర్చించి నిర్ణయించనున్నారు.
- సమ్మె కాలానికి జీతాలు చెల్లించడానికి, సమ్మె సమయంలో పెట్టిన కేసులు ఎత్తేయడానికి ప్రభుత్వం అంగీకరించింది. కక్షసాధింపు చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం పాల్పడదని మంత్రుల బృందం తెలిపింది. అంగీకరించిన అన్ని అంశాలూ కూడా మూడు రోజుల్లో మినిట్స్ కాపీని అందిస్తామని చర్చల్లో ప్రభుత్వ తరపు ప్రతినిధులు హామీనిచ్చారు.

వృద్ధికి రెక్కలు!

(మొదటిపేజీ తరువాయి)

కంటే 13.18 శాతం ఎక్కువగా ఉన్నట్లు తేల్చారు.

పారిశ్రామిక రంగంలోనూ వృద్ధే

మరో కీలకమైన పారిశ్రామిక రంగంలో కూడా భారీ వృద్ధినమోదైనట్లు అధికారులు తేల్చారు. 2018-19 కన్నా ఏకంగా లక్ష కోట్ల విలువ పెరిగినట్లు చూపించడం విశేషం. 2018-19లో రూ.1,88,601 కోట్లుగా ఉండగా, 2022-23 నాటికి అది రూ.2,83,821 కోట్లకు చేరుకున్నట్లు ప్రణాళిక శాఖ వెల్లడించింది. ఇది గత ఏడాదికన్నా 16.36 శాతంగా ఉన్నట్లు తేల్చారు. జాతీయ స్థాయిలో కేవలం 14.2 శాతం వృద్ధి నమోదైతే రాష్ట్రంలో రెండు శాతం కన్నా ఎక్కువ వృద్ధి నమోదైనట్లు పేర్కొన్నారు. ఇక సేవా రంగానికి సంబంధించి ఐదేళ్లలో ఏకంగా రూ.1.60 లక్షల కోట్ల విలువ పెరిగినట్లు తెలిపారు. గత ఏడాది 4,07,810 కోట్లుగా విలువ అంచనా వేయగా, 2022-23లో 4,91,496 కోట్లుగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇది ఏకంగా 20.52 శాతం వృద్ధిగా రికార్డయింది.

సిఎం జగన్ వచ్చిన వేళ ముందస్తు నోటీసులు, అరెస్టులు


సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్‌కు ముందస్తు నోటీసు అందజేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చిన నేపథ్యంలో పలు రాజకీయ పార్టీలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాల నాయకులకు పోలీసులతో ప్రభుత్వం ముందస్తు నోటీసులు ఇప్పించింది. గృహ నిర్భంధాలు, ముందస్తు అరెస్టులకు పాల్పడింది. అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన వైఎస్ఆర్ ఆసరా లబ్ధి పంపిణీ కార్యక్రమానికి సిఎం జగన్ హాజరయ్యారు. జిల్లాలో అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోరుతూ 42 రోజులుగా సమ్మె చేపట్టిన నేపథ్యంలో ప్రభుత్వం పరిష్కరించకుండా వివిధ రూపాల్లో అణచివేతకు గురిచేయడం, బెదిరింపులకు దిగడాన్ని నిరసిస్తూ సిపిఎం, సిఐటియు నాయకులు ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకుంటామని ప్రకటించిన నేపథ్యంలో సోమవారం రాత్రి నుంచి సిపిఎం నాయకులకు జిల్లా పోలీసులు ముందస్తు నోటీసులు అందజేశారు. ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో యుటిఎఫ్ నాయకులను అరెస్టు చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి రాంభూపాల్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ నాగేంద్రకుమార్, సిఐటియు నాయకులు మన్నీల రామాంజి, గుంతకల్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి శ్రీనివాసులు, సాకే నాగరాజు, సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం నాగమణి, సిపిఎం నగర కార్యదర్శులు ఆర్‌వి నాయుడు, వి రామిరెడ్డి, ఉరవకొండ సిపిఎం జిల్లా నాయకులు రంగారెడ్డి, పలువురు విద్యార్థి సంఘం నాయకులకు పోలీసులు ముందస్తు నోటీసులు అందజేశారు.

నిర్బంధాన్ని ఎదిరించి కోర్కెలు సాధించుకున్న అంగన్‌వాడీలకు అభినందనలు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంగన్‌వాడీ ఉద్యోగులు గత 42 రోజులుగా మొక్కవోని పట్టుదలతో రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధాన్ని, కుయుక్తులను సైతం ఎదుర్కొని సమ్మెను జయప్రదం చేసి, తమ కోర్కెలు సాధించుకోవడంపై సిపిఎం రాష్ట్ర కమిటీ అభినందనలు తెలిపింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సమ్మెకు సంఘీభావం ప్రకటించిన సంఘాలకు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం వేతనాలు పెంచడానికి అంగీకరించి అంగన్‌వాడీ సంఘాలతో ఒప్పందం చేయడం హర్షణీయమని, అంగీకరించిన అంశాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎటువంటి కక్షసాధింపులకూ పాల్పడకుండా ఉద్యోగుల హక్కులను గౌరవించాలని కోరారు. సమ్మె చేసిన కాలంలో రాష్ట్ర ప్రభుత్వం నుండి అనేక విధాలుగా అంగన్‌వాడీలు నిర్బంధాన్ని ఎదుర్కొన్నారని, అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టించిన రాష్ట్ర ప్రభుత్వం అభాసుపాలైందని వివరించారు. లబ్ధిదారులు, ప్రజలు ప్రభుత్వ చర్యలను నిరసించి ఉద్యోగులకు అండగా నిలబడ్డారని, ఎస్మాను ధిక్కరించి నిలబడ్డారని పేర్కొన్నారు. కలెక్టర్లు నోటీసులిచ్చినా అంగన్‌వాడీలు బెదరలేదని, తిరిగి సమాధానమిచ్చారని వివరించారు. ఉద్యోగాలు పీకివేస్తామని, కొత్త రిక్రూట్‌మెంట్ చేసుకుంటామని నోటీసులిచ్చి, భయపెట్టి, బెదిరించినా లొంగలేదని, విజయవాడ ధర్నాచౌక్ శిబిరంలో మహిళలని కూడా చూడకుండా అర్ధరాత్రి చీకటిలో, మగ పోలీసులతో నానా బీభత్సం సృష్టించి అరెస్టులు చేసి, 200 కిలోమీటర్ల వరకు తీసుకెళ్లి నడిరోడ్డుపై వదిలేశారని, చివరకు యూనియన్ లేకుండా చేయాలని రకరకాల కుయుక్తులు పన్నారని విమర్శించారు. ఇన్ని రకాల నిర్బంధాలనూ, రాష్ట్ర ప్రభుత్వ కుయుక్తులనూ సంఘం అండతో ఉమ్మడిగా ఉద్యోగులంతా ఒక్కటై ఎదిరించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్మికుల ఐక్యత, ఇతర సంఘాల, రంగాల కార్మికుల సంఘీభావం, ప్రజల మద్దతు అవసరమని అంగన్‌వాడీ సమ్మె తెలిపిందన్నారు.

కార్మిక సంఘాల అభినందనలు

రాష్ట్ర బంద్ యోచన విరమణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వ దమనకాండ, నిర్బంధాలను ఎదుర్కొని 42 రోజులపాటు సమ్మె, ఐదురోజుల నిరవధిక నిరాహార దీక్షలతో హక్కులు సాధించుకున్న అంగన్‌వాడీల పోరాటం రాష్ట్ర కార్మికవర్గానికి ఆదర్శనీయంగా నిలిచిందని కార్మిక సంఘాలు పేర్కొన్నాయి. అంగన్‌వాడీ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరిపి ఒప్పందం చేసుకున్న నేపథ్యంలో ఈ నెల 24న రాష్ట్ర బంద్‌ను రద్దు చేసుకోవాలని నిర్ణయించినట్లు ప్రకటించాయి. ఈ మేరకు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్, ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ప్రసాద్, టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు రఘురామరాజు, ఐఎన్‌టియుసి రాష్ట్ర నాయకులు క్రాంతికుమార్ మంగళవారం ఉమ్మడిగా ప్రకటన విడుదల చేశారు.

ప్రభుత్వాస్పత్రుల అభివృద్ధికి ప్రాధాన్యం

గుంటూరు జిజిహెచ్‌లో అధునాతన ఐసియును ప్రారంభించిన మంత్రి రజిని


ఐసియును పరిశీలిస్తున్న మంత్రి రజిని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధికి వైసిపి సర్కారు ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో రూ.మూడు కోట్లతో నిర్మించిన ఆధునిక ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ను జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో డాక్టర్ కిరణ్ కుమార్‌తో కలిసి మంత్రి రజిని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం వైద్య రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, ప్రభుత్వ ఆస్పత్రులను పట్టించుకోలేదని విమర్శించారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి ఆస్పత్రిలో ఉచితంగా మందులు ఇవ్వడమే కాకుండా రక్త పరీక్షలు, వైద్య సిబ్బంది నియమాకాలు చేపట్టడంతో రోగులు సంతృప్తికరంగా ఉన్నారని తెలిపారు. ఆరోగ్యశ్రీ పరిధిలో దాదాపు 3250 వ్యాధులను తెచ్చామని, జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామ స్థాయి నుంచి వైద్యులు ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. క్షేత్ర స్థాయిలో ఇంటింటికి వైద్యులు వెళ్లి పేద వైద్య పరీక్షలు చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, వైసిపి నాయకులు నూరిఫాతిమా పాల్గొన్నారు.

కడప ఉక్కు కోసం యువత ఉద్యమించాలి


నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు

- డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

స్వాతంత్ర్య సమరయోధుడు, మరణం లేని మహనీయుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయ సాధనలో భాగంగా కడప ఉక్కు పరిశ్రమ కోసం యువత ఉద్యమించాలని డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ కడప కార్యాలయంలో నేతాజీ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల.శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గండి.సునీల్ కుమార్, ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో నేతాజీది చెరగని ముద్ర అని పేర్కొన్నారు. విభజన హక్కు అయిన కడప ఉక్కును కేంద్రం పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. కడప ఉక్కు పరిశ్రమను ఎప్పుడు నిర్మిస్తారో చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని పార్లమెంట్‌లో ప్రశ్నించాలని రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్షాలను డిమాండ్ చేశారు. లేకుంటే వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు షేక్ షాకీర్, డి.ఎం.ఓబులేసు పాల్గొన్నారు.

పత్తి రైతులను ఆదుకోవాల్సిందే

- మార్కెట్ యార్డ్‌ను ముట్టడించిన మాజీ ఎమ్మెల్యే జెసి

ప్రజాశక్తి - గుత్తి

పత్తి పంటను సాగు చేసిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. రైతులు, టిడిపి శ్రేణులతో కలిసి అనంతపురం జిల్లా గుత్తిలోని మార్కెట్ యార్డ్‌ను జెసి ప్రభాకర్‌రెడ్డి ముట్టడించారు. మార్కెట్ యార్డు ఎదురుగా బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం రైతులకు తీరని అన్యాయం చేస్తోందని విమర్శించారు. పత్తిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, గిట్టుబాటు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకోకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.


రైతులు, నాయకులతో కలసి ఆందోళనలో పాల్గొన్న జెసి దివాకర్‌రెడ్డి



28న యుఇసిడబ్ల్యుయు రాష్ట్ర రెండవ మహాసభ

- పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 28న యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (యుఇసిడబ్ల్యుయు) రాష్ట్ర రెండవ మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు దుగ్గిరాల సూరిబాబు తెలిపారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో మహాసభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ ఈ మహాసభకు జాతీయ నాయకులు ఎస్.రాజేంద్రన్, సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎవి.నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావు, రాష్ట్ర జెఎసి నాయకులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. గడిచిన 20 సంవత్సరాలుగా సంస్థలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేయాలన్న ప్రధాన డిమాండ్‌పై మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వాచ్‌మెన్‌లుగా, షిఫ్టు ఆపరేటర్లుగా పనిచేస్తున్న వారికి, నూతనంగా విధుల్లో చేరిన వారికి పాత వారితో సమానంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుమన్ మాట్లాడుతూ సంస్థలో పని చేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చే విధమైన ప్రణాళిక రచన, ఉద్యమ రూపకల్పన ఈ మహాసభలో చేయనున్నట్లు తెలిపారు.

యువ రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - దువ్వూరు


సుధాకర్ (ఫైల్)

అప్పుల బాధ తాళలేక యువరైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన వైఎస్ఆర్ జిల్లా దువ్వూరు మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. మృతుని బంధువులు, పోలీసుల వివరాల మేరకు.. కానగూడురు గ్రామానికి చెందిన తోట సుధాకర్ (35) నాలుగున్నర ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం సాగు చేసేవారు. ఈ ఏడాది వరి, నూగు పంట, పూల తోట సాగు చేశారు. ఇందు కోసం రూ. పది లక్షలు అప్పు చేశారు. వైరస్ ప్రభావంతో పంటలు దక్కకపోవడంతో అప్పులకు వడ్డీ భారం అధికమైంది. రుణదాతల ఒత్తిడి, అప్పులు తీరేదారి లేకపోవడంతో ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చైర్మన్ పదవికి రూ.40 లక్షలు

- ఆశ చూపి డబ్బులు తీసుకున్న మంత్రి రోజా
- పుత్తూరు 17వ వార్డు కౌన్సిలర్ ఆరోపణ


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ భువనేశ్వరి

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం)

పుత్తూరు మున్సిపల్ చైర్మన్ పదవి ఇస్తానని ఆశ చూపి మంత్రి రోజా తన వద్ద నుంచి దశల వారీగా రూ.40 లక్షలు తీసుకున్నారని, ఇప్పుడు పదవి ఇవ్వకపోగా ఇచ్చిన సొమ్ము తిరిగి చెల్లించలేదని పుత్తూరు మున్సిపల్ 17వ వార్డు కౌన్సిలర్ భువనేశ్వరి ఆరోపించారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రెండున్నర సంవత్సరాల క్రితం నిర్వహించిన మున్సిపల్ ఎన్నికలలో దళిత రిజర్వేషన్ వార్డు కావడంతో వార్డు ప్రజలు తనను కౌన్సిలర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు. ఆ తర్వాత మున్సిపల్ చైర్మన్‌గా పదవి కోసం మంత్రి రోజాను సంప్రదించగా రూ.70 లక్షల అవుతుందని చెప్పారని, తాము అంత ఇవ్వలేమని చెప్పగా.. తన సోదరుడు కుమారస్వామి దగ్గరకు వెళ్లి మాట్లాడాలని రోజా చెప్పారన్నారు. కుమారస్వామి దగ్గరకు వెళ్ళగా ఆయన తన అనుచరుడైన సత్యను తన ఇంటి వద్దకు పంపించడంతో మొదటగా రూ.20 లక్షలు చెల్లించామని, తర్వాత దశలవారీగా మొత్తం రూ.40 లక్షలు ముట్టుచెప్పామని చెప్పారు. 23వ వార్డులో కౌన్సిలర్‌గా ఎస్‌సి జనరల్ కేటగిరీలో గెలుపొందిన హరి అనే వ్యక్తిని చైర్మన్‌గా నియమించారన్నారు. చైర్మన్ పదవి కోసం మంత్రి ఇంటిచుట్టూ తిరుగుతున్నా పట్టించుకోకపోవడం, ఫోన్ చేసిన స్పందించకపోవడంతో తనకు న్యాయం చేయాలని మీడియా ముందుకు వచ్చినట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని సామాజిక తరగతులకు సమన్యాయం చేస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి తనకు జరిగిన అన్యాయంపై ప్రత్యేక చొరవ తీసుకొని తన సొమ్ము తనకు తిరిగి ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో భువనేశ్వరి భర్త సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



పోర్టుపోలియో విస్తరణపై రెనల్ట్ దృష్టి

హైదరాబాద్ : భారత్‌లో తమ వ్యాపార వ్యూహాన్ని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టామని రెనాల్ట్ ఇండియా ఆపరేషన్స్ సిఇఒ, ఎండి వెంకట్రామ్ మామిళ్లపల్లే అన్నారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రెనో వచ్చే 3-5 ఏళ్లలో కొత్త ఆవిష్కరణలకు ప్లాన్ చేస్తుందన్నారు. ఫ్రెంచ్ కార్ల తమ కంపెనీ ప్రస్తుత ఏడాదిలోనూ కొత్తవేరియంట్‌లతో పోర్టు పోలియోను మెరుగుపర్చుకుంటుందని తెలిపారు. రెనో కోసం యూరప్ వెలుపల ఉన్న నాలుగు ప్రధాన కేంద్రాలలో భారతదేశం ఒకటన్నారు. ఈ క్రమంలోనే ఉత్పత్తి పోర్టు పోలియోను విస్తరిస్తోందన్నారు. వచ్చే మూడేళ్లలో ఐదు ఉత్పత్తులను అందుబాటులోకి తేనున్నామన్నారు. కొత్త 2024 శ్రేణితో కైజర్, ట్రైబర్, క్విడ్ మోడల్‌లను బలోపేతం చేయనున్నామన్నారు. వినియోగదారులను పెంచుకునేందుకు 3 మోడళ్లలో 5 కొత్త వేరియంట్‌లను పరిచయం చేస్తున్నామన్నారు. రెనాల్యూషన్ ఇండియా 2024 కింద కొత్త బ్రాండ్‌ను ఆవిష్కరిస్తున్నామన్నారు.

సంపాదకీయం

మత రాజ్యం దిశగా..

అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్టాపనను మత పరమైన కార్యక్రమంగా కాకుండా బిజెపి, ఆరెస్సెస్ తమ రాజకీయ ఎజెండాను ముందుకు తీసుకెళ్లేందుకు దుర్వినియోగపరచిన తీరు ముమ్మాటికీ ఆక్షేపణీయం. దేశంలో లౌకిక, ప్రజాతంత్ర విలువలను తుంగలో తొక్కి దేశాన్ని మత రాజ్యంగా దిగజార్చేందుకు సంఘ్ పరివార్ దూకుడుగా ముందుకెళ్తోంది. మతపరమైన జాతీయవాదాన్ని రెచ్చగొట్టడం ద్వారా వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గెలవాలని చూస్తున్న బిజెపి అయోధ్య రాముడిని రాజకీయ రాముడిగా మార్చేందుకు యత్నించింది. మూడేళ్ల క్రితం అయోధ్యలో ఆలయ నిర్మాణానికి ప్రధాని హాజరై భూమి పూజ చేయడం, నూతన పార్లమెంటు భవనం ప్రారంభోత్సవంలో రాజ దండం ప్రదర్శించడం దగ్గర నుంచి తాజాగా బాల రాముడి ప్రతిష్టాపనలో అన్నీ తానై వ్యవహరించడం దాకా మోడీ వ్యవహరించిన తీరు బిజెపి, ఆరెస్సెస్ హిందూత్వ ఎజెండాలో భాగమేనని నిస్సందేహంగా చెప్పవచ్చు. రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని మోడీ భజన కార్యక్రమంగా మార్చేశారు. ప్రాణప్రతిష్ఠ తీరును విభేదిస్తూ ప్రధానమైన నాలుగు మఠాల శంకరాచార్యులు కార్యక్రమానికి హాజరు కాలేమని తేల్చి చెప్పడం సంఘ్‌పరివార్‌ది ఫక్తు రాజకీయ ఎజెండా అని స్పష్టం చేస్తున్నది. సౌమ్యుడిగా, సాకేత రాముడిగా ఆరాధించే రాముడి చిత్రాన్ని ఆగ్రహంగా, హింసాత్మకంగా, కండలు తిరిగిన మానవాతీత వ్యక్తిగా చిత్రీకరిస్తూ అయోధ్య అంతటా పోస్టర్లు అంటించారు. రాముడి విగ్రహ ప్రతిష్ఠతో దేశంలోని సమస్యలన్నీ పరిష్కారమైపోయినట్లుగా బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ఆధీనంలోని ప్రధాన కార్పొరేట్ మీడియా అంతా ఊదరగొట్టింది.


1992 డిసెంబర్ 6న బాబ్రీ మసీదు కూల్చివేతను క్రిమినల్ నేరంగా, తీవ్రమైన చట్ట ఉల్లంఘనగా దేశ అత్యున్నత న్యాయస్థానం 2019లో ప్రకటించింది. అదే సమయంలో విశ్వాసాల పేరుతో మసీదు కూల్చివేసిన చోట గుడికట్టాలని తీర్పిచ్చింది. వాస్తవమిది కాగా, అయోధ్యలో సత్యం, న్యాయమే గెలిచాయని, బాబ్రీ మసీదును కూల్చివేయడం సరైనదేనన్నట్టుగా ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్, ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడడం చాలా హాస్యాస్పదంగా ఉంది.

ఈసారి ఎన్నికల్లో గనుక బిజెపి గెలిస్తే, భారత దేశాన్ని మత రాజ్యంగా మార్చేస్తుంది. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రామాలయ ప్రారంభోత్సవ రోజున ఒక పూట సెలవు ప్రకటించగానే, బిజెపి పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సెలవు ప్రకటించాయి. అంతేకాదు ప్రభుత్వ సొమ్ముతో అయోధ్యకు ఉచిత ప్రయాణ సౌకర్యాలను కల్పించాయి. దీనిని దీటుగా ఎదుర్కోవాల్సిన బిజెపియేతర పార్టీలు మృదు హిందూత్వ, హిందూత్వతో పోటీపడడం వంటి వాటికి పాల్పడడం సంఘ్‌పరివార్ పని మరింత సులువు చేస్తోంది. అయోధ్యలో రామ్‌లల్లా ప్రతిష్ఠాపన సమయంలో ఢిల్లీలో సుందరకాండ పారాయణ కార్యక్రమాన్ని ఆమాద్మీ పార్టీ నిర్వహించగా, కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆలయాల్లో పూజలు చేపట్టింది. ఆంధ్ర ప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ, జనసేన నేతలు ప్రత్యేక విమానాల్లో అయోధ్యకు తరలివెళ్లి మెజార్టీ మత రాజకీయాలకు తాము వ్యతిరేకం కాదని చాటుకున్నారు.

తొలి భారత ప్రధాని నెహ్రూ సోమనాథ్ ఆలయ సందర్శనకు అధికారిక హోదాలో వెళ్లవద్దని నాటి రాష్ట్రపతికి సూచించారు. నేటి ప్రధాని అందుకు భిన్నంగా వ్యవహరించారు. వామపక్షాలు, ఆర్జేడి, డిఎంకె వంటి కొన్ని పార్టీలు మాత్రమే నికరంగా బిజెపి మత రాజకీయ ఎజెండాను వ్యతిరేకించాయి. మతతత్వాన్ని, జాతీయోన్మాదాన్ని రెచ్చగొట్టే బిజెపి ఎజెండాకు కార్పొరేట్ శక్తులు మద్దతుగా నిలిచాయి.

అయోధ్య ఎజెండా ముగియగానే కాశీ, మధుర మసీదులను బిజెపి, ఆరెస్సెస్ తెరపైకి తీసుకొస్తున్నాయి. దీనిపై వివాదాలు రేకెత్తించేందుకు ఇప్పటికే సంఘ్‌పరివార్ న్యాయస్థానాలను ఆశ్రయించింది.. రాజకీయ ప్రయోజనాల కోసం మతాన్ని పాలనను కలగాపులగం చేస్తున్న మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా లౌకిక శక్తులన్నీ పోరాడాలి. భిన్నమతాలు, జాతులు, సంస్కృతులతో కూడిన భారత దేశ ఔన్నత్యాన్ని కాపాడుకునేందుకు, మత రాజకీయాలను ఓడించేందుకు బిజెపిని రాజకీయంగా ఒంటరిపాటు చేయాలి.


మహనీయుల మాట



పిల్లల చదువులో
దేవుని ప్రస్తావన ఉండకూడదు.
విద్యా విధానం
మతం నుండి విడివడి ఉండాలి.
- జీన్ జాక్ రూసో,
ఫ్రెంచి విప్లవ కాలం నాటి ప్రసిద్ధ తత్వవేత్త.

కనీవినీ ఎరుగని అసమానతల ప్రపంచం!

విశ్లేషణ



గుత్తాధిపత్యం పెరుగుతున్నదని, అది అసమానతలకు దారి తీస్తున్నదని ఐఎంఎఫ్ వంటి సంస్థలు అంగీకరించినా నివారణకు ఎలాంటి చర్యలూ తీసుకోవటం లేదు. ప్రపంచంలో నిజ వేతనాలు తగ్గుతున్నట్లు, దీంతో అసమానతలు పెరుగుతున్నట్లు ప్రపంచ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) పేర్కొన్నది. ద్రవ్యోల్బణానికి అనుగుణంగా వేతనాలు పెరగని కారణంగా గడచిన రెండు సంవత్సరాల్లో 79.1 కోట్ల మంది కార్మికులు 1.5 లక్షల కోట్ల డాలర్లు నష్టపోయినట్లు పేర్కొన్నది. ఉమ్మడి రాష్ట్రంలో సవరించటం తప్ప తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండుగా విడివడిన పది సంవత్సరాల్లో ఒక్కసారి కూడా కనీస వేతనాలను సవరించకపోవటం లేదా ముసాయిదా పేరుతో అడ్డుకోవటం తెలిసిందే. ప్రపంచమంతటా ఇదే వైఖరి.

‘ఇక్కడ తిరుగులేని ఆర్థిక వాస్తవం ఉంది. దాన్ని మనం తప్పనిసరిగా ఎదుర్కోవాల్సిందే. ఇంత ఆదాయ, సంపద అసమానతను, సంపదల కేంద్రీకణను చరిత్ర చూడలేదు’ అమెరికా డెమొక్రటిక్ సోషలిస్టు బెర్నీ శాండర్స్ ఆక్స్‌ఫామ్ 2024 అసమానతల నివేదికకు రాసిన ముందు మాటలో చెప్పిన మాటలివి. దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక 54వ వార్షిక సమావేశాల సందర్భంగా దీన్ని విడుదల చేశారు. దీనిలో పేర్కొన్న వివరాలు కొందరికి నమ్మశక్యం కానంతగా ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. అమెరికా సమాజంలో దిగువన ఉన్న సగం మంది కంటే ముగ్గురు ఎక్కువ సంపదలను కలిగి ఉన్నారు. అరవై శాతం మంది కార్మికులు చాలీచాలని వేతనాలతో జీవిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం కారణంగా కార్మికుల ఉత్పాదకత భారీ ఎత్తున పెరిగినప్పటికీ యాభై సంవత్సరాల నాటి కంటే అమెరికా కార్మికుల సగటు వేతనాలు నేడు తక్కువగా ఉన్నాయని శాండర్స్ పేర్కొన్నాడు. ఆక్స్‌ఫామ్ చెప్పినట్లు ఇది ఒక్క అమెరికా సమస్య మాత్రమే కాదు అన్నాడు. 2020 తరువాత ఐదు వందల కోట్ల మంది జనం పేదలుగా మారితే ఐదుగురు కుబేరుల సంపద రెండు రెట్లు పెరిగింది. ఇది ప్రపంచానికి చెడువార్త అన్నాడు.

ఈ ప్రపంచం కొద్ది మందికి భూతల స్వర్గం అయితే అత్యధికులకు భూతాల నిలయం. 2020 నాటికి ఉన్న సంపదతో పోలిస్తే బిలియనీర్లు మూడు సంవత్సరాల్లో 34 శాతం లేదా 3.3 లక్షల కోట్ల డాలర్ల మేర పెంచుకున్నారు. ద్రవ్యోల్బణం వీరికి మూడు రెట్ల సంపదను పెంచింది. దీన్ని మరోవిధంగా చెప్పాలంటే ఆ మేరకు సామాన్యుల జేబుల నుంచి మాయమైంది. సంపద అంతా జనాభాలో కేవలం 21 శాతం మంది ఉండే ధనిక దేశాల్లోనే కేంద్రీకృతమైంది. ప్రయివేటు సంపదల్లో 69 శాతం, ప్రపంచ బిలియనీర్లలో 74 శాతం మంది ఇక్కడే ఉన్నారు. ద్రవ్య సంబంధ ఆస్తులలో ప్రపంచంలోని ఒకశాతం మంది వద్ద 43 శాతం, ఐరోపాలో 47, ఆసియాలో 50 శాతం ఉన్నాయి. గుత్తాధిపత్యం పెరుగుతున్నదని, అది అసమానతలకు దారి తీస్తున్నదని ఐఎంఎఫ్ వంటి సంస్థలు అంగీకరించినా నివారణకు ఎలాంటి చర్యలూ తీసుకో వటం లేదు.ప్రపంచంలో నిజవేతనాలు తగ్గుతున్న ట్లు, దీంతో అసమానతలు పెరుగుతున్నట్లు ప్రపంచ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) పేర్కొన్నది. ద్రవ్యోల్బణానికి అనుగుణం గా వేతనాలు పెరగని కారణంగా గడచిన రెండు సంవత్సరాల్లో 79.1 కోట్ల మంది కార్మికులు 1.5 లక్షల కోట్ల డాలర్లు నష్టపోయినట్లు పేర్కొన్నది. ఉమ్మడి రాష్ట్రంలో సవరించటం తప్ప తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండుగా విడివడిన పది సంవత్సరాల్లో ఒక్కసారి కూడా కనీస వేతనాలను సవరించకపోవటం లేదా ముసాయిదా పేరుతో అడ్డుకోవటం తెలిసిందే. ప్రపంచమంతటా ఇదే వైఖరి.



ఎం. కోటేశ్వరరావు

విద్య, వైద్యం వంటి సేవలను వస్తువులుగా మార్చి వాటిని ప్రభుత్వం రంగం నుంచి తప్పించి ప్రయివేటు కార్పొరేట్‌లు స్వంతం చేసుకొని లాభాలు దండుకోవటం కూడా అసమానతలకు దారితీస్తున్నది. కాలుష్యాల నిరోధక చర్యలు తీసుకోకుండా గతంలో లబ్ధి పొందిన కార్పొరేట్లే ఇప్పుడు వాటి నివారణ పేరుతో ప్రభుత్వాల నుంచి పెద్ద ఎత్తున రాయితీలు, సబ్సిడీలు పొందుతున్నాయి. పేద, మధ్య తరగతి దేశాలు రుణ భారంతో సతమతం కావటంతో పాటు తీవ్ర అసమానతలు పెరుగుతున్నాయి. ప్రపంచ మొత్తం పేదల్లో 57 శాతం (240 కోట్ల) మంది పేద దేశాల్లో ఉన్నారు. జీవన పరిస్థితి దిగజారటంతో ప్రపంచమంతటా సమ్మెలు, ఆందోళనలు పెరుగుతున్నాయి. అమెజాన్ కంపెనీలో పని చేస్తున్నవారు 30దేశాల్లో 2022లో ఆందోళనలు చేశారు. జీవన వ్యయాల పెరుగుదలకు నిరసనగా 2023లో 122 దేశాల్లో ఆందోళనలు జరిగాయి. కరోనా తరువాత కోట్లాది మంది పౌరుల పరిస్థితి పూర్వపు స్థితికి చేరుకోలేదు. 2017-2020తో పోలిస్తే ప్రపంచ అతి పెద్ద కార్పొరేట్ సంస్థలు 2021-2022లో 89 శాతం లాభాలను పెంచుకున్నాయి. 2023 తొలి ఆరు నెలల వివరాలను పరిశీలిస్తే గత రికార్డు లాభాల చరిత్రను బద్దలుకొడుతున్నట్లు కనిపిస్తున్నది. చమురు, విలాసవస్తువులు, విత్త సంబంధ కంపెనీలకు లాభాలు విపరీతంగా పెరిగాయి. ప్రపంచంలోని 0.001 శాతం కార్పొరేట్లు అన్ని కార్పొరేట్ల లాభాల్లో మూడోవంతు పొందాయంటే సంపదల కేంద్రీకరణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అమెరికా కంపెనీల్లో 89 శాతం వాటాలు తెల్లవారి చేతుల్లో ఉండగా ఆఫ్రికన్లకు 1.1, హిస్పానిక్‌లకు 0.5 శాతం ఉన్నాయి. పదకొండుశాతం మంది ప్రపంచ బిలియనీర్లు అధికారంలో లేదా రాజకీయ నేతలుగా ఉన్నారు.గడచిన నాలుగు దశాబ్దాలకాలంలో 30 ఐరోపా దేశాలలో మూడు వేల విధానపరమైన ప్రతిపాదనలను పరిశీలించగా ధనికులు మద్దతు ఇచ్చిన వాటినే అమలు జరిపారు తప్ప పేదల వాటిని పట్టించుకోలేదు.

అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) జరిపిన పరిశోధనలో కార్పొరేట్ శక్తుల గుత్తాధిపత్యం పెరగటం వలన అమెరికాలోని వస్తు ఉత్పాదక రంగంలో 76 శాతం మంది కార్మికుల ఆదాయాలు తగ్గాయని తేలింది. ఈ సంస్థలు, కార్మికుల వేతనాలనే కాదు మార్కెట్లను అదుపు చేస్తాయి. అవసరమైన వస్తువులు, సేవలను అందుబాటులో లేకుండా చేస్తాయి. నవకల్పనలు, కొత్త సంస్థలను ఎదగనివ్వకుండా చూస్తాయి. తమ లాభాల కోసం ప్రభుత్వ సేవలను ప్రైవేటీకరించేట్లు చూస్తాయి. తమ లాభాలకు ముప్పురాకుండా ధరలను కూడా పెంచుతాయి. వీటికి ప్రభుత్వాలు ఎల్లవేళలా మద్దతు ఇస్తాయి. అందుకే కొన్ని కార్పొరేట్లు దేశాల జిడిపి కంటే ఎక్కువ సంపదలను కలిగి ఉన్నాయి. ఉదాహరణకు యాపిల్ కంపెనీ విలువ మూడు లక్షల కోట్ల డాలర్లనుకుంటే 2023లో మన దేశ జిడిపి 3.7 లక్షల కోట్లని అంచనా. ప్రపంచంలోని ఇలాంటి ఐదు పెద్ద కంపెనీల సంపదలు మొత్తం ఆఫ్రికా, లాటిన్ అమెరికా, కరీబియన్ దేశాల మొత్తం జిడిపి కంటే ఎక్కువ. మొత్తం బహుళజాతి కంపెనీల లాభాల్లో 1975లో పెద్ద కంపెనీల వాటా నాలుగుశాతం కాగా 2019 నాటికి పద్దెనిమిది శాతానికి పెరిగింది.

ఇప్పుడు ప్రపంచాన్ని ఏలుతున్నది ద్రవ్య పెట్టుబడి అన్న సంగతి తెలిసిందే. 2009 నుంచి ఈ రంగంలో ఉన్న కొన్ని కంపెనీలు ప్రస్తుతం 5.8 లక్షల కోట్ల డాలర్ల ప్రైవేటు పెట్టుబడిదారుల ఆస్తులను నిర్వహిస్తున్నాయి. ఇవిగాక బ్లాక్ రాక్, స్టేట్‌స్ట్రీట్, వాన్‌గార్డ్ అనే ఫండ్స్ సంస్థలు 20లక్షల కోట్ల డాలర్ల మేర ద్రవ్య ఆస్తులను నిర్వహిస్తున్నాయి. ఇంత పెద్ద సంస్థలు ప్రభుత్వ విధానాలను, దేశాధినేతలను శాసించటంలో ఆశ్చర్యం ఏముంది. గుత్త సంస్థలు ప్రపంచానికి కొత్త కాదు. ఇంగ్లీష్ ఈస్టిండియా కంపెనీ ప్రారంభమైన 1,600 సంవత్సరం నుంచి ఎన్ని దేశాలను ఆక్రమించుకొని దోచుకున్నదీ ఎరిగిందే. వర్తమానంలో రాక్‌ఫెల్లర్ కంపెనీ ప్రపంచ చమురు సామ్రాజ్యం, సిసిల్ రోడెస్ ప్రపంచ వజ్రాల మార్కెట్‌ను శాసిస్తున్న సంగతీ తెలిసిందే. ఒక దశను దాటిన తరువాత ప్రజాస్వామిక రాజ్యం కంటే ప్రైవేట్ అధికారం పెరిగితే స్వేచ్ఛకు హామీ ఉండదని అమెరికా మాజీ అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ డి రూజ్‌వెల్ట్ చెప్పాడు. గుత్త సంస్థలను అడ్డుకున్నందుకే అవి కుట్రచేసి మిలిటరీ తిరుగుబాటుద్వారా చిలీ కమ్యూనిస్టు నేత సాల్వెడార్ అలెండీని అధికారం నుంచి కూల్చివేసిన సంగతి తెలిసిందే. పదహారు వందల బడాకంపెనీల మీద ఒక సర్వే నిర్వహించగా కేవలం 0.4 శాతం మాత్రమే కార్మికులకు జీవన వ్యయ వేతనం ఇస్తున్నట్లు అంగీకరించాయి. కార్మిక సంఘాలను ఏర్పాటు కానివ్వకుండా అడ్డుకోవటం, అణచివేతల కారణంగా యూనియన్లలో చేరుతున్నవారి సంఖ్య తగ్గుతోంది. ఓయిసిడి దేశాలలో 1985లో 30 శాతం మంది చేరగా 2017 నాటికి 17 శాతానికి పడిపోయింది.

మహిళలకు జరుగుతున్న అన్యాయం, వేతనాల చెల్లింపు కూడా దారుణంగా ఉంది. మధ్య ప్రాచ్యం, ఉత్తర ఆఫ్రికాలో ఒక పురుషుడు ఎలాంటి చెల్లింపులు లేని సంరక్షణ పనిలో వారానికి ఒకటి నుంచి ఐదు గంటల వరకు ఉంటుండగా అదే మహిళలు 17 నుంచి 34 గంటలు పని చేస్తున్నారు. ప్రపంచమంతటా వీరి పని విలువను నగదు రూపంలో లెక్కిస్తే ఏటా 10.8 లక్షల కోట్ల డాలర్లుగా తేలింది. అధిక వేతనాలు ఉన్నాయని అనుకుంటున్న ప్రపంచ టెక్నాలజీ కంపెనీల్లో చెల్లిస్తున్నదాని కంటే ఇది మూడు రెట్లు ఎక్కువ. ఐరోపా సూపర్ మార్కెట్లకు సరఫరా చేసే పండ్లు, ద్రాక్ష క్షేత్రాల్లో పని చేసే కోస్టారికా, దక్షిణాఫ్రికా మహిళలకు ఒక సీసా వైన్ విక్రయించే ధరలో కేవలం 1.2 శాతమే వేతనాల రూపంలో లభిస్తుండగా సూపర్ మార్కెట్లకు 50 శాతం పైగా దక్కుతున్నది. సంపదలు కార్పొరేట్ల వద్ద పేరుకు పోవటానికి, అసమానతలు పెరగటానికి పన్నుల తగ్గింపు కూడా ఒక ప్రధాన కారణం. ఓయిసిడి దేశాలలో 1980లో కార్పొరేట్ ఆదాయపన్ను 48 శాతం ఉండగా 2022 నాటికి 23.1 శాతానికి తగ్గింది. ప్రపంచవ్యాపితంగా ఇదే ధోరణి. నూట నలభై ఒక్క దేశాలలో 111 చోట్ల 2020-2023 కాలంలో తగ్గాయి. ప్రపంచమంతటినీ చూస్తే 23 నుంచి 17 శాతానికి పడిపోయాయి. విదేశాల్లో పొందిన లాభాల్లో 35 శాతం ఎలాంటి పన్నులు లేని ప్రాంతాలకు చేరాయి. పన్ను విధానాలపై కార్పొరేట్ల ప్రభావానికి ఇది నిదర్శనం. ఈ మేరకు ప్రభుత్వాలకు రాబడి తగ్గటంతో సంక్షేమ కార్యక్రమాలకు కోత విధిస్తున్న కారణంగా ప్రపంచమంతటా అశాంతి పెరుగుతున్నది.

నేడు జాతీయ బాలికల దినోత్సవం



భద్రతే భరోసా!

అనాదిగా మన దేశంలో ఆడపిల్లలంటే చిన్న చూపు ఉంది. కాని మాటల్లో, ఆధ్యాత్మిక గ్రంథాల్లో మాత్రం మహిళలే ఈ జగత్తుకు ఆధారమని చెబుతారు. వాస్తవంగా చూస్తే దీనికి విరుద్ధంగా కుటుంబ స్థాయి నుంచి వివక్షత కొనసాగుతూనే ఉంది. చదువు, ఆస్తి, ఆర్థిక విషయాలలో అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలకు సమ ప్రాధాన్యత లేదు. కొన్ని కుటుంబాల్లో ఆడపిల్ల అని తెలిస్తే అబార్షన్ చేయించడం ఇప్పటికీ జరుగుతున్నది. 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రతీ 1000 మంది పురుషులకు 919 మహిళలు ఉన్నట్లు తెలుస్తోంది. పురుషులతో సమానంగా మహిళలకు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడానికి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నా, నేటికీ ఆ లక్ష్యం సాధించలేకపోవడం గమనార్హం.

ముఖ్యంగా మన దేశంలో ఆడపిల్లలు అనేక వివక్షతలు ఎదుర్కొంటున్నారు. ఎన్నో చట్టాలు ఉన్నా, రక్షణ కల్పించలేక పోవడం బాధాకరం. గత 2023 ఒక్క సంవత్సరంలోనే 1.20 కోట్ల బాల్య వివాహాలు జరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఉన్నత విద్య అభ్యసించకుండా, అనేక లక్షల మంది బాలికలు డ్రాప్ అవుట్ అవుతున్నారు. ఉన్నత విద్య, కళాశాల విద్య అమ్మాయిలకు ఆమడదూరంలో ఉన్నది. కస్తూరిబా గాంధీ, బాలికల, మహిళా పాఠశాలలు ఏర్పాటు చేసినా, వీటిలో సరైన సదుపాయాలు, ఉపాధ్యాయులు, మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల చదువుకు దూరం అవుతున్నారు. మన రాష్ట్రంలో మెర్జింగ్ పేరుతో ప్రాథమిక పాఠశాలలను హై స్కూల్‌లో విలీనం చేయడం ద్వారా అనేక మంది బాలికలు డ్రాప్ అవుట్ అయ్యి, ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్రోల్మెంట్ పడిపోవడానికి కారణం అవుతున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలి.

దేశ వ్యాప్తంగా పాఠశాలల్లో అమ్మాయిలకు కనీసం “టాయ్‌లెట్” సౌకర్యాలు లేని పాఠశాలలు కోకొల్లలని గణాంకాలు చెబుతున్నాయి. పేదరికం కారణంగా చాలామంది అమ్మాయిలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. చిన్నతనంలోనే అమ్మాయిలు బాలకార్మికలుగా మారిపోతున్నారు. ఇంటి పనుల్లో, కుటుంబ పోషణకై పనిమనుషులుగా మారిపోతున్నారు. అసంఘటిత రంగంలో, భవన నిర్మాణంలో, ఇటుక బట్టీల్లో ఎక్కువగా అమ్మాయిలు పనిచేస్తున్నారు. పని ప్రదేశాల్లో సౌకర్యాలు లేవు. భద్రత లేదు. లైంగిక వేధింపులకు, దాడులకు గురవుతున్నారు. అక్రమ రవాణాకు గురవుతున్నారు. పోక్సో చట్టం, బాలికా సంరక్షణ చట్టాలు ఎన్ని ఉన్నా, నేటికీ ప్రతీరోజూ పదుల సంఖ్యలో బాలికలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయి.

2008 నుంచి బాలికల రక్షణ కోసం జాతీయ బాలికల దినోత్సవం జరుపుతున్నాం. పాలకులు పైకి బేటీ బచావో-బేటీ పఢావో అంటున్నా చిత్తశుద్ధి లేకపోవడంతో పరిస్థితిలో మార్పు రావడం లేదు. బాలికలకు భరోసా కలుగడంలేదు. ఇకనైనా పాలకుల, కుటుంబ సభ్యుల ముఖ్యంగా మగవారి “మైండ్ సెట్” మారాలి. బాలురతో సమానంగా అమ్మాయిలకు అన్నింటా సమాన హక్కులు కలుగచేయాలి. నాణ్యమైన విద్య అందించాలి. సమాన అవకాశాలు కల్పించాలి. సమాన వేతనాలు అందించాలి. మూఢనమ్మకాలు, మూఢ విశ్వాసాలు విడనాడాలి. ప్రభుత్వాలు కూడా బాలికల రక్షణ కోసం మరెన్నో నూతన పథకాలు ప్రవేశపెట్టాలి. శాస్త్రీయ దృక్పథం పెరగాలి. లైంగిక వేధింపులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. బాలికా విద్యకు, భద్రతకు చర్యలు చేపట్టాలి. చట్టాలు సక్రమంగా అమలు చేయాలి. ర్యాగింగ్ భూతాన్ని తరిమి కొట్టాలి. కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, మీడియా, పోలీసు, న్యాయ వ్యవస్థ, స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వాలు బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించాలి.

మన దేశంలో కూడా పురుషులతో సమానంగా మహిళలు, బాలికలు భాగస్వామ్యం అన్ని రంగాల్లో పెరగాలి. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో బాలికల పాత్ర కూడా ఉందని అందరూ గ్రహించాలి. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చెప్పినట్లు “ఒక దేశ అభివృద్ధి, ఆ దేశ మహిళల అభివృద్ధి పైనే ఆధారపడి ఉంటుంది” అన్న మాటలు మరువరాదు. భారత్ అభివృద్ధి బాలికల అభ్యున్నతిపైనే ఆధారపడి ఉందని పాలకులు, ప్రజలు గ్రహించాలి.

- ఐ. ప్రసాదరావు

మూడేళ్లుగా పోరాడుతున్న చిరుద్యోగులు


సమస్య



ముఖ్యమంత్రి హామీ...బోర్డు తీర్మానం...కోర్టు ఆదేశాలు ఇవేవీ అమలు కానపుడు నోరులేని పేదవారు ఏం చేయాలి? ‘మీరిచ్చిన హామీలు అమలు చేయండి. మహాప్రభో...’ అంటూ 3 సంవత్సరాల 2 నెలలుగా వంతుల వారీగా కడుపు మాడ్చుకుని దీక్షలు చేస్తున్నారు. అయినా ఏలికలకు మనసు కరగటం లేదు.

యాభై ఆరు నెలల జగన్మోహన్ రెడ్డి పాలనా కాలంలో 38 నెలలుగా నిరాహార దీక్షలు చేస్తున్న చిరుద్యోగుల సంగతి రాష్ట్రంలో చాలా మందికి తెలియదు. వీరు చేస్తున్న పోరాటం, వారి పట్టుదల విస్మయం కల్గిస్తుంది. కేవలం 150 మంది కార్మికులు సాగిస్తున్న పోరాటానికి తిరుపతి నగరంలో సంఘీభావం వెల్లువెత్తుతున్నది. తిరుమల-తిరుపతి దేవస్థానం (టిటిడి)లో దశాబ్దాలుగా పని చేస్తున్న అటవీ కార్మికులు కోరుతున్న కోర్కెలు చాలా చిన్నవి.

ముఖ్యమంత్రి హామీ, టిటిడి బోర్డు తీర్మానం, కోర్టు ఆదేశాలు అమలుకై వీరు సాగిస్తున్న పోరాటం అధికారంలో ఉన్న వారి పట్ల విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేస్తున్నది.



కందారపు మురళి

ప్రభుత్వాధినేత జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ, బోర్డు తీర్మానాలు, కోర్టు ఆదేశాలు కొందరికి అమలు కావు. అర్హతలు లేని జూనియర్లను ఏకంగా పర్మినెంటు చేసి, సీనియర్లను విస్మరించటం ధార్మిక సంస్థ టిటిడిలో ఎలా సాధ్యమైందన్న ప్రశ్నకు ముఖ్యమంత్రి కానీ, గత ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ప్రస్తుత ఛైర్మన్ కరుణాకర్ రెడ్డి, ఇఒ ధర్మారెడ్డి కానీ సమాధానం చెప్పలేక పోతున్నారు.

దీని పూర్వాపరాలు తెలుసుకోవాలంటే వాస్తవం చదవాలి. సహజ న్యాయ సూత్రాలకు భిన్నంగా వ్యవహరించిన టిటిడి పెద్దలను ఏం చేయాలో సమాజం నిర్ణయించాలి.

2024 జనవరి 23 నాటికి వీరి దీక్షా కాలం 1153 రోజులు (3 సంవత్సరాల 2 నెలలు) పూర్తయింది.

30 సంవత్సరాల సర్వీసు కల్గిన టిటిడి అటవీ కార్మికులను పక్కన పెట్టి, 10 సంవత్సరాల బ్రేక్ ఆఫ్ సర్వీసు ఉన్నవారిని పర్మినెంటు చేశారు.

2005లో, 2011లలో టిటిడి యాజమాన్యం సూచనమేరకు సొసైటీలు ఏర్పరచుకున్న అటవీ కార్మికులను కాదని 2013లో వచ్చిన జూనియర్లను పర్మినెంటు చేయటం ధర్మాన్ని కాపాడాల్సిన సంస్థ చేయాల్సిన పనేనా?!

2019లో మొత్తం 362 మంది కార్మికులకు టైం స్కేలు ఇవ్వాలని బోర్డు తీర్మానించింది. ఏకపక్షంగా 162 మంది జూనియర్లను పర్మినెంట్ చేసి మిగిలిన 200 మంది సీనియర్లకు టైం స్కేలు కూడా ఇవ్వకుండా కార్పొరేషన్‌లో బలవంతంగా కలిపేయటం ఏపాటి ధర్మం.

కార్మికులకు జరిగిన అన్యాయంపై ‘సిఐటియు సాగిస్తున్న పోరాటానికి ప్రజలందరూ మద్దతునివ్వాలని ఈ కార్మికులు కోరుతున్నారు.

ధర్మాన్ని రక్షించండి...ఆ ధర్మమే మిమ్మల్ని కాపాడుతుందని ప్రచారం చేసే తిరుమల-తిరుపతి దేవస్థానంలో అధర్మం పరాకాష్టకు చేరిందనటానికి ఇంతకంటే సాక్ష్యం ఏమి కావాలి. స్వామివారిని నమ్ముకుని పని చేస్తున్న స్వామి సేవకులకు ఇంత అన్యాయం చేయవచ్చా? కేవలం ‘సిఐటియు’ యూనియన్‌లో ఉన్నారన్న కక్షపూరితమైన వైఖరి తప్ప ఇందులో ఏ న్యాయం ఉందో ఏలికలు చెప్పలేకపోతున్నారు.

‘నేను ఉన్నాను...నేను విన్నానని’ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చెప్పినప్పుడల్లా తమకు న్యాయం జరుగుతుందని పులకించిపోయిన టిటిడి అటవీ కార్మికులు తమకు జరిగిన అన్యాయంపై ప్రస్తుతం కుమిలి పోతున్నారు. అధికార పార్టీ నాయకులు కార్మికుల మధ్య చిచ్చుపెట్టి లక్షలు, కోట్ల రూపాయలు ఖర్చు పెట్టించి కోర్టుల చుట్టూ, నాయకుల చుట్టూ తిరిగేట్టు చేస్తున్నారు.

కోర్టు ఆదేశాలను అమలు చేయకపోగా ఈ పేద కార్మికులపై కోర్టులలో అప్పీలుకు వెళుతూ మీకు న్యాయం ఎట్లా జరుగుతుందో చుస్తామంటూ స్వయంగా ఐఎఎస్ లే కార్మికులతో వెటకారంగా మాట్లాడటం ఎక్కడి ధర్మం.

అటవీ కార్మికులు కేవలం 200 కుటుంబాలే కావచ్చు. అధికార పార్టీ నాయకుల ఓట్ల రాజకీయంలో వీరి ఓట్లతో మనకు అవసరం ఏముందిలే! అన్న నిర్లక్ష్యం కావచ్చు. కానీ ప్రతిరోజూ పచ్చగా మనకు కనబడే తిరుమల కొండ వీరి కృషి ఫలితమే.

తిరుమల కొండపై అడవులు తగలబడిపోతుంటే భారత సైన్యం కూడా హెలికాప్టర్ల ద్వారా మంటలను ఆర్పలేక చేతులెత్తేస్తే ఒళ్ళంతా గోతాలు చుట్టుకుని పచ్చని చెట్ల ఆకులు, మండలతో ‘ఖాండవ దహనాన్ని’ ఆర్పిన మొనగాళ్లు వీరు.

తిరుమల, తిరుపతిలో పచ్చదనానికి కృషి చేస్తున్న వీరిలో 12 మంది వివిధ కారణాలతో ఇప్పటికే మరణించారు. అత్యధికులు తమకు న్యాయం ఎప్పుడు జరుగుతుందన్న మానసిక క్షోభతో మరణించారు. ‘ముదిమి’ మీద పడటంతో కొందరు రిటైరయ్యారు. జీవితమంతా టిటిడి సేవలో గడిపి ఆఖరి దశలో వున్నా సాయం చేయని టిటిడి యాజమాన్య ‘పాషాణ హృదయానికి’ ఏ పేరు పెట్టగలమో ఆలోచించాలి.

ముఖ్యమంత్రి హామీ...బోర్డు తీర్మానం...కోర్టు ఆదేశాలు ఇవేవీ అమలు కానపుడు నోరులేని పేదవారు ఏం చేయాలి? ‘మీరిచ్చిన హామీలు అమలు చేయండి. మహాప్రభో...’ అంటూ 3 సంవత్సరాల 2 నెలలుగా వంతుల వారీగా కడుపు మాడ్చుకుని దీక్షలు చేస్తున్నారు. అయినా ఏలికలకు మనసు కరగటం లేదు.

కార్మిక పక్షపాతినని చెప్పే కరుణాకర్ రెడ్డి గారు టిటిడి ఛైర్మన్ కాగానే అటవీ కార్మికుల పోరాటం సుఖాంతం అవుతుందని తిరుపతి నగర ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాలు భావించాయి.

ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి 5 నెలలు కావస్తున్నా వీరి వైపు కన్నెత్తి కూడా చూడని వైనం ఆశ్చర్యపరుస్తున్నది. ఇక విధి లేక వీరి గోడు వినేవారు లేక అనివార్యమై అటవీ కార్మికులు ఈ నెల 27వ తేదీ నుంచి నిరవధిక నిరాహార దీక్షలకు సన్నద్ధమయ్యారు.

మిగిలిపోయిన కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని వీరు కోరుతున్నారు.

మనసున్న ప్రతి మనిషి కార్మికుల ధర్మ పోరాటానికి అండగా నిలబడాలని చేతులు జోడించి వేడుకుంటున్నారు.

/ వ్యాసకర్త టిటిడి అటవీ కార్మికుల గౌరవాధ్యక్షులు- తిరుపతి, సెల్ : 9490098840/

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

స్విగ్గీ ప్లాట్‌ఫామ్ రుసుం రెట్టింపు..!

న్యూఢిల్లీ : ప్రముఖ ఫుడ్ డెలివరీ వేదిక స్విగ్గీ త్వరలో తన ప్లాట్‌ఫామ్ రుసుంను రెట్టింపు చేయనుందని సమాచారం. ప్రస్తుతం ఉన్న ఫీజును రూ.5 నుంచి రూ.10కి పెంచే అవకాశం ఉందని తెలుస్తోంది. స్విగ్గీ త్వరలో ఐపిఒకు రానున్న నేపథ్యంలో నష్టాలను తగ్గించుకోవడానికి తన ప్లాట్ ఫామ్ ఫీజును రెట్టింపు చేసే యోచనలో ఉందని రిపోర్టులు వస్తున్నాయని ఆంగ్ల మీడియాలో కథనాలు వెల్వడుతున్నాయి. తొలుత ఉచితంగా ప్రారంభించిన ఈ సేవలను 2023 ఏప్రిల్‌లో కొన్ని నగరాల్లో మాత్రమే ఫుడ్ డెలివరీలపై ప్లాట్‌ఫామ్ ఫీజు వసూలుచేయడం ప్రారంభించింది. ఆ తర్వాత ప్రతి ఆర్డర్‌పై రూ.2 చొప్పున చార్జ్ చేసింది. ఆ తర్వాత దీన్ని రూ.5కు పెంచింది. ప్రస్తుతం రెట్టింపు చేసే యోచనలో ఉంది. స్విగ్గీలో రోజుకు 15 లక్షల నుంచి 25 లక్షల ఫుడ్ ఆర్డర్లు నమోదవుతున్నాయి.

మానవతావాది డాక్టర్ జ్యోతి కన్నుమూత

- పలువురు నేతల నివాళి

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

విద్యా వ్యవస్థాపకులు నాగెళ్ల రాజేశ్వరమ్మ కుమార్తె, సిపిఎం అభిమాని డాక్టర్ సినీవరపు జ్యోతి (83) మంగళవారం తుదిశ్వాస విడిచారు. గత కొన్ని రోజులుగా కేన్సర్‌తో బాధపడుతున్న ఆమె కృష్ణాజిల్లా ఉయ్యూరు మండలం కాటూరులోని స్వగృహంలో మృతి చెందారు. ఆమెకు భర్త ప్రసాద్ ఉన్నారు. తల్లిదండ్రులు రాజేశ్వరమ్మ, జానకిరామయ్య ఆశయ సాధన కోసం తుదిశ్వాస వరకూ కృషి చేశారు. జ్యోతి భౌతికకాయాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, మాజీ మంత్రి, రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబూరావు, వి.ఉమామహేశ్వరరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి కె.రమాదేవి, సిపిఎం సీనియర్ నాయకులు పి.మధు, రాష్ట్ర నాయకులు కాట్రగడ్డ స్వరూపరాణి, ఎంబి విజ్ఞాన కేంద్రం బాధ్యులు పిన్నమనేని మురళీకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పాటూరు రామయ్య, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం. హరి బాబు, సిపిఎం కృష్ణా జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.రఘు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

కన్నీటి వీడ్కోలు

జ్యోతి అంత్యక్రియలు సాయంత్రం ఆమె స్వగ్రామం కాటూరులో జరిగాయి. ముందుగా ఆమె స్వగృహం నుండి శ్మశానవాటిక వరకు అంతిమయాత్ర సాగింది. మహిళా నేతలు డి.రమాదేవి, కాట్రగడ్డ స్వరూపరాణి, పిన్నమనేని విజయ, వీరమాచినేని జ్యోతి, చేబ్రోలు బసవమ్మ, మల్లంపల్లి జయమ్మ, బి.కీర్తి, నిమ్మది నాగమణి, ఎన్.ప్రశాంతి తదితరులు ఆమె పాడెమోశారు.



జ్యోతి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.నర్సింగరావు, డి.రమాదేవి, జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు తదితరులు

తాడోపేడో తేల్చుకుంటాం

- 30 నుంచి మలిదశ ఉద్యమం
- ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్, సర్పంచుల సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తమ న్యాయమైన 16 డిమాండ్లను ఈనెలాఖరులోగా పరిష్కరించకపోతే రాష్ట్ర ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్, ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం పేర్కొంది. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల 30 నుంచి మలిదశ ఉద్యమాన్ని కూడా ప్రారంభిస్తామని ప్రకటించారు. ఈ మేరకు విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు వైవిబి రాజేంద్రప్రసాద్, ఎపి సర్పంచుల సంఘం అధ్యక్షులు వానపల్లి ముత్యాలరావు అధ్యక్షతన మంగళవారం రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఇందుకు సంబంధించిన 16 డిమాండ్ల సాధన కోసం పలు తీర్మానాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. తమ డిమాండ్లు సర్పంచులు, ఎంపిటిసిల వ్యక్తిగతమైన సమస్యలు కావని, రాష్ట్రంలోని 12,918 గ్రామాల్లో నివసిస్తున్న 3.50 కోట్ల మంది గ్రామీణ ప్రజల న్యాయబద్ధమైన సమస్యలని రాష్ట్ర కమిటీ తీర్మానించింది. ఈ సమావేశంలో ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి, ఎపి సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి పగడాల రమేష్ పాల్గొన్నారు.

కుప్పకూలిన 'జీ' షేర్లు

- మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి
- సెన్సెక్స్ 1053 పాయింట్ల పతనం

ముంబయి : అమ్మకాల ఒత్తిడితో మంగళవారం దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ పతనాన్ని చవి చూశాయి. ముఖ్యంగా జీ-సోనీ ఒప్పందం రద్దుతో జీ ఎంటర్‌టైన్‌మెంట్ షేర్లు 30 శాతం పైగా కుప్పకూలాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల పవనాలతో సెన్సెక్స్, నిఫ్టీలు ఉదయం లాభాల్లోనే ప్రారంభమయినప్పటికీ.. ఆ తర్వాత ఎఫ్ఎంసిజి, బ్యాంకులు, లోహ రంగాల్లో అమ్మకాల ఒత్తిడితో సూచీలు తీవ్ర నష్టాల్లోకి జారుకున్నాయి. తుదకు బిఎస్ఇ సెన్సెక్స్ 1053 పాయింట్లు కోల్పోయి 70,039కు జారింది. ఇంట్రాడేలో 72,039- 70,235 మధ్య కదలాడింది. నిఫ్టీలో ఇండస్‌ఇండ్ బ్యాంక్, కోల్ ఇండియా, ఒఎన్‌జిసి, అదానీ పోర్ట్స్, ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ అత్యధికంగా నష్టపోయిన వాటిలో ముందు వరసలో ఉన్నాయి. సిప్లా, సన్ ఫార్మా, భారతీ ఎయిర్‌టెల్, ఐసిఐసిఐ బ్యాంక్, డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ అధికంగా లాభపడిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. బిఎస్ఇలో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు దాదాపు 3శాతం వరకు నష్టపోయాయి. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ త్రైమాసిక ఫలితాల ప్రభావం ఆ సూచీపై ఇంకా కొనసాగుతోంది. తాజాగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ సూచీ 3.45 శాతం క్షీణించి రూ.1,427.60కు పడిపోయింది. గడిచిన ఐదు సెషన్లలో ఈ సూచీ ఏకంగా 14.28 శాతం లేదా రూ.237 విలువ కోల్పోయింది. మరో ప్రధాన స్టాక్ అయిన రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ 2.08 శాతం నష్టంతో రూ.2,656.75 వద్ద ముగిసింది. వీటికి తోడు ఐటిసి, అదానీ టోటల్ గ్యాస్ ఇతర స్టాక్స్ పతనం.. మార్కెట్లపై విశ్వాసం కోల్పోయేలా చేశాయి. సోనీతో కుదిరిన దాదాపు రూ.82వేల కోట్ల ఒప్పందం రద్దవడంతో జీ షేర్లు కుప్పకూలాయి. మంగళవారం ఈ సూచీ ఏకంగా 30.47 శాతం పతనమై రూ.160.90 వద్ద ముగిసింది.

ఇఎస్ఎంఎస్ అమలుకు చర్యలు

- ఉన్నతాధికారులకు శిక్షణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ప్రలోభాల రహిత ఎన్నికల పర్యవేక్షణను పెంపొందించేందుకు రూపొందించిన ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఇఎస్ఎంఎస్) అమలుకు కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. ఈ ప్రక్రియలో భాగంగా మంగళవారం భారత ఎన్నికల సంఘం అధికార బృందం బెంగళూరులో శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల మధ్య అంతరాయం లేని సమన్వయం, గూఢచార భాగస్వామ్యాన్ని నిర్ధారించడం ఈ వ్యవస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొంది. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్‌కుమార్ మీనాతోపాటు పలు కేంద్ర, రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల నోడల్ అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులు పాల్గొన్నారు. 2023 డిసెంబరులో ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మిజోరం, రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రాలకు జరిగిన సాధారణ ఎన్నికల్లో తొలిసారి ఈ వ్యవస్థను విజయవంతంగా వినియోగించారు. త్వరలో ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో కూడా ఈ విధానాన్ని అమలు పరిచేందుకు అవసరమైన శిక్షణను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల అధికారులకు ఇచ్చేందుకు బెంగళూరుకు అధికార బృందాన్ని పంపింది. ఈ సందర్భంగా ముకేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ.. ఇఎస్ఎంఎస్ వినియోగం వల్ల ఆటోమేటిక్‌గా డాటా జనరేట్ అవ్వడం, సేవ్ అవ్వడం వల్ల మానవ తప్పిదాలకు, దుష్ప్రవర్తనకు అవకాశం ఉండదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పోలీస్, ఎక్సైజ్, ఇన్‌కమ్ ట్యాక్స్, వాణిజ్య పన్నులు, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరోతోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు ఈ వ్యవస్థను వినియోగించేటప్పుడు ఏ శాఖ ఎటువంటి విధులను నిర్వహించాలనే అంశంపై ప్రొటోకాల్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు ప్రామాణిక ఆపరేషన్ విధానాన్ని రూపొందించాలని కోరారు. శిక్షణ కార్యక్రమంలో ఇఎస్ఎంఎస్ వినియోగానికి అవగాహన కల్పించారు, డెమో నిర్వహణ సమయంలో ఈ వ్యవస్థ వినియోగంపై ఏమైనా సందేహాలు, సమస్యలు తలెత్తితే తక్షణమే వాటిని నివృత్తి పర్చేందుకు సంబంధిత అధికారులు అందుబాటులో ఉండాలని మీనా కోరారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అడిషనల్ డిజి (లా అండ్ ఆర్డర్) ఎస్ బాగ్చీ, ఐజిపి వెంకటరామిరెడ్డి, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డైరెక్టర్ రవిప్రకాష్, వాణిజ్య పన్నులశాఖ స్పెషల్ కమిషనరు అభిషేక్ కిశోర్, అదనపు సిఇఒ కోటేశ్వరరావు, ఎక్సైజ్, ఇన్‌కమ్ ట్యాక్స్, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, ఎన్‌ఫోర్స్‌మెంట్ నోడల్ అధికారులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

వైఎస్ జగన్ ప్రతిపక్ష నేతగా ఉండగా విశాఖ విమానాశ్రయంలో జరిగిన దాడి కేసులో నిందితుడు జె శ్రీనివాస్‌రావు వేసిన బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు విచారణ బుధవారానికి వాయిదా పడింది. నిందితుడి బంధువులు నిరాహార దీక్ష చేస్తున్నామని చెప్పి బెయిల్ పిటిషన్ విచారణ సత్వరమే పూర్తి చేయాలని ఒత్తిడి చేసేందుకు లేదని హైకోర్టు చెప్పింది. ఎన్ఐఎ వాదనల నిమిత్తం విచారణను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ ఎం కిరణ్మయి ప్రకటించారు.

అమెరికాలో ఉద్యోగాల తెగ్గోత..

- ఐటి వర్గాల్లో తీవ్ర ఆందోళన
- గతేడాది తొలగింపుల్లో 98 శాతం పెరుగుదల
- 2024లోనూ ఉద్వాసనలే..! బోనస్‌లకు ఎగనామం



వాషింగ్టన్ : పెట్టుబడిదారీ అగ్రదేశం అమెరికాలో ఉద్యోగులకు కనీస భద్రత లేకుండా పోతోంది. గడిచిన రెండేళ్లలో లక్షలాది ఉద్యోగులు రోడ్డున పడగా.. ఈ ఏడాది మరిన్ని ఉద్వాసనలు కొనసాగనున్నాయని తాజా ఓ రిపోర్ట్ పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. 'ఛాలెంజర్ గ్రే అండ్ క్రిస్మస్' నివేదిక ప్రకారం.. అమెరికా కంపెనీలు గతేడాది దాదాపు 7,21,677 మంది ఉద్యోగులపై వేటు వేశాయి. 2022లో నమోదయిన 3,63,832 తొలగింపులతో పోల్చితే ఇది 98 శాతం అధికమని ఛాలెంజర్ గ్రే అండ్ క్రిస్మస్ వెల్లడించింది. ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా, అమెజాన్ సహా టెక్ రంగంలోని కంపెనీలే దాదాపు 1,68,032 మందిని ఇంటికి పంపించాయని తెలిపింది. ఈ సంఖ్య ఏడాదిక్రితంతో పోల్చితే 73 శాతం ఎక్కువ. మరోవైపు 2023లో 34 శాతం యాజమాన్యాలు తమ ఉద్యోగులకు బోనస్‌లను ఎగ్గొట్టాయి. 'ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల పెంపు, ద్రవ్యోల్బణం వంటి అంశాలు ఉద్యోగ మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా చిన్న చిన్న స్టార్టప్స్ నుంచి పెద్ద టెక్ కంపెనీల వరకూ ఉద్యోగుల్ని తొలగిస్తున్నాయి. దీంతో 2024 ఉద్యోగ మార్కెట్ మరింత దారుణంగా తయారయ్యే అవకాశం ఉంది.' అని ఛాలెంజర్ గ్రే అండ్ క్రిస్మస్' పేర్కొంది. 'కార్మికుల వ్యయం ఎక్కువ. కాబట్టే ఈ ఏడాది సైతం సంస్థలు పొదుపు చర్యలకు దిగనున్నాయి. 2024 జనవరి నుంచి మార్చితో ముగియనున్న త్రైమాసికంలో భారీగా నియామకాలు తగ్గించి.. మరోవైపు ఉన్న సిబ్బందికి ఎసరు పెట్టే యోచనలో ఉన్నాయి. కోవిడ్-19 వంటి సమయాల్లో ఓ వెలుగు వెలిగిన ఐటి రంగం ప్రస్తుతం కృత్రిమ మేధ టెక్నాలజీతో నేల చూపులు చూస్తోంది. ఆర్థిక మాంద్యం, ప్రాజెక్ట్‌ల లేమి వంటి సమస్యల్ని ఎదుర్కొంటున్న ఆయా టెక్ కంపెనీలు తమ వ్యయాలను తగ్గించుకునే యోచనలో పడ్డాయి. ఈ నేపథ్యంలోనే ఉద్యోగులను ఇంటికి పంపిస్తున్నాయి.' అని ఛాలెంజర్ గ్రే అండ్ క్రిస్మస్ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆండీ ఛాలెంజర్ అన్నారు.

రిటైల్, తయారీలోనూ వేటు..

గతేడాది 2023లో రిటైల్ కంపెనీలు ఏకంగా 78,840 మంది ఉద్యోగులపై వేటు వేశాయి. ఇంతక్రితం ఏడాది ఉద్వాసనలతో పోల్చితే 274 శాతం పెరిగాయి. 2024లోనూ అదే పరిస్థితి కొనసాగనుందని ఆండీ ఛాలెంజర్ పేర్కొన్నారు. ఆ తర్వాత హెల్త్‌కేర్, ఉత్పత్తుల తయారీ రంగాలు ఉద్వాసనలకు పాల్పడనున్నాయని అంచనా వేశారు. ఆస్పత్రులు సహా ఆరోగ్య సంరక్షణ ఉత్పత్తుల తయారీ సంస్థల్లో తొలగింపులు 91 శాతం పెరిగి 58,560గా నమోదయ్యాయి. 'అమెరికా ఆర్థిక వ్యవస్థలోని అనిశ్చితులే ఉద్యోగుల తొలగింపులకు ప్రధాన కారణం. డిమాండ్ సన్నగిల్లి పలు స్టోర్లు మూతపడటం, వ్యాపారాల దివాలా, ఎఐ తదితర అంశాలు ఉద్యోగులపై కత్తివేలాడేలా చేసింది.' అని ఛాలెంజర్ గ్రే అండ్ క్రిస్మస్ నివేదిక పేర్కొంది.

టిక్‌టాక్‌లోనూ కోతలు..

ఈ ఏడాదిలో ఇప్పటికే గూగుల్, అమెజాన్, యూనిటీ, డిస్కార్డ్ వంటి టెక్ కంపెనీలు ఉద్యోగులను తొలగించాయి. ఈ జాబితాలో తాజాగా వీడియో షేరింగ్ వేదిక టిక్‌టాక్ చేరింది. లాస్‌ఏంజెల్స్, న్యూయార్క్, ఆస్టిన్ సహా ప్రపంచ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పని చేస్తున్న దాదాపు వంద మంది ఉద్యోగులపై టిక్‌టాక్ వేటు వేసింది. ఆర్థిక మందగమనం నేపథ్యంలో వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగా టిక్‌టాక్ ఉద్వాసనలకు పాల్పడిందని ఎన్‌పిఆర్ రిపోర్ట్ పేర్కొంది. సంస్థ పునర్ వ్యవస్థీకరణ ప్రణాళికల్లో భాగంగా సేల్స్, అడ్వర్టైజింగ్ విభాగానికి చెందిన దాదాపు 60 మంది ఉద్యోగులను విధుల నుంచి తొలగిస్తున్నట్లు కంపెనీ ప్రతినిధి వెల్లడించారు.

మహీంద్రా నుంచి సుప్రో ప్రాఫిట్ ట్రక్ ఎక్సల్

న్యూఢిల్లీ : ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ మహీంద్రా అండ్ మహీంద్రా కొత్తగా సుప్రో ప్రాఫిట్ ట్రక్ ఎక్సల్‌ను విడుదల చేసింది. దీని ప్రారంభ ధరను రూ.6.61 లక్షలుగా నిర్ణయించింది. దీన్ని 900 కిలోలు, 750 కిలోల పెలోడ్ సామర్థ్యంతో ఆవిష్కరించింది. ఇది డీజిల్, సిఎన్‌జి డ్యుయో వేరియంట్‌లో లభ్యమవుతందని తెలిపింది. కొత్త మహీంద్రా సుప్రో ప్రాఫిట్ ట్రక్ ఎక్సెల్ బహుళ ఇంజిన్, ఇంధన ఎంపికలు, ఆధునిక శైలి, అధునాతన భద్రత, సాంకేతికత ఫీచర్లతో డిజైన్ చేశామని ఎంఅండ్ఎం ఆటోమోటివ్ డివిజన్ సిఇఒ నళినీ కాంత్ గొల్లగుంట తెలిపారు. సుప్రో ఎక్సల్ డీజిల్ లీటర్‌కు 23.6 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందన్నారు.

సిఐడి పిటిషన్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ 41ఎ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని, ఆయన్ను అరెస్టు చేసేందుకు అనుమతించాలని సిఐడి వేసిన పిటిషన్ విచారణను విజయవాడ ఎసిబి కోర్టు ఈ నెల 30కి వాయిదా వేసింది. నారా లోకేష్ రెడ్‌బుక్ పేరుతో ప్రభుత్వ అధికారులను బెదిరిస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలన్న పిటిషన్‌పై ఎసిబి కోర్టు మంగళవారం విచారణ జరిపింది. అలాగే చంద్రబాబుపై నమోదైన స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అప్రూవర్‌గా మారిన చంద్రకాంత్ షాకు సంబంధించి సిఐడి దాఖలు చేసిన పిటిషన్‌లోని డాక్యుమెంట్ల కాపీ కోసం మాజీ ఐఎఎస్ అధికారి లక్ష్మీనారాయణ ఎసిబి కోర్టులో వేసిన పిటిషన్ విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది.

జన శంబరం

- వైభవంగా సిరిమానోత్సవం
- లక్షలాదిగా తరలివచ్చిన యాత్రికులు
- గంటన్నర ఆలస్యంగా సిరిమాను ఊరేగింపు
- పట్టు వస్త్రాలు సమర్పించిన డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - మక్కువ (పార్వతీపురం మన్యం జిల్లా)

రాష్ట్ర గిరిజన దేవతగా గుర్తింపు పొందిన శంబర పోలమాంబ అమ్మవారి తొలి జాతర వైభవంగా జరిగింది. మంగళవారం సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో సిరిమాను ఊరేగింపు చేపట్టింది. ఈ సందర్భంగా అమ్మవారిని సుమారు లక్షన్నరకు పైగా భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆర్‌డిఒ కె.హేమలత సమన్వయంతో, అడిషనల్ ఎస్పీ సునీల్ సోరెన్ పర్యవేక్షణలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మూడు గంటల ప్రాంతంలో సిరిమానును అధిరోహిం చాల్సిన పూజారిని చదురు గుడి నుంచి తీసుకెళ్లేందుకు గ్రామ పెద్దలు గుడి వద్దకు రావడంతో పోలీసులు ఎక్కువ మందిని అనుమతించక పోవడంతో స్వల్ప వివాదం జరిగింది. దీంతో సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై నరసింహమూర్తి వివాదాన్ని సద్దుమణిగింప చేసి కార్యక్రమానికి మార్గం సుగుమం చేశారు. దీంతో సుమారు గంటన్నర ఆలస్యంగా పూజారి జన్ని జగదీష్ సిరిమాను అధిరోహించాల్సి వచ్చింది. ఎప్పటి మాదిరిగానే సావిడి వీధి నుంచి బయలుదేరిన సిరిమానుతో అమ్మవారు కేరళ వారి ఇంటి వద్ద పూజలు అందుకొని అనంతరం కరణం వారి ఇంటి వద్ద నుండి నేరుగా ఎస్సీ వీధి, పనుకు వీధి, గొల్ల వీధుల నుంచి మళ్లీ సావిడి ప్రధాన వీధికి చేరుకుని సిరిమానోత్సవం ముగింపు చేశారు

ముమ్మరంగా ఆలయ తనిఖీలు

జాతరకు వచ్చే యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పరిమితికి మించి వాహనాల్లో భక్తులను ఎక్కించకుండా నడపాలని ఆర్‌టిఒ మల్లికార్జున రెడ్డి తమ సిబ్బందికి సూచించారు. ఈ మేరకు వ్యక్తిగత, ప్రైవేట్ వాహహనాల్లో ప్రయాణించే వాహన చోదకులు వారు డ్రంక్ అండ్ డ్రైవ్, త్రిబుల్ రైడింగ్ లు చేయకుండా పర్యవేక్షించారు. జాతర సమయంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు అవగాహన కల్పిస్తూ పరిమితులు లేని వాహనాలుకు కేసులు కట్టడం ఫ్రంట్ సీటు సిట్టింగ్ కూడా లేకుండా చేసి భక్తులకు ఇబ్బంది కలగకుండా ప్రమాదాలు జరగకుండా ముందుగా డ్రైవ్ నిర్వహించడం జరిగింది. స్పెషల్ డ్రైవ్‌లో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సాలూరు జేవీఎస్ ప్రసాద్, జి సత్యనారాయణ, రమేష్ కుమార్ తదితరులు ఉన్నారు.



అందరికీ ధన్యవాదాలు

పోలమాంబ జాతర సజావుగా ప్రశాంతంగా జరిగినందుకు సహకరించిన అన్ని శాఖల అధికారులకు దేవాదాయశాఖ ఇఒ వివి సూర్యనారాయణ ధన్యవాదాలు తెలిపారు. జిల్లాస్థాయిలో అన్ని శాఖల అధికారుల నుంచి మండల సచివాలయ అధికారులకు, పారిశుధ్య కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర జాతరగా..

రాష్ట్ర జాతరగా అవతరించిన పోలమాంబ అమ్మవారికి ప్రభుత్వం తరఫున రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి పీడిక రాజన్నదొర పట్టు వస్త్రాలు సమర్పించారు. అంతకుముందు రాజన్నదొరకు పూర్ణకుంభంతో పూలమాల వేసే దేవాదాయశాఖ అధికారులు స్వాగతం పలికారు. మేళతాళాల నడుమ డిప్యూటీ సిఎం రాజన్నదొర అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమ్మక్క, సారక్క జాతర తరువాత రాష్ట్ర జాతరగా తొలిసారి అవకాశం లభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తొలిసారి అమ్మవారికి ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనందంగా ఉందన్నారు.

బిసిసిఐ అవార్డుల ప్రదానోత్సవం

సందడి చేసిన టీమిండియా ఆటగాళ్లు

హైదరాబాద్: భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు (బిసిసిఐ) వార్షిక అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం హైదరాబాద్‌లో కన్నుల పండువగా సాగింది. ఈ కార్యక్రమంలో టీమిండియా ఆటగాళ్లు సందడి చేశారు. నాలుగేళ్ల తర్వాత జరుగుతున్న ఈ కార్యక్రమానికి టీమిండియా ఆటగాళ్లతో పలువురు భారత మాజీ క్రికెటర్లూ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భారత పురుష క్రికెటర్లతో పాటు మహిళా క్రికెటర్లు, యువ క్రికెటర్లు కూడా పాల్గొన్నారు. గత నాలుగేళ్ల కాలంలో వివిధ విభాగాల్లో సత్తా చాటిన వారికి బిసిసిఐ ఈ సందర్భంగా అవార్డు లను అందజేశారు. అలాగే పలువురు మాజీ క్రికెటర్లకు కూడా ప్రతిష్టాత్మక అవార్డులు దక్కాయి.

అవార్డు విజేతలు వీరే..

రవిశాస్త్రి: కల్నల్ సీకే నాయుడు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

ఫారూక్ ఇంజనీర్: కల్నల్ సీకే నాయుడు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు (2019-20)

శుభ్‌మన్ గిల్: పాలీ ఉమ్రిగర్ ఉత్తమ అంతర్జాతీయ ఆటగాడు (2022-23)

జస్ప్రీత్ బుమ్రా: పాలీ ఉమ్రిగర్ ఉత్తమ అంతర్జాతీయ ఆటగాడు (2021-22)

రవిచంద్రన్ అశ్విన్: పాలీ ఉమ్రిగర్ ఉత్తమ అంతర్జాతీయ ఆటగాడు (2020-21)

మహ్మద్ షమీ: పాలీ ఉమ్రిగర్ ఉత్తమ అంతర్జాతీయ ఆటగాడు (2019-20)

స్మృతి మంధాన: ఉత్తమ అంతర్జాతీయ మహిళా క్రికెటర్ (2020-21, 2021-22)

దీప్తి శర్మ: ఉత్తమ అంతర్జాతీయ మహిళా క్రికెటర్ (2019-20, 2022-23)

అంతర్జాతీయ క్రికెట్‌లో ఉత్తమ అరంగేట్రం(పురుషులు)..
2019-20: మయాంక్ అగర్వాల్
2020-21: అక్షర్ పటేల్
2021-22: శ్రేయస్ అయ్యర్
2022-23: యశస్వి జైస్వాల్

మహిళలు..
ప్రియా పూనియా: 2019-20
షఫాలీ వర్మ: 2020-21
సబ్బినేని మేఘన: 2021-22
అమన్‌జోత్ కౌర్: 2022-23

దిలీప్ సర్దేశాయ్ అవార్డులు..
అశ్విన్ (2022-23 భారత్ వర్సెస్ వెస్టిండీస్ సిరీస్‌లో అత్యధిక వికెట్లు)
యశస్వి జైస్వాల్ (2022-23 భారత్ వర్సెస్ వెస్టిండీస్ సిరీస్‌లో అత్యధిక పరుగులు)

వన్డేల్లో అత్యధిక వికెట్లు తీసిన మహిళా క్రికెటర్లు..
పూనమ్ యాదవ్: 2019-20
ఝులన్ గోస్వామి: 2020-21
రాజేశ్వరి గైక్వాడ్: 2021-22
దేవిక వైద్య: 2022-23

వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన మహిళా క్రికెటర్లు..
పూనమ్ రౌత్: 2019-20
మిథాలీ రాజ్: 2020-21
హర్మన్‌ప్రీత్ కౌర్: 2021-22
జెమీమా రోడ్రిగెజ్: 2022-23

దేశవాలీ క్రికెట్‌లో ఉత్తమ అంపైర్లు..
అనంత పద్మనాభన్: 2019-20
వ్రిందా రతి: 2020-21
జయరామన్ మదన్ గోపాల్: 2021-22
రోహన్ పండిట్: 2022-23

దేశవాలీ క్రికెట్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన జట్లు..
ముంబై: 2019-20
మధ్యప్రదేశ్: 2021-22
సౌరాష్ట్ర: 2022-23

లాలా అమర్‌నాథ్ అవార్డు (ఆల్‌రౌండర్ పరిమిత ఓవర్ల క్రికెట్)..
బాబా అపరాజిత్: 2019-20
రిషి ధవన్: 2020-21, 2021-22
రియాన్ పరాగ్: 2022-23

లాలా అమర్‌నాథ్ అవార్డు (ఆల్‌రౌండర్ రంజీల్లో..)
ముర సింగ్: 2019-20
షమ్స్ ములానీ: 2021-22
సరాన్ష్ జైన్: 2022-23

మాధవరావ్ సింధియా అవార్డులు (రంజీల్లో అత్యధిక వికెట్లు)..
జయదేవ్ ఉనద్కట్: 2019-20
షమ్స్ ములానీ: 2021-22
జలజ్ సక్సేనా: 2022-23

మాధవరావ్ సింధియా అవార్డులు (రంజీల్లో అత్యధిక పరుగులు)..
రాహుల్ దలాల్: 2019-20
సర్ఫరాజ్ ఖాన్: 2021-22
మయాంక్ అగర్వాల్: 2022-23

జార్ఖండ్ సిఎంకు మళ్లీ సమన్లు

రాంచీ : మనీ లాండరింగ్ కేసులో జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మరోసారి సమన్లు జారీ చేసింది. స్టేట్‌మెంటును రికార్డు చేసేందుకు వీలుగా ఈ నెల 27-31 తేదీల మధ్య హాజరు కావాలని సూచించింది. రాంచీలోని 7.16 ఎకరాల భూమిపై యాజమాన్యానికి సంబంధించి ఈ కేసు నమోదైంది. సైన్యానికి చెందిన భూమిని చట్టవిరుద్ధంగా విక్రయించారని ఈడీ ఆరోపించింది. ఈ కేసులో ఇప్పటికే 13 మందిని అరెస్ట్ చేశారు. సోరేన్‌ను ఈడీ అధికారులు శనివారం ఆయన నివాసంలో ఏడు గంటల పాటు ప్రశ్నించారు. అంతకుముందు ఈడీ ఏడుసార్లు సమన్లు జారీ చేసినప్పటికీ సోరేన్ స్పందించలేదు. ఎనిమిదో సారి సమన్లు జారీ చేసినప్పుడు మాత్రం విచారణకు హాజరయ్యేందుకు అంగీకరించారు. తన ప్రభుత్వాన్ని కూలదోసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సోరేన్ విమర్శించారు. నోటీసులపై మీడియాతో ఆయన మాట్లాడుతూ 'మీ మద్దతుతో, గిరిజనుల ఆశీర్వాదంతో ఓ ఆదివాసీ వ్యక్తి ముఖ్యమంత్రి అయ్యారు. బిజెపి నాయకులు రాజకీయంగా నన్ను ఏమీ చేయలేరు. అందువల్ల తెరచాటున ఇలాంటివన్నీ చేస్తున్నారు. ఈ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు ఎవరు ప్రయత్నించినా వారికి భంగపాటు తప్పదు' అని హెచ్చరించారు.

కేరళలో 2.7 కోట్ల మంది ఓటర్లు

తిరువనంతపురం : కేరళలో మొత్తం ఓటర్ల సంఖ్య 2,70,99,326కు చేరింది. వీరిలో మహిళా ఓటర్లు 1,39,96,729 మందిగా, పురుషులు 1,31,02,288 మంది ఉన్నారు. రాష్ట్రం మొత్తం మీద ట్రాన్స్‌జెండర్ ఓటర్లు 309 మంది ఉన్నారు. తిరువనంతపురంలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సంజయ్ కౌల్ ఈ వివరాలు వెల్లడించారు. తుది జాబితాలో 6,20,998 మంది చేరారని, మరణాలు, డూప్లికేషన్ వంటి కారణాల ద్వారా 3,75,897 మందిని తొలగించినట్లు తెలిపారు. ఈ జాబితా ప్రకారం కేరళ ఓటర్లలో స్త్రీ, పురుష లింగ నిష్పత్తి 1,068:1000గా ఉంది. విదేశాల్లో ఉన్న ఓటర్ల సంఖ్య 88,223గా ఉండగా, వికలాంగ ఓటర్లు 2,62,213 మంది ఉన్నారు.

రైల్వే సిగ్నల్ సిబ్బందిపై దూసుకెళ్లిన రైలు

- మహారాష్ట్రలో ముగ్గురు మృతి

ముంబయి : సిగ్నలింగ్ వ్యవస్థను బాగు చేస్తున్న పనిలో నిమగ్నమైన ఉద్యోగులపై అదే లైనులో వస్తున్న రైలు దూసుకెళ్లింది. దీంతో వారు అక్కడికక్కడే చనిపోయారు. మహారాష్ట్రలోని పాలగఢ్ జిల్లా సోమవారం రాత్రి ఈ దారుణం చోటుచేసుకుంది. మంగళవారం నాడు రైల్వే అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. వాసైకు సమీపంలో సోమవారం రాత్రి 8:55 గంటల సమయంలో పశ్చిమ రైల్వేకు చెందిన కొందరు సిగ్నల్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఈ సమయంలో చర్చ్‌గేట్ స్టేషన్ వైపు వెళుతున్న ఒక లోకల్ రైలు వీరిపై దూసుకెళ్లింది. దీంతో ముగ్గురు మృతి చెందారు. మృతుల్ని చీఫ్ సిగ్నలింగ్ ఇన్‌స్పెక్టర్ వసుమిత్రా, ఎలక్ట్రికల్ సిగ్నలింగ్ మెయింటైనర్ సోమ్‌నాథ్ ఉత్తమ్ లంబూత్రే, హెల్పర్ సచిన్ వాంఖడేగా గుర్తించారు. ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించామని అధికారులు తెలిపారు. మృతుల కుటుంబాలకు తక్షణ సహాయంగా ఒక్కొక్కరికి రూ.55 వేలు చెల్లించినట్లు చెప్పారు.

అది 'అసంబద్ధం'

- టెస్లా సిఇఒ ఎలన్ మస్క్

న్యూయార్క్ : ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో అత్యధిక జనాభా కలిగిన భారత్‌కు శాశ్వత సభ్యత్వం లేకపోవడం 'అసంబద్ధం' అని టెస్లా సిఇఒ ఎలన్ మస్క్ వ్యాఖ్యానించారు. ఐరాస ప్రస్తుత నిర్మాణం ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశాలకు తగిన విధంగా ప్రాతినిధ్యం వహించడం లేదని మస్క్ విమర్శించారు. 'ఏదో ఒక సమయంలో ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థలను పునర్నించడం అవసరం' అని మస్క్ వ్యాఖ్యానించారు. భద్రతా మండలిలో ఆఫ్రికన్ దేశాల్లో వేటికీ శాశ్వత సభ్యత్వం లేదని ఇటీవల ఐరాస ప్రధానకార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ ట్విట్టర్‌లో పోస్టు చేసిన నేపథ్యంలో దానికి ప్రతిస్పందిస్తూ మస్క్ ఈ వ్యాఖ్యలు చేశారు.

'బాలక్ రామ్'గా అయోధ్య రాముడు

- తొలి రోజు 5 లక్షల మంది సందర్శన

అయోధ్య : అయోధ్యలో ప్రతిష్టించిన రామ్‌లల్లాకు 'బాలక్ రామ్'గా నామకరణం చేశారు. ఈ విషయాన్ని ట్రస్ట్ పూజారి అరుణ్ దీక్షిత్ మంగళవారం వెల్లడించారు. రామచంద్రమూర్తి ఐదేళ్ల పసిబాలుడిగా కనిపిస్తున్నందున 'బాలక్ రామ్'గా పేరు నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఈ మందిరాన్ని కూడా 'బాలక్ రామ్ మందిరం'గా పిలుస్తామని తెలిపారు. కాగా సాధారణ ప్రజానీకాన్ని అయోధ్య మందిరంలోకి మంగళవారం నుంచి అనుమతించారు. తొలిరోజు సుమారు 5 లక్షల మంది అయోధ్య రామాలయాన్ని సందర్శించుకున్నారు. ఉదయం 3 గంటల నుంచే ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. మధ్యాహ్నానికి సుమారు 3 లక్షల మంది దర్శించుకున్నట్లు అంచనా. మొత్తం మీద తొలి రోజు 5 లక్షల మంది సందర్శించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. యాత్రికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని 8000 మంది పోలీసులతో భద్రత చేశారు.

రాహుల్ యాత్రకు అడుగడుగునా అడ్డంకులే

- అసోంలో జోడో న్యాయ్ యాత్రకు బిజెపి అవరోధాలు
- పోలీసులతో ఘర్షణకు దిగిన కాంగ్రెస్ కార్యకర్తలు
- కాంగ్రెస్ నేతపై కేసు నమోదుకు హిమంత బిశ్వ శర్మ ఆదేశం



గౌహతి : అసోంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న భారత్ జోడో న్యాయ్ యాత్రకు అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయి. యాత్రను అడ్డుకునేందుకు రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వం చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేస్తోంది. అసోంలో గురువారం యాత్ర ప్రవేశించినప్పటి నుంచి బిజెపి కుటిల యత్నాలు చేస్తూనే ఉన్నదని కాంగ్రెస్ ఆరోపించింది. తాజాగా రాహుల్ ఐదు వేల మంది కార్యకర్తలతో కలిసి మంగళవారం గౌహతిలో ప్రవేశించేందుకు ప్రయత్నించారు. అయితే వీరిని పోలీసులు అడ్డుకోవడంతో ఘర్షణ జరిగింది. పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను ఛేదించి కాంగ్రెస్ కార్యకర్తలు ముందుకు కదిలారు. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జి చేశారు. అంతకుముందు గౌహతి సరిహద్దు వద్ద కార్యకర్తలను ఉద్దేశించి రాహుల్ ప్రసంగిస్తూ తాము నిబంధనలను ఎక్కడా ఉల్లంఘించలేదని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించలేదని చెప్పారు. అంటే దీనర్థం తాము బలహీనులమని కాదని అన్నారు. 'అసోం ముఖ్యమంత్రి, కేంద్ర హోం మంత్రి, ప్రధాని నిబంధనలను ఉల్లంఘించవచ్చు. కానీ మేం అలాంటి పని ఎన్నడూ చేయం' అని వ్యంగ్యంగా అన్నారు. విద్యార్థులను కలవకుండా తనను అడ్డుకోవాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అసోం ముఖ్యమంత్రిని ఆదేశించారని ఆరోపించారు. రాహుల్ ఇక్కడికి వస్తాడా లేదా అన్నది ముఖ్యం కాదనీ, తాము ఎవరి మాటలైతే వినాలని విద్యార్థులు కోరుకుంటున్నారో అందుకు అనుమతించడమే ముఖ్యమని అన్నారు. అయితే అసోం పాఠశాలలు, కళాశాలల్లో ఇది జరగడం లేదని చెప్పారు. అంతకుముందు గౌహతి రహదారుల మీదుగా యాత్రను కొనసాగించేందుకు హిమంత బిశ్వ శర్మ ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. పనిదినాన యాత్రను అనుమతిస్తే ట్రాఫిక్‌కు ఇబ్బంది ఏర్పడుతుందని తెలిపింది. దీనిపై రాహుల్ మండిపడుతూ 'ఇదే రోడ్డుపై భజరంగ్‌దళ్ నడిచింది. బిజెపి అధ్యక్షుడు నడ్డా ర్యాలీ నిర్వహించారు. కానీ నా యాత్రను మాత్రం బారికేడ్లతో అడ్డుకుంటున్నారు' అని అన్నారు.

ప్రజలను రెచ్చగొట్టారని..రాహుల్‌పై కేసు

మరోవైపు ప్రజలను రెచ్చగొట్టినందుకు రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయాలని అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ రాష్ట్ర పోలీసులను ఆదేశించారు. రెచ్చగొట్టే చర్యలు అస్సామీ సంస్కృతిలో భాగం కాదన్నారు. తమది శాంతియుత రాష్ట్రమని, ఇలాంటి 'నక్సలైట్ ఎత్తుగడలు' అసోం సంస్కృతికి పూర్తిగా విరుద్ధమని వ్యాఖ్యానించారు.

రాష్ట్ర అంగన్‌వాడీలకు ఎఐఎఫ్‌ఎడబ్ల్యుహెచ్ అభినందనలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అంగన్‌వాడీ యూనియన్ల సంయుక్త వేదిక ఆధ్వర్యంలో 42 రోజులుగా సమ్మె చేసి విజయం సాధించిన అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్లకు ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ (ఎఐఎఫ్ఎడబ్ల్యుహెచ్) అభినందనలు తెలిపింది. ఈ మేరకు మంగళవారం ఎఐఎఫ్‌ఎడబ్ల్యుహెచ్ ప్రధాన కార్యదర్శి ఎఆర్ సింధు ప్రకటన విడుదల చేశారు. '42 రోజుల పాటు కొనసాగిన నిరవధిక సమ్మె, 18 రోజుల పాటు ఎస్మాను ధిక్కరించి ఉద్యమించారు. సోమవారం చలో విజయవాడలో సుమారు 8 వేల మంది అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లను సామూహికంగా అరెస్టులు చేశారు. అయినప్పటికీ వెనక్కి తగ్గకుండా అర్ధరాత్రి వరకు ఎపి ప్రభుత్వాన్ని నిలదీశారు. దీంతో దిగొచ్చిన ప్రభుత్వం, అంగన్‌వాడీ యూనియన్లతో చర్చలు జరిపింది. వారి డిమాండ్లన్నింటికీ అంగీకరిస్తూ యూనియన్లతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది' అని తెలిపారు. 'దేశంలోనే తొలిసారిగా అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ఎస్మాను ధిక్కరించి పోరాటం చేయడం, యూనియన్లతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకునేలా చేయడం ఇదే తొలిసారి' అని అన్నారు. సమ్మెకు సంఘీభావంగా వచ్చిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

'కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్ర స్థాయిలో పోరాటాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని దేశవ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు ఎఐఎఫ్‌ఎడబ్ల్యుహెచ్ పిలుపునిచ్చింది. జనవరి 23-30 తేదీల్లో మోడీ ప్రభుత్వ చివరి బడ్జెట్‌కు ముందు ప్రతి పార్లమెంటరీ నియోజకవర్గంలో భారీ ప్రదర్శనలు నిర్వహించి, పార్లమెంటు సభ్యులకు వినతులు అందజేయాలని స్కీమ్ వర్కర్లందరికీ మేము పిలుపునిస్తున్నాము' అని అన్నారు.

కేంద్రంపై నిరసిద్దాం రండి !

- తమిళనాడు సిఎంను ఆహ్వానించిన కేరళ



తిరువనంతపురం : రాష్ట్రాల పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని వ్యతిరేకిస్తూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో భాగస్వామ్యం కావాల్సిందిగా తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్‌ను కేరళ ప్రభుత్వం ఆహ్వానించింది. ఈ మేరకు కేరళ న్యాయశాఖ మంత్రి పి రాజీవ్ నేతృత్వంలోని బృందం సోమవారం నాడు చెన్నయ్ వెళ్లి స్టాలిన్‌తో సమావేశమయ్యారు. ఫిబ్రవరి 8న న్యూఢిల్లీలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, మంత్రులతో కలిసి నిరసన చేపట్టనున్న సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో పాల్గొని రాష్ట్రాల గళాన్ని కేంద్రానికి వినిపించాల్సిందిగా స్టాలిన్‌ను ముఖ్యమంత్రి పినరయి విజయన్ పక్షాన రాజీవ్ బృందం కోరింది. అలాగే కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో కేరళ దాఖలు చేసిన పిటీషన్ విషయంపైనా స్టాలిన్‌కు రాజీవ్ వివరించారు. కేంద్రం విధించిన ఆర్థిక ఆంక్షలను వ్యతిరేకించాల్సిన అవసరముందని, కేంద్రం తీరును నిరసించాల్సిన అవసరముందని ఈ సందర్భంగా స్టాలిన్ పేర్కొన్నారు.

700 రోజులుగా చిత్ర హింసలకు గురిచేసినా..

వెన్ను చూపని ధీరులు

- ఆ ఇద్దరు కమ్యూనిస్టు సోదరులు



కీవ్: ఉక్రెయిన్‌లో అమెరికాకు తొత్తుగా వ్యవహరిస్తున్న జెలెన్స్కీ ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించినా, కమ్యూనిస్టులను వెంటాడి వేధిస్తున్నా , భద్రతాదళాలు కిడ్నాపు చేసి జైల్లో చిత్ర హింసలకు గురి చేస్తున్నా వారు అదర లేదు, బెదరలేదు. ప్రభుత్వ విధానాలపై బిగించిన పిడికిళ్లు కొంచెం కూడా సడలలేదు. 700 రోజులుగా భద్రతా దళాల చేతిలో చిత్రహింసలకు గురవుతున్నా తొణుకు బెణుకు లేకుండా నిర్భయంగా ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా తమ గళాన్ని వినిపిస్తున్న ఇ ఇద్దరు సోదరులు ఎవరో కాదు. వారే మిఖాయిల్, అలెగ్జాండర్. ఉక్రెయిన్ కమ్యూనిస్టు పార్టీ యువజన విభాగం నాయకులుగా ఉన్న వీరిని 2022 మార్చి6న ఉక్రెయిన్ భద్రతా దళాలు కిడ్నాపు చేసి జైలులో నిర్బంధించాయి. వారు చేసిన నేరం ఏమిటంటే నాటో ద్వారా యూరప్‌లో అమెరికన్ సామ్రాజ్యవాద సైనిక విస్తరణను ఆపాలంటూ కీవ్‌లోని అమెరికన్ ఎంబసీ ఎదుట ప్రదర్శన నిర్వహించడం. జెలెన్స్కీ ప్రభుత్వ ప్రైవేటీకరణ , ఇతర ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించడం. కమ్యూనిస్టు సోదరుల ధిక్కార ధోరణిని చూసి జెలెన్స్కీ ప్రభుత్వం బెంబేలెత్తింది. ఇందుకుగాను వీరిని జీవితాంతం జైలులో ఉండేలా చేసేందుకు రకరకాల సెక్షన్ల కింద తప్పుడు కేసులు బనాయించింది. వీరి తరపు న్యాయవాదిని కూడా ఉక్రెయిన్ అధికారులే నియమించారు. తిమ్మిని బమ్మిని చేసి ఈ కేసుల్లో దోషులుగా వారిని నిర్ధారిస్తే, పదేళ్లు లేదా యావజ్జీవ కారాగార శిక్ష పడుతుంది. 2014-2015 మధ్య తూర్పు ఉక్రెయిన్‌లోని డానెట్స్క్, లుగానెస్క్ ప్రాంతాల్లో తలెత్తిన అంతర్యుద్ధాన్ని ఫెడరల్ చట్ర పరిధిలో పరిష్కరించుకోవాలని, వాటికి స్వయం ప్రతిపత్తి (అటానమీ) కల్పించాలని కోరినందుకు ఉక్రెయిన్ కమ్యూనిస్టు పార్టీపై జెలెన్స్కీ ప్రభుత్వం నిషేధం విధించి ఏ ఎన్నికల్లోనూ పాల్గొనకుండా చేసింది. 2014లో కుదిరిన మిన్స్క్ ఒప్పందానికి కట్టుబడి ఉండేందుకు జెలెన్స్కీ ప్రభుత్వం తిరస్కరించింది. దీనిని ప్రశ్నించిన కమ్యూనిస్టులపై అమెరికా అండతో తీవ్ర అణచివేత చర్యలకు పాల్పడుతోంది.

ఇజ్రాయిల్‌కు గట్టి ఎదురుదెబ్బ

- హమాస్ దాడిలో 24 మంది సైనికులు మృతి

జెరూసలేం : యుద్ధోన్మాదంతో ఊగిపోతున్న ఇజ్రాయిల్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. హమాస్‌పై దాడి పేరుతో అమాయకులైన పాలస్తీనియన్లపై మారణకాండ సాగిస్తోంది. పసికందులను, చిన్నారులను పెద్ద సంఖ్యలో ఉన్మాద దాడులతో పొట్టన పెట్టుకుంది. ఇజ్రాయిల్ సాగిస్తున్న అమానవీయ దాడులను తిప్పికొట్టే క్రమంలో హమస్ సాయుధులు కూడా ప్రతిదాడులతో విరుచుకుపడుతున్నారు. తాజాగా హమాస్ సాయుధులు ఆర్‌పిజి లాంచర్‌ను ప్రయోగించడంతో 24 మంది సైనికులు మరణించినట్లు ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. సెంట్రల్ గాజాలో రెండు భవనాలను కూల్చేందుకు సోమవారం ఇజ్రాయిల్ సైనికులు పేలుడు పదార్థాలను అమర్చుతుండగా.. సమీపంలోని ట్యాంక్‌పైకి హమాస్ గ్రనేడ్‌ను ప్రయోగించింది. దాని ధాటికి మందుగుండు పేలిపోయింది. ఆ భవనాలు సైనికులపై కుప్పకూలాయి. యుద్ధం మొదలైన తర్వాత ఈ స్థాయిలో ఇజ్రాయిల్ సైన్యానికి ప్రాణనష్టం సంభవించడం ఇదే తొలిసారి.

వ్యక్తులను కట్టేసి, కొట్టే అధికారం పోలీసులకుందా ?

(మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. కోర్టును ధిక్కరించినందుకు తమకు 14 రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ అక్టోబరులో గుజరాత్ హైకోర్టు జారీ చేసిన ఆదేశాలను వ్యతిరేకిస్తూ పోలీసు అధికారులు సుప్రీం కోర్టుకు అప్పీల్ చేసుకున్నారు. వారిపై హైకోర్టులో తీసుకున్న కోర్టు ధిక్కార చర్యల అమలుపై బెంచ్ స్టే విధించింది. పోలీసుల దూషణలు, కస్టడీలోని వారి పట్ల హింసాత్మకంగా వ్యవహరించడమన్నది కోర్టు ధిక్కార చర్యల కిందకు వస్తాయని 1996లో డి.కె.బసు తీర్పులో సుప్రీం పేర్కొంది. పోలీసులు, చట్టాన్ని అమలు చేసే ఇతర అధికారులు ఒక వ్యక్తిని వేధించి, దూషించడం నుండి రక్షణ కల్పించడానికి సమాజంలో వ్యక్తమవుతున్న తీవ్ర ఆందోళనను ఆ తీర్పు ప్రముఖంగా ప్రస్తావించింది.

పోలీసుల తరపు వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దావె మాట్లాడుతూ, తమ క్లయింట్లు ఉద్దేశ్యపూర్వకంగా కోర్టును ధిక్కరించలేదని చెప్పారు. అయితే వారి వాదనలతో జస్టిస్ గవాయ్, సందీప్ మెహతాలు ఏకీభవించలేదు. చట్టం గురించి తెలియకపోవడమనేది ఇప్పుడు చట్టంలో రక్షణగా మారిందా అని బెంచ్ ప్రశ్నించింది. డి.కె.బసు కేసులో చట్టం ఏం చెప్పిందన్నది ప్రతి పోలీసు అధికారి తెలుసుకోవాలని, అది వారి విధి అని జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు.

జాతి ఉన్మాదానికి వ్యతిరేకంగా

జర్మనీలో భారీ ర్యాలీలు

- మితవాద పార్టీలపై నిషేధం విధించాలని నినదించిన ప్రదర్శకులు



జర్మనీలోని లీప్జిగ్‌లో ఫాసిస్టులకు వ్యతిరేకంగా నిర్వహించిన భారీ ర్యాలీ

లీప్‌జిగ్: మితవాద పార్టీ జాతి ఉన్మాద చర్యలకు నిరసనగా జర్మనీలోని లీప్‌జిగ్‌లో ఇటీవల భారీ ప్రదర్శన నిర్వహించారు. రాజకీయ నాయకులు, మాజీ మంత్రులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు దీనికి మద్దతు తెలిపారు. జర్మనీలోని మిగతా పట్టణాలకు కూడా నిరసనలు వ్యాపించాయి. నియో నాజీలంతా ఒక చోట చేరి దేశం నుంచి వలసవాసులను తరిమేసే విషయమై చర్చించినట్లు వార్తా కథనాలు వెలువడ్డాయి. ఈ నియోనాజీల సమావేశానికి జర్మన్ మితవాద పార్టీ ఎఎఫ్‌డి సభ్యులు కూడా పాల్గొన్నట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. శరణార్థులను సామూహికంగా గెంటివేయడం పై ఈ సమావేశం కేంద్రీకరించినట్లు జర్నలిజం నెట్‌వర్క్ కరెక్టివ్ ఓ కథనాన్ని ప్రచురించింది. ఈ వార్తలు జర్మన్ పౌరులను షాక్‌కు గురి చేశాయి. వలసవాదులను ద్వేషించే మితవాద పార్టీలను నిషేధించాలని వారు నినదించారు. జర్మనీలో యూరోపియనేతరులు, శ్వేతేతరులు గణనీయ సంఖ్యలో ఉన్నారు. అసహనం, జాత్యహంకారాన్ని ఎట్టి పరిస్థితుల్లోను అనుమతించేది లేదని యువకులు వీధుల్లోకి వచ్చి నినదించారు. బెర్లిన్‌లో జరిగిన నిరసనలో సుమారు 100,000 మంది ప్రజలు పాల్గొన్నారు. పశ్చిమ నగరమైన కొలోన్‌లో జరిగిన ప్రదర్శనలో 70,000 మంది ప్రజలు కూడా పాల్గొన్నారు. శుక్రవారం హాంబర్గ్‌లో మరియు శనివారం స్టుట్‌గార్ట్ మరియు నురేమ్‌బెర్గ్‌లో భారీ ప్రదర్శనలు జరిగాయి. గతానికి భిన్నంగా, జర్మనీలోని చిన్న పట్టణాలు కూడా తీవ్రవాద పార్టీలకు వ్యతిరేకంగా పోరాటాలతో బాధపడుతున్నాయి.



కొల్‌కతాలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న సూర్యకాంత మిశ్రా తదితరులు

నేతాజీకి సిపిఎం ఘన నివాళి

కొల్‌కతా : స్వతంత్ర సంగ్రామ యోధుడు, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా సిపిఎం ఘన నివాళులర్పించింది. నేతాజీ స్థాపించిన ఆజాద్ హింద్ ఫౌజ్ ఉద్దేశ్యం 'ఐక్యత, విశ్వాసం, త్యాగం' అని, నేటికి ఇది ఎంతో అవసరమని సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో ఆయన ఈ మేరకు పోస్టు చేశారు. కొల్‌కతాలోని రాజా సుబోధ్ మల్లిక్ కూడలిలో సిపిఎం పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కమిటీ నేతృత్వంతో నేతాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగర వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. లెఫ్ట్‌ఫ్రంట్ ఛైర్మన్ బిమన్ బసు, పొలిట్‌బ్యూరో సభ్యులు సూర్యకాంత మిశ్రా, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సలీం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తమిళనాడు ప్రభుత్వానికి జయలలిత బంగారం, వజ్రాభరణాలు

- బెంగళూరు కోర్టు తీర్పు

బెంగళూరు : తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత నుంచి స్వాధీనం చేసుకున్న విలువైన బంగారు నగలను, వజ్రాభరణాలను ఆ రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని బెంగళూరులోని ప్రత్యేక కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ అభరణాల వినియోగంపై తమిళనాడు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని తెలిపింది. జయలలిత, ఇతరులపై నమోదైన ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో మెటీరియల్ సాక్ష్యాల్లో భాగంగా ఈ అభరణాలను స్వాధీనం చేసుకున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల్లో భాగంగా ఈ కేసును కర్ణాటకలో విచారిస్తున్నారు. అందువలన ఈ అభరణాలన్నీ ప్రస్తుతం కర్ణాటక ట్రెజరీలో ఉన్నాయి. పై తీర్పును అదనపు సిటీ సివిల్ అండ్ సెషన్స్ కోర్టు జడ్జి హెచ్‌ఎ మోహన్ వెలవరించారు. కాగా, ఈ అభరణాలను దక్కించుకోవడానికి జయలలిత బంధువులు అర్హులు కాదని కోర్టు గతంలోనే తీర్పు ఇచ్చింది. జయలలిత మేనకోడలు, మేనల్లుడు జె దీప, జె దీపక్ వేసిన పిటీషన్‌ను కోర్టు తిరస్కరించింది. ఆభరణాలను తమిళనాడు ప్రభుత్వానికి బదిలీ చేయాలని ఇచ్చిన తీర్పులో.. 'నగలను వేలం వేయడానికి బదులుగా తమిళనాడు హోం శాఖకు అప్పగించడం ద్వారా తమిళనాడు ప్రభుత్వానికి బదిలీ చేయడం మంచిది' అని జడ్జి పేర్కొన్నారు. అలాగే, ఈ కేసును కర్ణాటక రాష్ట్రంలో విచారించిన కారణంగా విచారణ ఖర్చుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి రూ.5 కోట్లు చెల్లించాలని కూడా ప్రత్యేక కోర్టు తీర్పు ఇచ్చింది. చెన్నైలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో జయలలితకు సంబంధించిన ఖాతాలో ఉన్న ఫిక్స్‌డ్ డిపాజిట్ నుంచి ఈ చెల్లింపులు జరపాలని పేర్కొంది. జయలలిత, ఆమె సన్నిహితురాలు శశికళ, జయలలిత పెంపుడు కుమారుడు సుధాకరన్, శశికళ కోడలు జె.ఇళవరసిపై నమోదైన ఆదాయానికి మించిన ఆస్తుల కేసును బెంగళూరులోని ప్రత్యేక కోర్టు విచారించింది.

పచ్చి మితవాద పార్టీ ఎన్‌పిడికి నిధులు కట్

- జర్మనీ కోర్టు రూలింగ్


కార్ల్‌స్రుహె (జర్మనీ) : పచ్చి మితవాద పార్టీ అయిన నేషనల్ డెమోక్రటిక్ పార్టీ (ఎన్‌పిడి)కి ఇకపై ప్రభుత్వ నిధులు అందవని జర్మనీ కోర్టు తీర్పు చెప్పింది. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీయడానికి లేదా మొత్తంగా నిర్మూలించడానికి ఎన్‌పిడి, ఆ పార్టీ అధ్యక్షుడు డై హీమట్ లక్ష్యంగా చేసుకున్నారంటూ న్యాయస్థానం ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. రాడికల్ పార్టీలకు ప్రభుత్వ నిధులు అందకుండా నివారించేలా జర్మనీ చట్టంలో మార్పులు తీసుకువచ్చిన తర్వాత ఎన్‌పిడికి ప్రభుత్వ నిధులు అందకుండా కోత విధించాలంటూ జర్మనీ పార్లమెంట్, ప్రభుత్వం 2019లో కోర్టును ఆశ్రయించాయి. ఈ నేపథ్యంలో పచ్చి మితవాద ఎన్‌పిడి పార్టీకి ప్రభుత్వ నిధుల్లో జర్మనీ కోత విధించవచ్చని రాజ్యాంగ కోర్టు మంగళవారం పేర్కొంది. దీంతో జాతీయవాద ఆల్టర్‌నేటివ్ ఫర్ జర్మనీ (ఎఎఫ్‌డి) పార్టీకి కూడా శిక్ష విధిస్తారా లేదా అనే చర్చకు ఈ రూలింగ్ ఆజ్యం పోసింది. ఎన్‌పిడి, అడాల్ఫ్ హిట్లర్ నాజీ పార్టీని పోలి వుందంటూ 2017లోనే కోర్టు పేర్కొంది. అయితే ప్రజాస్వామ్యానికి ముప్పుగా పరిణమించేంత బలంగా లేదని అందువల్ల నిషేధించరాదని నిర్ణయించింది. ప్రధాన స్రవంతిలోని రాజకీయ నేతల మధ్య పోరు కావడంతో ఈ రూలింగ్‌ను అందరూ నిశితంగా పరిశీలిస్తున్నారు. తాజాగా కోర్టు తీర్పుతో ప్రజాస్వామ్య వ్యతిరేక శక్తులకు ప్రభుత్వ నిధులు అందవని ఒక సంకేతం పంపినట్లైందని హోం మంత్రి నాన్సీ ఫాజర్ వ్యాఖ్యానించారు.

యెమెన్‌పై మళ్ళీ అమెరికా, బ్రిటన్ దాడులు

వాషింగ్టన్ : యెమెన్‌లో మరోమారు అమెరికా, బ్రిటన్ సైన్యాలు దాడులకు తెగబడ్డాయి. హౌతీ తిరుగుబాటుదారులను లక్ష్యంగా చేసుకొని సోమవారం దాడులు జరిపినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ తెలిపింది. రెండో రౌండ్‌లో భాగంగా మానవ సహిత విమానాలు, నౌకలతో ఈ దాడులు జరిగాయని పేర్కొంది. ఈ రెండు దేశాలు ఈ నెల 11న దాడులకు పాల్పడిన సంగతి విదితమే. తాజా దాడులకు ఆస్ట్రేలియా, బహ్రెయిన్, కెనడా, నెదర్లాండ్స్ కూడా మద్దతు తెలిపాయి. హౌతి రెబెల్స్ క్షిపణి వ్యవస్థలు, లాంచర్లు, వైమానిక రక్షణ వ్యవస్థలు, రాడార్లు, ఆయుధ నిల్వల కేంద్రాలను లక్ష్యించి ఈ దాడులకు పాల్పడినట్లు అమెరికా తెలిపింది.

కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న

(మొదటి పేజీ తరువాయి)



చేసిన కృషి అనంతర కాలంలో అంటే 1990ల్లో ఇతర వెనుబడిన తరగతులు (ఒబిసి)కు రిజర్వేషన్లు ఇచ్చేందుకు మండల్ కమిషన్ సిఫార్సుల అమలుకు దోహదపడ్డాయి.క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో ఆయన జైలు శిక్ష అనుభవించారు. 1952 ఎన్నికల్లో తొలిసారిగా విజయం సాధించిన తర్వాత ఆయన ఏ ఎన్నికల్లోనూ ఎన్నడూ ఓడిపోలేదు. అత్యంత ప్రజాదరణ పొందిన ఆయన నిరాడంబర జీవితం, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటాలే ఇందుకు కారణం. రాష్ట్రానికి చెందిన మొదటి కాంగ్రేస్సేతర ముఖ్యమంత్రికి ఈ అవార్డును అందచేయడంతో బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, జనతాదళ్ యునైటెడ్ పార్టీ దీర్ఘకాల డిమాండ్ నెరవేరినట్లైంది. భారతదేశంలో సామాజిక న్యాయానికి, సాధికారతకు పర్యాయపదంగా భావించే ఠాకూర్ ముఖ్యమంత్రిగా వున్న సమయంలోనే 1977లో ముంగేరీ లాల్ కమిషన్ నివేదిక వచ్చింది. వెనుకబడిన వర్గాలను అత్యంత వెనుకబడిన వర్గాలుగా, వెనుకబడిన వర్గాలుగా తిరిగి వర్గీకరించాలని ఈ కమిషన్ నివేదిక సిఫార్సు చేసింది. 1978లోనే ఈ నివేదికను అమలు చేశారు. బీహార్‌లో వెనుకబడిన వర్గాల రాజకీయాలు పరిఢవిల్లడానికి థాకూర్ విధానాలు, ఆయన తీసుకున్న చొరవలు చూపించిన ప్రభావమే ప్రధాన కారణం.

ప్రధాని హర్షం

సామాజిక న్యాయానికి కరదీపిక, గ్రేట్ జన నాయక్ కర్పూరీ ఠాకూర్ జీకి భారత రత్న ప్రదానం చేయాలని భారత ప్రభుత్వం నిర్ణయించడం పట్ల చాలా ఆనందంగా వున్నట్లు ప్రధాని నరేంద్ర మోడీ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. అదికూడా ఆయన శత జయంతి సమయంలో కావడం ఇంకా సంతోషంగా వుందన్నారు. సమానత్వం, సాధికారతకు నిలువెత్తు ప్రతీకగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషికి ఈ ప్రతిష్టాకరమైన అవార్డు ఒక నిదర్శనమని వ్యాఖ్యానించారు.

సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతి పట్ల ఆయనకు గల అచంచలమైన నిబద్ధత, దార్శనికతతో కూడిన ఆయన నాయకత్వం భారతదేశ సామాజిక, రాజకీయ కూర్పుపై చెరగని ముద్ర వేశాయని మోడీ ప్రశంసించారు. ఈ అవార్డు, కలకాలం గుర్తుండిపోయేలా ఆయన చేసిన సేవలను గౌరవించుకోవడమే కాకుండా మరింత న్యాయమైన, సమానమైన సమాజం సృష్టించాలన్న తన దీక్షను కొనసాగించడానికి స్ఫూర్తిని కూడా కలిగిస్తోందని మోడీ పేర్కొన్నారు.



మీ కోసం

పసుపు, కారం, కరివేపాకు పొడిలాంటివి నిల్వ చేసేటప్పుడు చిటికెడు ఇంగువ కలిపి పేపరు కవర్లలో భద్రం చేస్తే ఏడాదిపాటు నిల్వ ఉంటాయి.

జీవన సౌరభం

ఓడిపోతున్నా అని తెలిసిన క్షణంలో కూడా పోరాడేవాడే నిజమైన ధైర్యవంతుడు.

కూరగాయల తోట




రాయలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణేష్ ఆరవ తరగతి చదువుతున్నాడు. చాలా చురుకైన విద్యార్థి. చదువుతో పాటు పాఠశాలకు సంబంధించిన తోట సంరక్షణ కూడా బాగా నిర్వహించేవాడు. చెట్లను అందంగా కత్తిరించడం, పూల మొక్కలకు పాదులు తవ్వడం, కొత్త మొక్కలు నాటడం, పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచడం వంటి పనులన్నీ తానే చూసుకునేవాడు.


ఒకసారి గణేష్ స్కూలుకు వస్తుండగా రోడ్డు మీద ఓ కుళాయి దగ్గర నీళ్లన్నీ వథాగా పోతున్నాయి. కుళాయి పాడై ఆ నీళ్లు అలా ప్రవహిస్తున్నాయని గణేష్ గ్రహించాడు. ఆ నీళ్లు కాలువలా పాఠశాలను ఆనుకొని ప్రవహిస్తున్నాయి. అది చూసిన గణేష్‌కి మెరుపులాంటి ఆలోచన వచ్చింది. తన స్నేహితుల సహకారంతో ఆ కాలువ నీళ్లన్నీ పాఠశాల తోటలోకి పారేటట్లు చేశాడు. నీళు నిరంతరం ప్రవహిస్తున్నాయి కాబట్టి పిల్లలందరూ ఓ నీటి గుంటను ఏర్పాటు చేశారు. నీళ్లు పుష్కలంగా ఉండడంతో తోటలో అదనంగా కొన్ని మడులను చదును చేసి రకరకాల కూరగాయల విత్తనాలు, ఆకు కూరల విత్తనాలను చల్లారు. వారం పది రోజుల్లో అవి చక్కగా మొలకెత్తాయి. గణేష్ సంతోషానికి అవధులు లేకుండా పోయింది. ఉపాధ్యాయులు గణేష్ తెలివికి మెచ్చుకున్నారు. ఆ రోజు నుండి మధ్యాహ్న భోజన పథకానికి ఆ తోటలోని కూరగాయాలనే ఉపయోగిస్తున్నారని స్కూల్ ప్రిన్సిపాల్ తెలుసుకున్నారు. వయసులో చిన్నవాడైనా గణేష్ చేసిన మంచి పనిని మెచ్చుకుని, అందరికీ తెలిసేలా చేశారు. తల్లిదండ్రుల సమావేశం పెట్టి నీటి వృథాను అరికట్టి, మొక్కలను ఎలా సంరక్షించవచ్చో గణేష్‌తో చెప్పించారు. కార్యక్రమానికి వచ్చిన వారందరూ గణేష్‌ని ఎంతగానో అభినందించారు.

– యాదవరం చంద్రకాంత్ గౌడ్, సిద్ధిపేట, 94417 62105.

ఖాళీలు పూరించండి

పిల్లలూ, బొమ్మలకు ఇచ్చిన అంకెల ప్రకారం గళ్లల్లో ఆంగ్లంలో వాటి పేర్లను రాయండి. 8వ బొమ్మ పేరు మీరు రాయకుండానే కనిపిస్తుంది. తమాషా చూడండి.





నేను గీసిన బొమ్మ





బి. వైనవి,
8వ తరగతి,
కేంద్రీయ విద్యాలయ నెం 1,
శ్రీ విజయ్ నగర్,
విశాఖపట్నం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

గొప్ప మానవతావాది
డాక్టర్ సిరిపురపు జ్యోతి



కమ్యూనిస్టు నాయకులు నాగళ్ల జానకీరామయ్య, రాజేశ్వరమ్మల గారాలపట్టి డాక్టర్ సిరిపురపు జ్యోతి గొప్ప మానవతావాది. మత్తు డాక్టర్ (ఎనస్తీషియా)గా సుపరిచితురాలైన ఆమె గురించి, ఆమె సేవల గురించి ఉయ్యూరు ప్రాంతంలో చాలామందికి తెలుసు. తల్లి నుంచి కమ్యూనిస్టు భావాలను అంది పుచ్చుకున్న ఆమెలో నరనరాన ఉన్నది అభ్యుదయమే! సమ సమాజాన్ని కోరుకున్న ఆమె తన వంతుగా పేదరికాన్ని రూపుమాపే కృషిలో భాగంగా అనేక సేవలు అందించారు. సామాన్యులకు అనేక విధాలుగా సహాయపడ్డారు. తన తల్లిదండ్రులు నాగళ్ల జానకిరామయ్య, నాగళ్ల రాజేశ్వరమ్మ పేరున ఉన్న ట్రస్టు ద్వారా తాను మరణించాక కూడా సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. వృత్తిలోనూ, ప్రవృత్తిగానూ మానవతావాదిగా మెలగిన డాక్టర్ జ్యోతి బుధవారం కృష్ణా జిల్లా ఉయ్యూరులోని కాటూరులో తుదిశ్వాస విడిచారు.

సిరిపురపు జ్యోతి (83) గురించి తెలుసుకునేముందు ఆమె తల్లి నాగళ్ల రాజేశ్వరమ్మ గురించి ప్రస్తావించటం ఎంతైనా సందర్భోచితం. మహిళా ఉద్యమనేతగా, కమ్యూనిస్టు నాయకు రాలిగా ఆమె ఎంతో ఉద్యమస్ఫూర్తితో పనిచేసే వారు. మృదు స్వభావి అయిన భర్త నాగళ్ల జానకి రామయ్య కూడా ఆమెకు బాగా సహకరించేవారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలోనూ, తెలంగాణా సాయుధ పోరాటకాలంలో భయంకరమైన నిఘా ఉన్న సమయంలో వీరి ఇల్లు కమ్యూనిస్టులకు రహస్య స్థావరంగా ఉండేది. ఉయ్యూరు మండలం కాటూరు గ్రామం కమ్యూనిస్టు ఉద్యమ కేంద్రంగా ఉండేది. జ్యోతిని చూసుకోవటానికి నాన్న తప్ప ఇంకా ఎవ్వరూ ఉండేవారు కాదు. కుటుంబ సభ్యులు కొంతమేరకు సహకరించేవారు. మిగతా అందరూ ఉద్యమ సంబంధికులే వారి బంధుమిత్రులు. వసతి గృహంలో ఉంటూనే జ్యోతి తన ఉన్నత విద్యాభ్యాసం, ఆ తర్వాత విశాఖలో ఎంబిబిఎస్ పూర్తి చేశారు. వారి ఇల్లు ప్రజా ఉద్యమకారుల రాకపోకలతో సందడిగా ఉండేది.

ప్రేమవివాహం

వైద్య విద్యను అభ్యసిస్తున్న సమయం లోనే జ్యోతి, జగత్ ప్రేమించుకుని 1965 లో కులాంతర ప్రేమవివాహం చేసుకున్నారు. ఆ తర్వాత వారు నెల్లూరు ప్రజా వైద్యశాలలో కొంతకాలం పనిచేశారు. 1967లో డాక్టర్ జగత్ అత్యంత సాహసోపేతంగా ఒక సర్జరీ చేశారు. ఆ సమయంలో జరిగిన పొరపాటు వల్ల ఆయనకు అంటువ్యాధి సోకి, చివరకు ప్రాణాలు కోల్పోయారు. ఆ సంఘటనతో జ్యోతి, ఆమె కుటుంబం తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఆ తర్వాత 1977లో డాక్టర్ ప్రసాద్‌ను జ్యోతి వివాహం చేసుకున్నారు. తర్వాత అమెరికా, ఇంగ్లాండ్, దుబాయ్‌లలో వైద్యరాలుగా పనిచేశారు. కొన్నాళ్ల తర్వాత హైదరాబాద్‌లోనూ ప్రాక్టీస్ కొనసాగించారు. తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉండటంతో ఉయ్యూరుకు ప్రాక్టీస్‌ను మార్చారు. తల్లిదండ్రుల ఆశయ సాధనను కొనసాగిస్తూ ఎందరికో వైద్య సేవలు అందించారు.

ఆదర్శాల బాటలో ...

కృష్ణా జిల్లాలో మహిళా ఉద్యమ నిర్మాతలు మానికొండ సూర్యావతి, నాగళ్ల రాజేశ్వరమ్మ. రాజేశ్వరమ్మ సనాతన, ధనిక కుటుంబంలో పుట్టినా 1930 కాలం నాటి అనేక కట్టుబాట్లను తెంచుకుని, సామాజిక స్ఫూర్తితో కుటుంబానికి సైతం దూరంగా ఉండి మహిళా చైతన్యం కోసం పనిచేశారు. 1936లో పితృస్వామ్య భావజాలాల పట్ల కొనసాగుతున్న వివక్ష పూరిత ధోరణులు, ఘోషా పద్ధతి, సనాతన ఆచారాలు, అవిద్య, బాల్యవివాహాలు, కన్యాశుల్కం వంటివి సమాజంలో పాతుకుపోయిన దుస్సంప్రదా యాలు. వాటికి వ్యతిరేకంగా రాజేశ్వరమ్మ పనిచేశారు. మహిళలను చైతన్యపరిచారు.

అప్పట్లో రచ్చబండలపై కూర్చున్న మగవారి హేళనలు ఒకవైపైతే, ఆడవాళ్ల ఛీత్కారాలు మరోవైపు ఎదురైనా ఆమె నిరుత్సాహపడలేదు. శాంత స్వభావి అయిన భర్త జానకిరామయ్యను కూడా ఊళ్లో పెద్దలు రెచ్చగొట్టేవారు. ఆడవాళ్ళు ఇలా ఊళ్ళవెంట తిరిగితే కుటుంబ ప్రతిష్ట, వంశగౌరవం గంగ పాలవుతూ వుంటే చూస్తూ ఊరుకుంటున్నావనే వారు. అయినా, ఆయన భార్య పక్షానే నిలిచారు. ఆమె చేస్తున్నది సంఘసేవ తప్ప నష్టం కలిగించే పని కాదని అనేవారు. ఇలాంటి ఎన్నో ఘటనలను బాల్యంలో కూతురు జ్యోతికి తల్లి చెప్పేవారు. ఆడపిల్లలు ధైర్యంగా ఉండాలని, నడుస్తున్న బాట మంచిది అయినప్పుడు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని ఉద్బోధించేవారు. జ్యోతి కూడా తన వృత్తిలో, సేవాదృక్పథంలో ఆ అమ్మ బాటనే కొనసాగించారు. జీవితాంతం తోటివారికి తోడ్పాటును అందిస్తూ, వారి అభ్యున్నతి కి సహాయపడుతూ మానవతావాదిగా నిలిచారు.

మానవత్వంతో వైద్య సేవలు

ఉయ్యూరులో ఎనస్తీషియా సేవల కోసం వెళ్లిన పేదల వద్ద నుంచి ఎలాంటి డబ్బులు తీసుకునేవారు కాదు. ఇంకా వారికే ఫండ్లు కొనుక్కోవటానికి డబ్బులు ఇచ్చేవారు. ఇక్కడి నుంచి విజయవాడ, ఉయ్యూరులో ఆసుపత్రికి ఎవరైనా రోగులను పంపించాల్సివస్తే సంబంధిత డాక్టర్లతో ఆమె స్వయంగా మాట్లాడేవారు. కొన్ని సందర్భాల్లో ట్రీట్‌మెంట్‌కు అయిన ఖర్చును తానే భరించేవారు. తన వద్దకు వచ్చే పేద రోగులకు మందులు, ఛార్జీలు సైతం ఇచ్చి పంపించిన సందర్భాలు ఎన్నో!

పేదరికంవల్ల చదువుకునేందుకు ఇబ్బంది పడుతున్నామని ఎవ్వరు వెళ్లినా డాక్టర్ జ్యోతి కాదనకుండా ఆర్థిక సహాయం చేసేవారు. మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించేవారు. వైద్యాన్ని డబ్బు తెచ్చి పెట్టే వృత్తిగా తాను ఎప్పుడూ భావించలేదు. వైద్యపరమైన సలహాలు, సూచనలు మానవతా దృక్పథంతోనే అందించేవారు. తనకు తెలిసిన రోగులకు ఇతర ఆసుపత్రుల్లో వైద్యం జరుగుతున్నప్పుడు డాక్టర్లతో మాట్లాడి, ప్రత్యేక శ్రద్ధ తీసుకునేవారు.

అమ్మానాన్నల ట్రస్టు కోసం ...

ఉయ్యూరులో నాగళ్ల జానకిరామయ్య, తల్లి నాగళ్ల రాజేశ్వరమ్మల పేరిట విజ్ఞాన కేంద్రాన్ని నిర్మించారు. దానికి డాక్టర్ జ్యోతి రూ.30 లక్షలను సమకూర్చారు. కరెంట్, జనరేటర్ వంటి సదుపాయాలూ కల్పించారు. తల్లిదండ్రుల పేరుతో ట్రస్ట్ నడవటానికి అనుగుణంగా కార్పస్ నిధి ఏర్పాటు చేశారు. తల్లి జ్ఞాపకార్థంగా ఏ పని తలపెట్టినా దానికి అవసరమైన నిధిని ఆమె స్వయంగా భరించేవారు. ట్రస్టుకు కేటాయించిన నిధుల ద్వారా పేదలకు, మహిళలకు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆమె ఆకాంక్షించారు.

మనుషులు పుట్టటం గిట్టటం సహజ ప్రక్రియే. ఆ రెండు సంఘటనల మధ్య జీవితాన్ని గడిపే మనిషి తన చుట్టూ ఉన్న సమాజం పట్ల ఎలా ప్రవర్తించారన్నదే ముఖ్యమైనది. అమ్మ రాజేశ్వరమ్మ ఆశయాన్ని, ఆదర్శాన్ని అనుక్షణం పాటించిన ధన్యజీవి డాక్టర్ జ్యోతి. ఆమె ఈ సమాజం గురించి ఆలోచించిన తీరు వల్లా, మనుషుల పట్ల చూసిన ప్రేమ వల్లా ఆమె ఒక మానవతామూర్తి. ఆమె భౌతికంగా దూరమైనా – ఆమె సేవలను, ప్రేమను పొందిన మనుషులు ఎప్పటికీ ఆమెనొక సేవామూర్తిగా గుర్తు పెట్టుకుంటారు. తల్లికి తగ్గ తనయగా జ్ఞప్తి చేసుకుంటారు.

సామాజిక సేవల్లోనూ ...

ఆలయాల వద్ద బిక్షాటన చేసేవారికి అన్నదానం, వస్త్రదానం చేసేవారు. చలికాలంలో దుప్పట్లు వంటివి పంపిణీచేసేవారు. తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉన్నప్పుడు ఇంట్లో పనులు చేయటానికి ఐదుగురు సహాయకులను పెట్టుకున్నారు. వారు చనిపోయిన తర్వాత కూడా వర్కర్ల పట్ల దయార్ధ హృదయంతో వ్యవహరించేవారు. వారి అవసరాలను శ్రద్ధాశక్తులతో బాధ్యతగా తీసుకుని వీలైనంత సహాయాన్ని అందిస్తున్నారు. ఆయా కుటుంబాల్లో పిల్లల చదువులకు సైతం ఆమే ఆర్థిక సహాయం చేస్తున్నారు.

- యడవల్లి శ్రీనివాసరావు

క్యాప్షన్ లేదు.. ఫొటో చాలా మాట్లాడుతుంది..



మహేశ్‌బాబు, రాజమౌళి కాంబినేషన్లో రాబోతున్న 'ఎస్‌–ఎస్‌ఎంబీ–29' నుండి తాజా అప్డేట్ బయటికి వచ్చింది. రాజమౌళి, మహేశ్‌బాబు మిక్స్‌డ్ స్టిల్‌తో.. 'క్యాప్షన్ లేదు.. ఫొటో చాలా మాట్లాడుతుంది.. ప్రీ ప్రొడక్షన్ వర్క్ కొనసాగుతోంది..' అంటూ సోషల్ మీడియాలో ఓ పోస్టర్ బాగా వైరల్ అవుతోంది. ఆఫ్రికన్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్‌గా రాబోతున్న ఈ చిత్రం స్క్రిప్ట్ వర్క్ పూర్తి చేశానని ఇప్పటికే రైటర్ విజయేంద్రప్రసాద్ చెప్పారు. ఈ చిత్రాన్ని 2026 ఉగాది కానుకగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. ఎంఎం కీరవాణి ఇప్పటికే మ్యూజిక్ సిట్టింగ్స్ ప్రారంభించారు. అలాగే 'అమృతం' ఫేం ఎస్‌ఎస్ కంచి ఈ చిత్రానికి వన్ ఆఫ్ ది స్టోరీ రైటర్‌గా వ్యవహరించనున్నారని సమాచారం. అంతర్జాతీయ స్థాయిలో యాక్షన్ డ్రామా నేపథ్యంలో రాబోతున్న ఈ చిత్రంలో పాపులర్ హిందీ యాక్టర్లతోపాటు స్టార్ యాక్టర్లను తీసుకోనున్నారు. రామోజీఫిలిం సిటీలో రూ.100 కోట్ల ఖర్చుతో భారీ సెట్‌లో షూటింగ్ చేయాలని చిత్రబృందం ఆలోచిస్తుందని తెలుస్తోంది. సినిమాలో ఎక్కువభాగం ఈ సెట్‌లోనే షూటింగ్ జరుగనుండగా.. మిగిలిన భాగాన్ని ఆఫ్రికా, యూరప్‌లో ప్లాన్ చేస్తున్నట్టు సమాచారం.




అలాంటి పాత్రలు చేయలేను : తాప్సీ

'డంకీ' చిత్ర విజయంలో ఉన్న తాప్సీ ప్రస్తుతం తన తదుపరి సినిమాల కోసం సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో 'యానిమల్' సినిమా గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. 'ఇతర నటీనటుల వ్యక్తిగత జీవితాల గురించి నేను మాట్లాడను. మనది ప్రజాస్వామ్య దేశం. ఎవరికి నచ్చింది వారు ఎంచుకునే స్వేచ్ఛ ఉంది. నటీనటులందరికి ప్రతిభా పాటవాలతో పాటు కొన్ని బాధ్యతలు ఉంటాయి. వాటిని గౌరవిస్తూ నేను ముందుకు సాగుతాను. వ్యక్తిగతంగా మాత్రం నేను ఆ తరహా కథల్లో నటించలేను' అని చెప్పారు.

'మిస్ పర్ఫెక్ట్' ట్రైలర్ విడుదల

లావణ్య త్రిపాఠీ, అభిజీత్ దుద్దాల, అభిజ్ఞ ఉతలూరు కీలక పాత్రలు పోషించిన 'మిస్ పర్ఫెక్ట్' వెబ్ సిరీస్ నుండి తాజాగా ట్రైలర్ విడుదలైంది. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై సుప్రియ యార్లగడ్డ ఈ సిరీస్‌ని నిర్మించారు. విశ్వక్ ఖండేరావ్ దర్శకుడు. ఫిబ్రవరి 2వ తేదీ నుంచి డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో ఈ సిరీస్ స్ట్రీమింగ్‌కు రెడీ అవుతోంది. 'కొత్త టాలెంట్ ను ప్రోత్సహించడం అంటే నాగార్జున గారికి, నాగేశ్వరరావు గారికి చాలా ఇష్టం. అందుకే అన్నపూర్ణ సంస్థలో చాలా మంది కొత్త వాళ్లకు అవకాశాలు ఇచ్చారు. ఇప్పుడు ఈ 'మిస్ పర్ఫెక్ట్' వెబ్ సిరీస్‌తో మేము అదే ప్రయత్నం చేశాం, అని నిర్మాత యార్లగడ్డ సుప్రియ అన్నారు.

వేసవిలో భారతీయుడు-2 ?



హీరో కమల్‌హాసన్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న సినిమా భారతీయుడు–2. భారతీయుడు చిత్రానికి ఇది సీక్వెల్. తమిళ సంవత్సరాదిరోజైన ఏప్రిల్ 14న ఈ సినిమా వేసవి విడుదల చేయటానికి చిత్రబృందం ఏర్పాట్లు చేస్తోంది. ప్రముఖ దర్శకుడు శంకర్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. హీరోయిన్‌గా కాజల్ నటిస్తున్నారు. సినిమా చిత్రీకరణ పూర్తయ్యిందని ఇటీవలే చిత్రబృదం ప్రకటించిన విషయం విధితమే. అయితే అధికారికంగా తేదీ ప్రకటించాల్సివుంది. సిద్ధార్థ్, రకుల్‌ప్రీత్‌సింగ్ కీలకపాత్రలు పోషించారు.

సైఫ్ ఆలీఖాన్‌కు గాయాలు



ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న 'దేవర' సినిమాలో విలన్‌గా బాలీవుడ్ స్టార్ సైఫ్ ఆలీఖాన్ నటిస్తున్నారు. ప్రతినాయకుడిగా యాక్షన్ సన్నివేశాల్లో షూట్ జరుగుతున్న సమయంలో జరిగిన ప్రమాదంలో ఆయన మోకాలు, భుజానికి గాయాలు కావటంతో ముంబైలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో చేర్పించారు. దేవర సినిమా రెండు భాగాలుగా వస్తున్న విషయం తెలిసిందే. మొదటి భాగం ఏప్రిల్ 5న విడుదల కానుంది.

జూన్ 24న ఎమర్జెన్సీ విడుదల


బాలీవుడ్ నటి కంగనా రనౌత్ నటించిన తాజా చిత్రం 'ఎమర్జెన్సీ'. ఇప్పటికే మూడుసార్లు ఈ సినిమా విడుదల వాయిదాపడిన విషయం తెలిసిందే. తాజాగా ఓ మీడియా ఛానల్‌కు ఆమె ఇంటర్వ్యూ ఇచ్చారు. 'జూన్ 24న విడుదల చేయాలని నిర్ణయించాం. ఎమర్జెన్సీ నాకు చాలా ప్రతిష్టాత్మక ప్రాజెక్టు. మణికర్ణిక తర్వాత నేను డైరెక్ట్ చేసిన రెండో సినిమా ఇది. ఈ పెద్ద ప్రాజెక్టు కోసం జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ప్రతిభావంతులు పనిచేశారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జీవితం ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించాం. ఇదొక పీరియాడిక్ డ్రామా' అని వివరించారు. ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తూ, నిర్మాతగా వ్యవహరించిన కంగనా ఇందిరాగాంధీ పాత్రలో నటించారు.

సెమీస్‌కు సబలెంకా, గాఫ్

- జకోవిచ్, సిన్నర్ కూడా..
- ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ



సబలెంకా



కోకా గాఫ్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ సెమీఫైనల్లోకి 2వ సీడ్ సబలెంకా(రష్యా), అమెరికా సంచలనం, 4వ సీడ్ కోకా గాఫ్ ప్రవేశించారు. మంగళవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో గాఫ్ 7–6(8–6), 6–7(3–7), 6–2తో ఎం. కోస్ట్యుక్(ఉక్రెయిన్)ను చిత్తుచేసింది. మరో క్వార్టర్స్‌లో 2వ సీడ్ సబలెంక 6–2, 6–3తో వరుససెట్లలో 9వ సీడ్, చెక్ రిపబ్లిక్‌కు చెందిన క్రేజికోవాను ఓడించింది. 4వ సీడ్ గాఫ్ అన్‌సీడెడ్ కోస్ట్యుక్‌ను చిత్తుచేసేందుకు చెమటోడ్చాల్సి వచ్చింది. తొలి సెట్‌ను టై బ్రేక్‌లో చేజిక్కుంచుకొనేందుకు చెమటోడ్చాల్సి వచ్చిన గాఫ్.. రెండో సెట్‌లోనూ టై బ్రేక్‌లోనే ప్రత్యర్ధికి కోల్పోయింది. ఇక నిర్ణయాత్మక మూడో సెట్ ప్రారంభం నుంచే కోస్ట్యుక్‌పై ఆధిపత్యం చెలాయించిన గాఫ్.. రెండు సర్వీసులను బ్రేక్ చేసింది. గురువారం జరిగే సెమీస్‌లో గాఫ్ 2వ సీడ్ సబలెంకాతో తలపడనుంది.

జకో, సిన్నర్ జోరు..

పురుషుల సింగిల్స్‌లో టాప్‌సీడ్, అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల విజేత నొవాక్ జకోవిచ్(సెర్బియా) జోరుకు తిరుగులేదు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి క్వార్టర్‌ఫైనల్లో జకోవిచ్ 7–6(7–3), 4–6, 6–2, 6–3తో 12వ సీడ్ ఫ్రిట్జ్(అమెరికా)ను ఓడించాడు. ఇక 4వ సీడ్ సిన్నర్(ఇటలీ) 6–4, 7–6(7–5), 6–3తో 5వ సీడ్ రుబ్లేవ్(రష్యా)ను ఓడించాడు. రెండో సెట్‌లో మినహా మిగిలిన రెండు సెట్లలో సిన్నర్ జోరు కొనసాగింది. శుక్రవారం జరిగే సెమీస్‌లో సిన్నర్ టాప్‌సీడ్ జకోవిచ్‌తో తలపడనున్నాడు.

మళ్లీ టాప్‌లోకి సాత్విక్-చిరాగ్ జోడి

ప్రణయ్‌కు 8వ ర్యాంక్
బిడబ్ల్యుఎఫ్ ర్యాంకింగ్స్ విడుదల



లాసన్నె: ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య(బిడబ్ల్యుఎఫ్) తాజా ర్యాంకింగ్స్‌లో భారత డబుల్స్ జోడీ చిరాగ్–సాత్విక్ సత్తా చాటారు. బిడబ్ల్యుఎఫ్ మంగళవారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో భారత జంట మళ్లీ నంబర్‌వన్ స్థానానికి ఎగబాకారు. చైనాకు చెందిన లియాంగ్ వీ కెంగ్, వాంగ్ చాంగ్ జోడీని వెనక్కి నెట్టి అగ్రస్థానం కైవసం చేసుకున్నారు. మలేషియా ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచినప్పటికీ భారత జోడీకి టాప్ ర్యాంక్ దక్కడం విశేషం. పురుషుల సింగిల్స్‌లో నిలకడగా రాణిస్తున్న హెచ్‌ఎస్ ప్రణయ్ 8వ ర్యాంక్‌తో సరిపెట్టుకున్నాడు. ఇక మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప, తానీసా క్రాస్టో 20వ ర్యాంక్ సొంతం చేసుకున్నారు. గత ఏడాది సాత్విక్–చిరాగ్ జోడీ తొలిసారి నంబర్‌వన్ ర్యాంక్‌కు సాధించింది. తర్వాత జరిగిన ఫ్రెంచ్ ఓపెన్‌లో సాత్విక్, చిరాగ్‌లు నిరాశ పరిచారు. అలా మూడు వారాల్లోనే లియాంగ్, వాంగ్ ద్వయం టాప్ సీడ్ దక్కించుకోగా.. భారత జోడీ రెండో సీడ్‌కు పరిమితమైంది. 2023లో ఈ స్టార్ జోడీ పలు ట్రోఫీలు కొల్లగొట్టింది. ఆసియా ఛాంపియన్‌షిప్, ఇండోనేషియా ఓపెన్ సూపర్ 1000 టైటిల్ విజేతగా అవతరించింది.

ఇండియా-ఎ జట్టులో రింకు సింగ్‌కు చోటు

ఇంగ్లండ్ లయన్స్‌తో నాలుగురోజుల మ్యాచ్



ముంబయి: ఇంగ్లండ్ లయన్స్‌తో జరిగే రెండో నాలుగురోజుల మ్యాచ్‌లో ఇండియా–ఎ కెప్టెన్‌గా రింకు సింగ్ ఎంపికయ్యాడు. ఈమేరకు బిసిసిఐ మంగళవారం ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. ఉత్తప్రదేశ్‌కు చెందిన ఎడమచేతివాటం బ్యాటర్ అయిన రింకు.. 44 ఫస్ట్‌క్లాస్ మ్యాచుల్లో 57.57 యావరేజ్‌తో 3,109 పరుగులు చేశాడు. దక్షిణాఫ్రికా టి20 సిరీస్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన రింకు సింగ్ ఆ రెండు మ్యాచుల్లో 17, 38పరుగులు చేశాడు. బుధవారం నుంచి అహ్మదాబాద్ వేదికగా ఇంగ్లండ్ లయన్స్‌తో ఇండియా–ఎ జట్టు రెండో నాలుగు రోజుల మ్యాచ్‌ను ఆడనుంది. **జట్టు: అభిమన్యు ఈశ్వరన్, సాయి సుదర్శన్, రజత్ పటీధర్, సర్ఫరాజ్ ఖాన్, తిలక్ వర్మ, కుషగ్ర, సుందర్, సౌరభ్ కుమార్, అర్షదీప్ సింగ్, తుషార్ దేశ్‌పాండే, కావేరప్ప, ఉపేంద్ర యాదవ్, ఆకాశ్ దీప్, యశ్ దయాల్, రింకు సింగ్.**

పోరాడి ఓడిన ఛెత్రీ సేన

చివరి లీగ్‌లో సిరియా1-0తో ఓటమి

ఖతార్: ఎఎఫ్‌సి ఆసియాకప్ ఫుట్‌బాల్ టోర్నీ చివరి లీగ్‌లోనూ ఛెత్రీ సేన ఓటమిపాలైంది. మంగళవారం జరిగిన గ్రూప్–బి చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 0–1గోల్‌తో సిరియా చేతిలో ఓడింది. సిరియా తరపున ఏకైక గోల్‌ను ఖ్రిబిన్ 75వ ని.లో కొట్టాడు. ఈ ఓటమితో ఈ గ్రూప్‌లో భారత్ చివరిస్థానంలో నిలిచింది. ఇదే గ్రూప్‌లో ఉన్న ఆస్ట్రేలియా 3మ్యాచుల్లో 2 గెలిచి ఒక మ్యాచ్ డ్రా చేసుకొని 7పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా.. ఉజ్బెకిస్తాన్ ఒక మ్యాచ్‌లో గెలిచి రెండు మ్యాచ్‌లను డ్రాతో సహా 5పాయింట్లతో రెండోస్థానంలో నిలిచి నాకౌట్‌కు అర్హత సాధించింది. సిరియా 4పాయింట్లతో మూడోస్థానంలో ఉండగా.. భారత్ మూడో మ్యాచుల్లో 6గోల్స్ సమర్పించుకొని చివరి స్థానంలో ఉంది. ఆస్ట్రేలియాపై 2–0తో, ఉజ్బెకిస్తాన్‌పై 3–0తో, సిరియాపై 1–0తో ఛెత్రీసేన పరాజయాల్ని చవిచూసింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68